www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

విద్యార్థుల నోట 'అధ్యక్షా..!'

26న అసెంబ్లీ ఆవరణలో 'స్టూడెంట్ అసెంబ్లీ'.. రాజ్యాంగ దినోత్సవం నాడు కార్యక్రమం

అచ్చం అసెంబ్లీ తరహాలోనే కార్యకలాపాలు.. వినూత్నంగా, వైవిధ్యంగా నిర్వహణకు ఏర్పాట్లు

175 నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా విద్యార్థులు.. వారి నుంచే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక

ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలుగానూ వారే.. ప్రశ్నోత్తరాలు, జీవో అవర్, బిల్లులపై చర్చ

ప్రత్యక్షంగా వీక్షించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు

9

శనివారం | 22-11-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 217 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: విదియ సా.5:12 తదియ, నక్షత్రం: జ్యేష్ఠ సా.4:47 తదుపరి మూల, వర్జ్యం: రా.1:40-3:27, దుర్ముహూర్తం: ఉ.6:27-7:56, అమృతఘడియలు: ఉ.6:56-8:43, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6:27, సూర్యాస్తమయం: 5:34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్


విజయవాడ ● శనివారం 22 నవంబరు 2025

శ్రేయాస్..ఇంకో రెండు నెలలు

ముంబై: భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ బరిలోకి దిగేందుకు మరింత సమయం పట్టేలా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన మూడో వన్డేలో శ్రేయాస్ పక్కటెముకల గాయానికి గురై ఐసీయూలో చేరిన విషయం తెలిసిందే. చిన్నపాటి సర్జరీ తర్వాత ప్రస్తుతం కోలుకుంటున్న తనకు మరో రెండు నెలలపాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు తెలిపారు. ఆ తర్వాత అల్ట్రాసోనోగ్రఫీ స్కానింగ్ చేశాకే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ పునరావాస శిబిరంలో చేరతాడు. దీంతో వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ వరకు అతను బ్యాట్ పట్టే అవకాశం లేదు.

తొలిరోజే 19 వికెట్లు

- ఇంగ్లండ్ 172 ఆలౌట్
- ఆస్ట్రేలియా 123/9
- స్టార్క్‌కు 7, స్టోక్స్‌కు 5 వికెట్లు
- యాషెస్ మొదటి టెస్టు



పెర్త్: యాషెస్ సిరీస్‌లో తొలిరోజు ఏకంగా 19 వికెట్లు నేల కూలాయి. శుక్రవారం ప్రారంభమైన తొలి టెస్టులో స్టార్క్ (7/58) కెరీర్ ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన చేయడంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 172 పరుగులకే ఆలౌటైంది. బ్రూక్ (52), పోప్ (46) రాణించారు. అయితే ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా బెన్‌స్టోక్స్ బౌలింగ్‌కు దాసోహమైంది. స్టోక్స్ ఐదు వికెట్లతో చెలరేగడంతో తొలి రోజు చివరకు ఆస్ట్రేలియా 123/9 స్కోరుతో ఇక్కట్లలో పడింది. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 49 రన్స్ దూరంలో నిలిచింది.

సూపర్ ఓవర్‌లో భారత్ 'ఎ' ఓటమి

బంగ్లా 'ఎ'తో రైజింగ్ స్టార్స్ కప్ సెమీస్

దోహ: బ్యాటింగ్, బౌలింగ్‌లో చెత్త ప్రదర్శన చేసిన భారత్ 'ఎ' జట్టు రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టీ20టోర్నీలో సెమీఫైనల్లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 'ఎ' సూపర్ ఓవర్లో గెలుపొందింది. తొలుత బంగ్లా 20 ఓవర్లలో 194/6 స్కోరు చేసింది. హబీబుర్ రహ్మాన్ (65), మెహరాబ్ (48 నాటౌట్) సత్తా చాటారు. ఛేదనలో భారత్ కూడా 20 ఓవర్లలో 194/6 స్కోరే చేసింది. ప్రియాన్ష్ ఆర్య (44), వైభవ్ (38) రాణించారు. తుది బంతికి 4 పరుగులు చేయాల్సిన ఉండగా మనోళ్లు 3 పరుగులే రాబట్టడంతో మ్యాచ్ టై అయ్యింది. సూపర్ ఓవర్లో జితేష్, రమణ్‌దీప్‌లను బ్యాటింగ్ పంపిన వ్యూహం బెడిసింది. జితేష్‌తోపాటు తర్వాత వచ్చిన అశుతోష్ కూడా డకౌట్ కావడం గమనార్హం. ఇక.. బంగ్లాదేశ్ 'ఎ' విజయానికి ఒక పరుగు అవసరం కాగా.. సుయాష్ వైడ్ వేయడంతో భారత్ 'ఎ' కథ ముగిసింది.

సమమా.. సమర్పణమా?

ఒత్తిడిలో టీమిండియా



కెప్టెన్ గిల్ దూరం

సిరీస్‌పై దక్షిణాఫ్రికా దృష్టి

నేటి నుంచి రెండో టెస్టు

ఉ.9 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో


బవుమా

గువాహటి: తొలి టెస్టులో చిత్తయిన భారత జట్టు.. ఇప్పుడు కెప్టెన్ గిల్ లేకుండానే సిరీస్ నిర్ణాయక మ్యాచ్ బరిలోకి దిగనుంది. 0-1తో వెనుకబడిన టీమిండియా ఈ సిరీస్‌ను సమం చేయాలంటే నేటి నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే ఈ రెండో టెస్టులో గెలిచి తీరాల్సిందే. అందుకే కీపర్ రిషబ్ పంత్ నేతృత్వంలో బరిలోకి దిగబోతున్న టీమిండియా తీవ్ర ఒత్తిడిలోనే ఉంది. స్వదేశంలో ఆడుతున్నప్పటికీ చాలా ఏళ్ల తర్వాత తొలిసారిగా భారత్‌ను ఫేవరెట్‌గా పరిగణించలేని పరిస్థితి నెలకొంది. మొదటి టెస్టులో టర్నింగ్ పిచ్‌పై సఫారీ స్పిన్నర్లు అదరగొట్టి ఆతిథ్య భారత్‌ను కంగుతినిపించారు. గువాహటిలోనూ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న బవుమా సేన భారత గడ్డపై పాతికేళ్ల తర్వాత ఓ టెస్టు సిరీస్‌ను నెగ్గాలనే కసితో ఉంది. ఒకవేళ భారత్ ఈ టెస్టును కూడా కోల్పోతే కోచ్ గంభీర్‌పై విమర్శలు తప్పవు. ఇప్పటికే జట్టు భారత్‌లో ఆడిన చివరి ఆరు టెస్టుల్లో నాలుగింటిని ఓడిపోగా.. ఏడాదిలో రెండోసారి వైట్‌వాష్‌కు దగ్గరగా ఉంది.

గిల్ స్థానంలో ఎవరు?

కెప్టెన్ గిల్ దూరం కావడంతో అతడి స్థానంలో ఆడే ఆటగాడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కళ్ మధ్య పోటీ నెలకొంది. జట్టు వర్గాల సమాచారం ప్రకారం సాయికే బెర్త్ దక్కే అవకాశం కనిపిస్తోంది. తాత్కాలిక కెప్టెన్ పంత్ మాత్రం.. ఎవరాడేదీ బరిలోకి దిగే ఆటగాడికి తెలుసంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించాడు. ఇక తొలి టెస్టులో భారత్ నుంచి ఒక్క అర్ధసెంచరీ కూడా నమోదుకాలేదు. ఓపెనర్ రాహుల్, సుందర్ మోస్తరుగా రాణించారు. జైస్వాల్, జురెల్, పంత్ బ్యాట్లు ఝుళిపించాల్సి ఉంది. పిచ్ పరిస్థితిని బట్టి పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌కు చాన్స్ దక్కనుంది. అదే జరిగితే స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ బెంచీకే పరిమితం కానున్నాడు. పేసర్లు బుమ్రా, సిరాజ్ ప్రభావం చూపగలుగుతున్నారు. జడేజా, కుల్దీప్ స్పిన్‌లో కీలకం కానున్నారు.

రబాడ అవుట్

గెలుపు జోరు మీదున్న సౌతాఫ్రికా సిరీస్‌ను చేజారనీయకూడదనే ఆలోచనలో ఉంది. ముఖ్యంగా స్పిన్నర్ హార్మర్ భారత్‌కు ప్రమాదకరంగా మారాడు. ఈ టెస్టులోనూ జట్టు అతడిపైనే ఎక్కువగా ఆధారపడింది. ఇంకో స్పిన్నర్ కేశవ్ అతడికి అండగా ఉంటాడు. మరోవైపు గాయంతో బాధపడుతున్న ప్రధాన పేసర్ రబాడ ఈ మ్యాచ్‌కూ దూరం కానున్నాడు. అతడు లేని లోటును భర్తీ చేస్తూ మరో పేసర్ యాన్సెన్ ఆరంభంలోనే వికెట్లు తీస్తూ భారత్‌ను ఒత్తిడిలోకి నెడుతున్నాడు. ఇక ఆకట్టుకోలేకపోతున్న బాష్ స్థానంలో పేసర్ ఎన్‌గిడిని తీసుకోవచ్చు. అయితే సఫారీ బ్యాటర్లలో కెప్టెన్ బవుమా ఒక్కడే పోరాడుతున్నాడు. టాపార్డర్ అండగా నిలవాల్సి ఉంది. మిడిలార్డర్‌లో జోర్జి, స్టబ్స్ నిలకడగా ఆడితే భారీ స్కోరు ఖాయం.

జట్టును వీడిన శుభ్‌మన్

మెడ నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శుక్రవారం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో విఫలమయ్యాడు. దీంతో రెండో టెస్టుకు దూరమైన తను జట్టును వీడి ముంబైకి చేరుకున్నాడు. అక్కడే కొన్ని రోజుల విశ్రాంతి తర్వాత మరోసారి వైద్యులను సంప్రదించనున్నాడు. మరోవైపు ఈనెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానుంది. అప్పటివరకు అతను కోలుకుంటాడా? లేదా? అనేది కూడా ఆసక్తికరంగా మారింది.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, జురెల్, రిషబ్ పంత్ (కెప్టెన్), జడేజా, నితీశ్/అక్షర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: రికెల్టన్, మార్‌క్రమ్, ముల్డర్, బవుమా (కెప్టెన్), జోర్జి, స్టబ్స్, వెరీన్, యాన్సెన్, ఎన్‌గిడి, హార్మర్, కేశవ్ మహారాజ్.

పిచ్, వాతావరణం

రెండో టెస్టు పిచ్ ఎలా స్పందిస్తుందనే విషయమై జోరుగా చర్చ సాగుతోంది. ఈ మైదానంలో ఇదే మొట్టమొదటి టెస్టు కాగా.. పిచ్‌ను ఎర్ర మట్టితో రూపొందించారు. కాస్త పచ్చిక కనిపిస్తుండడంతో దాన్ని కత్తిరిస్తారా? లేదా? తెలియాల్సి ఉంది. ఒకవేళ కట్ చేస్తే ఆరంభంలో బౌన్స్‌కు అవకాశమిచ్చినా.. ఆ తర్వాత స్పిన్నర్లదే ఆధిపత్యం. ఇక ఈశాన్య భారతంలో సూర్యాస్తమయం త్వరగా ఉంటుంది కాబట్టి మ్యాచ్ అర్ధగంట ముందే.. అంటే 9 గంటలకే ఆరంభం కానుంది. భారత క్రికెట్ చరిత్రలో ఈ కొత్త స్టేడియం 30వ టెస్టు వేదికగా నిలవబోతోంది.



టెస్టు చరిత్రలో తొలిసారి..

148 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో మొదటిసారి లంచ్ కంటే ముందే ఇక్కడ టీ విరామం తీసుకోనున్నారు. అంటే ఉదయం 11 గంటల నుంచి 11.20 వరకూ టీ, తర్వాత మధ్యాహ్నం 1.20 నుంచి 2 గంటలవరకూ భోజన విరామం ఉంటుంది. ఇక్కడ శీతాకాలంలో సూర్యోదయ, సూర్యాస్తమయాలు త్వరగా అవుతాయి. కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు.

బవుమా, మార్‌క్రమ్‌లకు పగ్గాలు

భారత్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు దక్షిణాఫ్రికా జట్ల ఎంపిక

జొహన్నెస్‌బర్గ్: భారత్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు దక్షిణాఫ్రికా జట్లను శుక్రవారం ప్రకటించారు. వన్డేలకు బవుమాను, టీ20లకు మార్‌క్రమ్‌ను కెప్టెన్లుగా ఎంపిక చేశారు. రెండు జట్ల మధ్య మూడు వన్డేలు (నవంబరు 30-డిసెంబరు 6), ఐదు టీ20 (డిసెంబరు 9-19)లు జరగనున్నాయి.

వన్డే జట్టు: బవుమా (కెప్టెన్), బార్ట్‌మన్, బ్రీట్జ్‌కే, బ్రేవిస్, బర్గర్, డికాక్, టోనీ జోర్జి, రూబిన్ హెర్మన్, యాన్సెన్, కేశవ్, మార్‌క్రమ్, ఎన్‌గిడి, రికెల్టన్, సుబ్రేయన్.

టీ20 జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), బార్ట్‌మన్, బాష్, బ్రేవిస్, డికాక్, టోనీ జోర్జి, ఫెరీరా, హెన్‌డ్రిక్స్, యాన్సెన్, జార్జ్ లిండే, కేశవ్, ఎంపాక, మిల్లర్, ఎన్‌గిడి, నోకియా, స్టబ్స్

సెమీస్‌కు లక్ష్యసేన్

సాత్విక్ జోడీ అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్‌కు దూసుకుపోగా..టాప్ సీడ్ భారత జోడీ సాత్విక్/చిరాగ్ క్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రౌండ్-8 పోరులో లక్ష్యసేన్ 23-21, 21-11తో సహచరుడు ఆయుష్ షెట్టిపై నెగ్గాడు. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 19-21, 15-21తో ఫజర్/ఫిక్రి (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడారు.

డబ్ల్యూపీఎల్ వేలంలో 277 మంది

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో 277 మంది ప్లేయర్లు అందుబాటులో ఉండనున్నారు. ఈనెల 27న వేలం జరుగనుండగా శుక్రవారం క్రికెటర్ల జాబితాను వెల్లడించారు. ఇందులో 197 మంది భారత్, 83 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. ఐదు ఫ్రాంచైజీల దగ్గర కలిపి రూ.41.1 కోట్ల పర్స్ ఉండగా.. ఇందులో నుంచే 73 స్లాట్ల కోసం పోటీ పడనున్నాయి. ఇక గరిష్ఠ ధర రూ.50 లక్షలతో 19 మంది ప్లేయర్లు రిజిస్టర్ చేసుకున్నారు. భారత్ నుంచి ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు హర్లీన్, ప్రతీకా రావల్, పూజా వస్త్రాకర్, ఉమా ఛెత్రి, క్రాంతి గౌడ్ ఈ విభాగంలో ఉన్నారు. ఆ తర్వాత రూ.40 లక్షల కేటగిరీలో 11 మంది, రూ.30 లక్షల ప్రాథమిక ధరతో 88 మంది వేలానికి అందుబాటులో ఉన్నారు.

శౌర్యకు రజతం

టోక్యో: బధిర ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్‌కు మరో పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో శౌర్య సైనీ 450.6 పాయింట్లతో రజత పతకం అందుకున్నాడు. శౌర్య రజతంతో కలిపి.. ఈ పోటీల షూటింగ్‌లో భారత్ పతకాల సంఖ్య 13కి చేరింది.

స్టేడియంలో స్మృతికి పలాష్ సర్‌ప్రైజ్



కప్పు నెగ్గిన చోటే పెళ్లి ప్రతిపాదన

రేపు ఒక్కటికానున్న జంట

న్యూఢిల్లీ: దాదాపు ఆరేళ్ల ప్రేమలో మునిగితేలిన టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన, బాలీవుడ్ యువ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ ఆదివారం వివాహ బంధంతో ఒక్కటి కానున్నారు. అయితే, అంతకంటే ముందు పలాష్ తనకు కాబోయే శ్రీమతి స్మృతీకి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ఇటీవల భారత మహిళల జట్టు ప్రపంచ కప్ నెగ్గిన ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలోనే మంధానకు పెళ్లి ప్రతిపాదన చేశాడు. కళ్లకు గంతలు కట్టి స్మృతీని మైదానంలోకి తీసుకొచ్చిన పలాష్.. అనంతరం ఆమె గంతలు తీసేసి, మోకాళ్లపై కూర్చొని నన్ను పెళ్లి చేసుకుంటావా? అని అడిగాడు. ఈ అనూహ్య పరిణామంతో ఉద్వేగానికి లోనైన మంధాన.. సరేననడంతో ఇద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు. ఇక, స్మృతి ఇంట శుక్రవారం హల్దీ వేడుక నిర్వహించారు. సహచర క్రికెటర్లు జెమీమా, షఫాలీ వర్మ, అరుంధతీ రెడ్డి, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్ తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ వినూత్న విషెష్

ఈ శుభ సందర్భంలో కాబోయే వధూవరులకు పలువురు సెలెబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ వినూత్న రీతిలో విషెస్ చెప్పారు. స్మృతీ మంధాన అద్భుతమైన కవర్ డ్రైవ్, పలాష్ స్వర సమ్మేళనం కలిసి మరపురాని భాగస్వామ్యాన్ని నిర్మించాలని మోదీ ట్వీట్ చేశారు.

బంగ్లాదేశ్‌కు భారీ ఆధిక్యం

ఐర్లాండ్‌తో రెండో టెస్ట్

మీర్పూర్: ఐర్లాండ్‌తో రెండో టెస్టులో బంగ్లాదేశ్ భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి ఆతిథ్య జట్టు వికెట్ నష్టానికి 156 పరుగులు చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 211 పరుగులతో కలిపి మొత్తంగా బంగ్లాదేశ్ 367 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు ఐర్లాండ్ 265 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,480 ▼	1,14,100 ▼	1,61,000 ▼
విజయవాడ	1,25,500 ▼	1,17,000 ▼	1,60,000 ▼
విశాఖపట్నం	1,27,250 ▲	1,14,300 ▼	1,69,000 ▼
రాజమండ్రి	1,23,980 ▼	1,13,650 ▼	1,55,000 ▼
ప్రొద్దుటూరు	1,24,300 ▼	1,14,360 ▼	1,55,700 ▼
ముంబై	1,23,146 ▲	1,12,802 ▲	1,51,129 ▼


మార్కెట్ మళ్లీ డౌన్

సెన్సెక్స్ 400 పాయింట్లు పతనం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. సెన్సెక్స్ శుక్రవారం 400.76 పాయింట్లు కోల్పోయి 85,231.92 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 124 పాయింట్ల నష్టంతో 26,068.15 వద్ద ముగిసింది. ఏఐ టెక్నాలజీ షేర్లలో ఏర్పడిన బుడగ ఎప్పుడైన పేలవచ్చన్న ఆందోళనతో అమెరికా సహా అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు ఒత్తిడికి లోనవుతుండటంతో పాటు డిసెంబరులో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న ఆశలు ఆవిరి కావడం ఇందుకు కారణమైంది.

1:5 నిష్పత్తిలో కోటక్ బ్యాంక్ షేర్ల విభజన: షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించేందుకు తమ బోర్డు ఆమోదం తెలిపిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ శుక్రవారం ప్రకటించింది. అంటే, రూ.5 ముఖ విలువతో కూడిన ఒక షేరును రూపాయి ముఖ విలువతో కూడిన 5 షేర్లుగా విభజించనుంది. ఈ బ్యాంక్ 2010 లోనూ రూ.10 ముఖవిలువ కలిగిన షేరును రూ.5 ముఖవిలువతో కూడిన 2షేర్లుగా విభజించింది. రిటైల్ ఇన్వెస్టర్లకు తమ షేరు అందుబాటు ధరలో ఉండేందుకు వీలుగా ఈ విభజన జరుపుతున్నట్లు పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	640	విజయవాడ	660
వరంగల్	642	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	106
వరంగల్	112	గుంటూరు	108
కరీంనగర్	112	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	105	అనంతపురం	109
గోదావరి	106		

బీఎస్ఎన్ఎల్ వాయిస్ ఓవర్ వైఫై సేవలు

సంస్థ సీఎండీ రవి వెల్లడి



విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు వాయిస్ ఓవర్ వైఫై సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ సీఎండీ ఏ రాబర్ట్ జెరార్డ్ రవి వెల్లడించారు. శుక్రవారం నాడిక్కడ బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టవర్ నెట్‌వర్క్ లేని ప్రదేశంలో వినియోగదారులకు ఈ సేవలు ఉపయోగపడతాయన్నారు. నెట్‌వర్క్ లేకపోయినా అందుబాటులో ఉన్న వైఫై జోన్ ద్వారా వాయిస్ సేవలు పొందే వెసులుబాటు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సరికొత్త టవర్లను ప్రారంభించిన తరుణంలో ఆకర్షణీయమైన టారిఫ్‌లతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం విజయవాడ నుంచి అమరావతి రోడ్డు మార్గంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను పరిశీలించే డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సర్కిల్ జనరల్ మేనేజర్ ఎం.సింహాచలం పాల్గొన్నారు.

- పుణెలోని తయారీ కేంద్రాన్ని సుమారు రూ.123 కోట్ల (1.4 కోట్ల డాలర్లు) పెట్టుబడితో విస్తరించనున్నట్లు జీఈ ఏరోస్పేస్ ప్రకటించింది. జీఈ, సాఫ్రాన్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో జీఈ90, జీఈఎన్ఎక్స్, జీఈ9ఎక్స్, లీప్ ఇంజన్ల కోసం అవసరమైన కాంపోనెంట్స్‌ను తయారు చేయనుంది.
- రెమెడియం హెల్త్‌కేర్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.111.05 కోట్ల కన్సాలిడేటెడ్ కార్యకలాపాల ఆదాయంపై రూ.8.62 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కాగా సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థంలో 224.42 కోట్ల రెవెన్యూపై 13.27 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.
- ఫ్యాబ్రిక్స్, హోమ్ టెక్స్‌టైల్స్ తయారీ సంస్థ గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.158.56 కోట్ల ఆదాయంపై రూ.4.46 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 220%, ఆదాయం 6.81% వృద్ధి చెందినట్లు వెల్లడించింది.

అయ్యో.. రూపాయే!

సరికొత్త రికార్డు కనిష్ఠానికి రూపాయి మారకం విలువ

- ఒక్కరోజే 98 పైసల పతనం
- తొలిసారిగా రూ. 89 దాటిన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు

రూ.89.66 వద్ద ముగింపు



ముంబై: భారత కరెన్సీ సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఏకంగా 98 పైసలు నష్టపోయి రూ.89.66 వద్ద ముగిసింది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.89 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. అంతేకాదు, గడిచిన 3 ఏళ్లకు పైగా కాలంలో రూపాయికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత. 2022 ఫిబ్రవరి 24న రూపాయి మారకం విలువ 99 పైసలు క్షీణించింది. రూపాయి మారకం విలువకు క్రితం ఆల్‌టైం ఇంట్రాడే కనిష్ఠం సెప్టెంబరు 30న రూ.88.85 వద్ద నమోదు కాగా.. అక్టోబరు 14న రూ.88.81 వద్ద క్రితం ఆల్‌టైమ్ ముగింపు నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి విలువ 4.6 శాతం మేర తగ్గింది. ఆసియాలోకెల్లా అత్యధికంగా తరిగిపోయిన కరెన్సీ మనదే.

కరెన్సీ క్షీణతకు కారణాలు

- దేశీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరగడం
- ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ఓ భారత కంపెనీపై అమెరికా ఆంక్షలు విధించింది
- అంతర్జాతీయంగా 6 ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ మళ్లీ బలపడటం. డాలర్ ఇండెక్స్ 100కు చేరుకుంది
- టెక్నాలజీ షేర్లలో భారీగా అమ్మకాల కారణంగా దేశీయంగా, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో కొనసాగాయి
- ట్రంప్ సుంకాలతో పెరిగిన వాణిజ్య సంబంధ అనిశ్చితులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ మన కరెన్సీపై గడిచిన కొన్ని నెలలుగా ఒత్తిడి పెంచాయి
- గత నెల ఎగుమతులు 11 శాతానికి పైగా క్షీణించి, బంగారం దిగుమతులు భారీగా పెరగడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి పెరగడమూ కరెన్సీ మారకంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది
- అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటమూ ఇన్వెస్టర్లను కలవర పెడుతున్నది.

త్వరలోనే రూ.90 దాటొచ్చు..

రూపాయి మారకం విలువ మున్ముందు మరింత క్షీణించవచ్చని యా వెల్త్ గ్లోబల్ రీసెర్చ్ డైరెక్టర్ అనూజ్ గుప్తా అన్నారు. డిసెంబరులో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న ఆశలు ఆవిరైపోతుండటంతో డాలర్ మళ్లీ పుంజుకుంటోందన్నారు. ఇప్పటికే 100కు చేరిన డాలర్ ఇండెక్స్ త్వరలో 102-103కు చేరుకోచ్చని, దేశీయంగా డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు త్వరలోనే రూ.90కి చేరవచ్చని గుప్తా అభిప్రాయపడ్డారు.

పర్మినెంట్ ఉద్యోగులెందుకు..

ఫ్రీలాన్స్ నిపుణులుండగా..!

రూటు మార్చిన కంపెనీలు | ఏటా 40% చొప్పున వృద్ధి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఉద్యోగాల స్వరూపం రోజురోజుకు మారిపోతోంది. గతంలోలా కంపెనీలు పర్మినెంట్ ఉద్యోగులను తీసుకునేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. తమ అవసరాలకు అవసరమైన వృత్తి నైపుణ్యాలు ఉన్న ఫ్రీలాన్సర్ల వైపు మొగ్గు చూపుతున్నాయి. తమకు కావలసిన నైపుణ్యాలు ఉన్న ఫ్రీలాన్సర్లు లభిస్తే రెగ్యులర్ ఉద్యోగులకు చెల్లించే జీతాల కంటే 30-40 శాతం అధికంగా చెల్లించి మరీ నియమించుకుంటున్నాయి. టెక్ ప్రాజెక్టుల్లో ఫ్రీలాన్స్ నిపుణులకు డిమాండ్ మరింత ఎక్కువగా ఉంది. ఏటా వీరి డిమాండ్ 40 శాతం చొప్పున పెరుగుతున్నట్టు కంపెనీలు-వృత్తి నిపుణులను అనుసంధానం చేసే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్లెక్సింగ్ ఐటీ' పేర్కొంది. గత ఏడాది కాలంగా చూసినా ఫ్రీలాన్సింగ్/గిగ్ నియామకాలు 25 నుంచి 30 శాతం పెరిగినట్టు టీమ్‌లీజ్ డిజిటల్ తెలిపింది.

వీరికి మరింత డిమాండ్: ప్రస్తుతం ఐటీ, టెక్ కంపెనీలతో పాటు దాదాపు అన్ని కంపెనీలు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ అమలు చేస్తున్నాయి. దీంతో కృత్రిమ మేధ (ఏఐ), దాని అప్లికేషన్లు, సైబర్ సెక్యూరిటీ, ఐటీ గవర్నెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో పట్టున్న ఫ్రీలాన్సర్లకు మంచి డిమాండ్ ఉంది. ఐటీ, టెక్ కంపెనీలు వీరిని ఇట్టే తన్నుకుపోతున్నాయి. ఇందుకోసం రెగ్యులర్ ఉద్యోగుల కంటే మంచి మంచి ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి. కార్మిక చట్టాల బాదరబందీ లేకపోవడంతో కంపెనీలు కూడా ఫ్రీలాన్సర్ల వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల్లో ఈ తరహా జాబ్ వర్క్ కంపెనీలకూ అనువుగా మారింది.

ఈ కంపెనీల్లో ఎక్కువ: ఫ్రీలాన్స్ నిపుణుల పట్ల మొగ్గు చూపుతున్న కంపెనీల్లో పారిశ్రామిక సేవలు, కన్సల్టెన్సీ, హెల్త్‌కేర్ కంపెనీలు ముందున్నాయి. గత ఏడాది మొత్తం డిమాండ్‌లో 60 శాతం ఈ మూడు రంగాలకు చెందిన కంపెనీల నుంచే వచ్చింది. ఐటీ, టెక్నాలజీ నుంచి వచ్చిన డిమాండ్ 10 శాతానికి మించి లేదు.

ఎఫ్ఎంసీజీ, ఆటోమోటివ్ కంపెనీలు కూడా ఫ్రీలాన్స్ నిపుణులను పెద్దఎత్తున నియమించుకుంటున్నాయి. కొన్ని కంపెనీల్లో ఫ్రీలాన్స్ నిపుణులు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ), చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ) వంటి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు.

డిజిటల్ గోల్డ్ మా పరిధిలో లేదు

- వాటిని నియంత్రించే యోచనా లేదు
- 'రీట్స్'ను సూచీల్లో చేర్చే ప్రతిపాదన
- సెబీ చైర్మన్ పాండే



న్యూఢిల్లీ: డిజిటల్ లేదా ఈ-గోల్డ్ నియంత్రణలపై సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టత ఇచ్చారు. వీటి నియంత్రణ తమ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. వీటి అమ్మకాలను నియంత్రించే యోచన కూడా లేదన్నారు. రీట్స్, ఇన్విట్స్‌పై జరిగిన ఒక సదస్సుకు హాజరైన పాండే మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం స్పష్టం చేశారు. మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమొడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్ మాత్రమే ప్రస్తుతం తమ నియంత్రణ పరిధిలో ఉన్నట్టు పాండే చెప్పారు. కాగా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్)ను స్టాక్ మార్కెట్ సూచీల్లో చేర్చే విషయాన్ని పరిశీలిస్తామని పాండే వెల్లడించారు. అయితే సంబంధిత అన్ని వర్గాలతో చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ప్రతిపాదన ఆచరణకు నోచుకుంటే రీట్స్ లిక్విడిటీ (లభ్యత) చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతుందన్నారు.

డిసెంబరు 17న సెబీ బోర్డు భేటీ

సెబీ బోర్డు డిసెంబరు 17న భేటీ అవుతోంది. ఈ భేటీలో అనేక కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఎంఎఫ్‌ల నిబంధనలు, స్టాక్ బ్రోకర్ల నియంత్రణ అంశాలను సమగ్రంగా సమీక్షించనున్నారు. ఎప్పుడో రూపొందించిన ఈ నిబంధనలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించే విషయాన్ని ఈ సమావేశంలో కూలంకషంగా చర్చిస్తారని భావిస్తున్నారు.

'ఎంఎఫ్'ల ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్లు బంద్!

పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వచ్చే ముందు కంపెనీలు జారీ చేసే షేర్ల ప్రీ-ప్లేస్‌మెంట్‌లో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లు పాల్గొనడాన్ని సెబీ నిషేధించినట్టు సమాచారం. అయితే ఐపీఓకు ఒకటి రెండు రోజుల ముందే జరిగే యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్ కోటాలో పాల్గొనేందుకు మాత్రం సెబీ అనుమతించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఐపీఓకు వచ్చే కంపెనీల షేర్ల లభ్యత (లిక్విడిటీ)తో పాటు వాటి విలువ మదింపులో పారదర్శకత పెంచేందుకు ఈ చర్య తోడ్పడుతుందని భావిస్తున్నారు.


11 వేల టయోటా హైరైడర్స్ రీకాల్

న్యూఢిల్లీ: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. 11,500 యూనిట్ల మిడ్-సైజ్ ఎస్‌యూవీ అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కార్లను స్వచ్ఛందంగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. 2024 డిసెంబర్ 9 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 29 మధ్య కాలంలో తయారైన ఈ వాహనాల్లో డాష్‌బోర్డులోని కాంబినేషన్ మీటర్‌లో లోపం ఉండటంతో ఈ కార్లను రీకాల్ చేస్తున్నట్లు తెలిపింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 22-11-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ

సాయి సేవా సముద్రం!

'అందరినీ ప్రేమించు అందరినీ సేవించు' నినాదం



- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ విశేష కార్యక్రమాలు
- తల్లి సూచనలతో సత్యసాయి సేవా మార్గం
- ఉచిత విద్య, వైద్యం, తాగునీటి పథకాలు
- ప్రభుత్వంతో సమానంగా అనేక ప్రాజెక్టులు
- 140 దేశాల్లో 'సేవాదళ్' కార్యక్రమాలు
- సాయి శివైక్యం తర్వాతా నిరాటంకంగా సేవలు
- రేపు సత్యసాయిబాబా శతజయంతి

14

దారి చూడు..



అనకాపల్లి జిల్లా చోడవరం సమీపంలోని అంభేరుపురం వద్ద భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు దుస్థితి

దుమ్ము చూడు..



కర్నూలు జిల్లాలో కంకర తేలిన ఎమ్మిగనూరు-కంబళదిన్నె రోడ్డు

రహదారులపై విపత్తుల పగ!

నాడు జగన్ సర్కారు ఐదేళ్లూ రహదారులను గాలికొదిలేసింది. రోడ్ల బాగుకు రూపాయి కూడా ఖర్చుపెట్టని పరిస్థితి. కూటమి సర్కారు రహదారుల నిర్వహణకు తొలి ప్రాధాన్యం ఇస్తూ... ఒకే ఏడాది రూ.2వేల కోట్లు ఖర్చు చేసింది. కానీ... ఏం లాభం! వరుస వర్షాలు, వరదలు, తుఫాన్ల దెబ్బకు రహదారుల పరిస్థితి ఘోరంగా తయారవుతోంది. ఎన్ని ప్యాచ్‌వర్క్‌లు చేసినా... అది మట్టిపాలే అవుతోంది.

- రాష్ట్రంలో రహదారులకు వరదలు, తుఫాన్ల దెబ్బ
- జగన్ హయాంలో ఐదేళ్లు దారులన్నీ ధ్వంసమే
- కనీస నిర్వహణకు నోచుకోక నరకానికి నకళ్లు
- వివిధ పథకాలకింద వచ్చిన నిధులూ మళ్లింపు
- గోతుల్లేని రోడ్లకు కూటమి సర్కారు ప్రాధాన్యం
- ఏడాదిలోనే గుంతలు పూడ్చేందుకు 2 వేల కోట్లు
- అంతలోనే వర్షాలు, తుఫాన్లతో దారులకు దెబ్బ
- వాటిని బాగుచేసేలోపే మళ్లీ 'మొంథా' విలయం
- దెబ్బతిన్న 3,388 వంతెనలు, 31వేల కి.మీ రోడ్లు
- తక్షణ మరమ్మతులకు 1,700 కోట్లు అవసరం
- పూర్తిగా బాగుకు రూ.6,150 కోట్లు కావాలి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

డబ్బు కట్టి ప్రయాణించే టోల్ రోడ్లను పక్కన పెట్టి... ఇతర రోడ్లపై సాఫీగా ప్రయాణం సాగుతోందంటే వాళ్లు అదృష్టం చేసుకున్నట్లే! 'ఆహా ఏమి ఈ భాగ్యం' అని మురిసిపోవాల్సిందే! అవును... రాష్ట్రంలో రహదారుల పరిస్థితి ఇలాగే ఉంది. రాష్ట్రంలో 31వేల కిలోమీటర్ల పరిధిలో గడబిడగా సాగే గతుకుల ప్రయాణమే! కూటమి సర్కారు వచ్చీ రాగానే రూ.2000 కోట్ల ప్రత్యేక నిధులతో గుంతలు పూడ్చే పనులు చేపట్టింది. ఆ పనులు పూర్తయి, కుదురుకునే లోపే వర్షాలు, తుఫానులు రోడ్లను తుడిచిపెట్టేశాయి. ఫలితంగా రోడ్ల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇక రహదారి వంతెనలు మరీ ఘోరంగా

మిగతా 13వ పేజీలో...

విధ్వంస దారులు

గుంతలతో నరకయాతన

- పగటి పూటే చుక్కలు.. అక్కడక్కడా ప్రమాదాలు
- తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో మరీ దారుణం
- కొన్ని చోట్ల జాతీయ రహదారులపైనా గోతులు


ఆంధ్రజ్యోతి విజిట్



పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే రోడ్డు దుస్థితి

పీపీపీ కాలేజీల నియంత్రణ సర్కారుదే

కొత్త మెడికల్ కాలేజీలపై సీఎం స్పష్టీకరణ
నాణ్యమైన వైద్య సేవలకే పీపీపీ విధానం



- ఒక్కో మెడికల్ కాలేజీకి 50 ఎకరాలు.. 25 ఎకరాల్లో కాలేజీ, ఆస్పత్రి
- 25 ఎకరాల్లో పారా మెడికల్, నర్సింగ్.. పేదలకు ఉచితంగా 70% పడకలు
- యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో తగ్గనున్న వైద్య భారం.. సమీక్షలో చంద్రబాబు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీపీపీ పద్ధతిలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలపై పర్యవేక్షణ, అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం సచివాలయంలో ఆయన ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు. మెడికల్ కాలేజీల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్ తదితర అంశాలపై అధికారులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. పేదలకు ఉచితంగా, మెరుగైన సేవలు అందించేందుకు మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పీపీపీ తొలి విడతలో చేపడుతున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందులలోని మెడికల్ కాలేజీల నిర్మాణ ప్రక్రియపై ఆయన ఆరాతీశారు. ప్రస్తుతం టెండరు ప్రక్రియలోభాగంగా నాలుగు దశలు దాటామని, వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, దానివల్ల నగరాలు, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఆధునిక వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రాంతాలకూ అందుతాయని వివరించారు. ప్రజలకు, విద్యార్థులకు

మిగతా 12వ పేజీలో...

మూడేళ్లలో 17 లక్షల ఇళ్లు

- 2029 జనవరికల్లా 'హౌసింగ్ ఫర్ ఆల్': సీఎం
- పొరపాట్లు జరక్కూడదు.. జాప్యం చేయకూడదు
- ప్రతి 3 నెలలకోసారి సామూహిక గృహప్రవేశాలు
- వచ్చే ఉగాదికి 5 లక్షల మందికి ఇళ్ల తాళాలు
- ఇక ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి
- టిడ్కో గృహ నిర్మాణ శాఖపై చంద్రబాబు సమీక్ష

'మీ కోసం'లో నేనూ పాల్గొంటా

- ప్రజాప్రతినిధులు, అధికారులూ హాజరుకావాలి
- నా లేఖను ప్రతి రైతు ఇంటికీ అందించాలి
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టిపెట్టాలి
- ఫార్మర్ యాప్‌తో అన్నదాత చెంతకు సాంకేతికత
- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

12



దుబాయ్ ఎయిర్‌షోలో

కూలిన తేజస్

- పెద్ద ఎత్తున మంటలు.. పైలట్ దుర్మరణం
- ప్రదర్శన చివరి రోజు ఘటన
- పైలట్ తప్పిదంతోనే?

2

ఏపీఎంఎస్ఐడీసీ

జీఎం అరెస్టు

- అక్రమాస్తుల కేసులో ఏసీబీ అదుపులో సూర్యకళ
- 27 చోట్ల స్థిరాస్తులు.. రూ.2 కోట్ల ఎఫ్‌డీలు గుర్తింపు

12

మార్చి 16 నుంచి

టెన్త్ పరీక్షలు

రోజు మార్చి రోజు నిర్వహణ

11

టీచర్లకు బోధనేతర పనులుండవు

- 423లో 200 సమస్యలు పరిష్కరించాం
- సర్వీస్ రూల్స్‌ను డీఈఓ, ఎంఈవోలకు అప్పగించం
- ఏపీటీఎఫ్ నేతలతో మంత్రి లోకేశ్

కార్మికులందరికీ



సామాజిక భద్రత

4 కార్మిక స్మృతులు అమల్లోకి.. కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం

- కార్మిక చట్టాల్లో భారీ సంస్కరణలు
- 29 చట్టాల స్థానంలో 4 కొత్త కోడ్‌లు
- ఉద్యోగులందరికీ నియామక పత్రాలు
- అందరికీ కనీస వేతనాలు తప్పనిసరి
- గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు నిర్వచనం
- ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది సర్వీసుకే గ్రాట్యుటీ
- 40 ఏళ్లు పైబడితే ఏటా వైద్య పరీక్షలు

అన్ని షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లో మహిళలు

న్యూఢిల్లీ, నవంబరు 21: కార్మిక చట్టాల విషయంలో కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి కార్మిక చట్టాల్లో భారీ సంస్కరణలను తీసుకొచ్చింది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న నాలుగు కార్మిక కోడ్ (స్మృతి)లను తక్షణమే అమల్లోకి తెస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. గిగ్ వర్కర్లకు కూడా సామాజిక భద్రత కల్పించడం, ఉద్యోగులందరికీ తప్పనిసరిగా నియామక పత్రాలు అందించడం, అన్ని రంగాల్లో

మిగతా 2వ పేజీలో...

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

- 15న విజయవాడ ఆస్పత్రి నుంచి ఆయనతోపాటు మరికొందరిని ఎస్ఐబీ పోలీసులు తీసుకెళ్లారు
- కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు చిత్రహింసలు పెట్టి చంపి కట్టుకథ అల్లారు
- టెక్ శంకర్ సహా మరికొందరిని అలాగే హత్య చేశారు
- ఫాసిస్టు ఆర్ఎస్ఎస్, బీజేపీ మనువాదుల దమనకాండ
- ఖనిజ దోపిడీ కోసమే నక్సల్స్ హత్యలు: మావోయిస్టు పార్టీ
- 23న దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని పిలుపు

14



సీఐ శంకరయ్య డిస్మిస్

- విచారణ కమిటీ ముందుకు రాని ఫలితం.. సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు
- వివేకా హత్య సాక్ష్యాలు చెరిపేసినా సీఐ వారించలేదని అప్పట్లో చంద్రబాబు ఆరోపణ
- తన ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ ఇటీవల సీఎంకే నోటీసులిచ్చిన శంకరయ్య
- వివేకా కేసు దర్యాప్తు సక్రమంగా చేయలేదని శంకరయ్యపై అభియోగాలు

9

మరో 3 నెలలు విజయానందే!

- సీఎస్‌గా కొనసాగింపునకు సీఎం నిర్ణయం
- ఫిబ్రవరి తర్వాత సాయిప్రసాద్‌కు చాన్స్

12

మూడేళ్లు.. 3 వేల 'పార్టీలు'


9

'డ్రగ్స్' సరఫరా కేసులో మరో కోణం

- కీలక సూత్రధారి వైసీపీ విద్యార్థి విభాగ నేత కొండారెడ్డి
- లోహిత్ యాదవ్ విచారణలో వెలుగులోకి విషయాలు

కర్ణాటకలో హైడ్రామా!.. ఢిల్లీ వెళ్లిన డీకే ఆప్త ఎమ్మెల్యేలు

2



మిస్‌యూనివర్స్‌గా మెక్సికో సుందరి ఫాతిమా బాష్

బ్యాంకాక్, నవంబరు 21: థాయ్‌లాండ్‌లో జరిగిన 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో మెక్సికో అందగత్తె ఫాతిమా ఫెర్నాండెజ్ బాష్ విశ్వ సుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. తన అందం, తెలివితేటలతో న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతగా నిలిచారు. పోటీ మధ్యలో అతిథ్య దేశానికి చెందిన ఓ హోస్ట్ ఆమెను అవమానించినా వెనకడుగు వేయకుండా ధైర్యంగా ఎదురు నిలిచి అందరి మన్ననలు పొందారు. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన అందాల భామ విక్టోరియా హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటం అందజేశారు. దాదాపు 120 దేశాల సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొనగా.. 25ఏళ్ల ఫాతిమాను విజయం వరించింది. థాయ్‌లాండ్ భామ మొదటి రన్నరప్‌గా నిలవగా, వెనెజువెలా సుందరి రెండో రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు.



పెళ్లి పీటలపై కాదు.. ఐసీయూలో వివాహం!

కొచ్చి, నవంబరు 21: పెళ్లి అంటే అదొక పండగ, ఎన్నో కలలు, మరెన్నో కోరికలు ఉంటాయి. కేరళలోని అలప్పుళకు చెందిన అవనికి కూడా అలాంటి ఉత్సాహంతోనే ఆ రోజు ఉదయం మొదలైంది. తంబోలికి చెందిన శరణ్‌తో శుక్రవారం మధ్యాహ్నం వివాహం జరగాల్సి ఉండగా.. అలంకరణ కోసం కుమారకోమ్ బయలుదేరింది. అయితే మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై కొచ్చిలోని ఓ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. పెళ్లి వాయిదా వేయడం ఎందుకని భావించిన ఇరు కుటుంబాల పెద్దలు ముహూర్త సమయంలోనే ఆస్పత్రి బెడ్‌పైనే పెళ్లి నిర్వహించాలనుకున్నారు. ఆస్పత్రిలో బెడ్‌పై ఉన్న అవనికి వరుడు తాళి కట్టాడు.

జీ20 సదస్సు కోసం దక్షిణాఫ్రికాకు మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రధాని మోదీ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జీ-20 శిఖరాగ్ర సదస్సు కోసం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌కు చేరుకున్నారు. అక్కడి విమానాశ్రయంలో సాంస్కృతిక ప్రదర్శన బృందం మోదీకి ఘన స్వాగతం పలికింది. 'ఐక్యత, సమానత్వం, స్థిరత్వం' అనే ఇతివృత్తంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు.

రెస్టారెంట్లకు జొమాటో కస్టమర్ల డేటా

న్యూఢిల్లీ, నవంబరు 21: ఫుడ్ డెలివరీ జెయింట్ జొమాటో తన కస్టమర్ల డేటాను రెస్టారెంట్లకు ఇవ్వడానికి సిద్ధమైంది. దీంతో రెస్టారెంట్లకు, జొమాటోకి మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. అయితే జొమాటో నిర్ణయంపై వినియోగదారుల్లో కలకలం రేగింది. డేటా రక్షణకు భంగం కలుగుతుందని, వినియోగదారుల సమాచారం దుర్వినియోగం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైరసీదారుల నుంచి కొని ఐబొమ్మలో అప్‌లోడ్

» పోలీసుల విచారణలో ఐ బొమ్మ రవి వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పైరసీ చేసినవారి(థర్డ్ పార్టీ) నుంచి సినిమాలు కొనుగోలు చేసి ఐ బొమ్మ రవి తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడని, సినిమాల కొనుగోలుకు అవసరమైన డబ్బును బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం ద్వారా సంపాదించేవాడని పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ ద్వారా తనకు వచ్చే డబ్బు.. సినిమాల కొనుగోలుకు తను చెల్లించే డబ్బు లావాదేవీలంతా క్రిప్టో కరెన్సీ రూపంలోనే జరిగేవని, ఈ మేరకు రవి పోలీసుల విచారణలో వెల్లడించాడని సమాచారం. రవికి చెందిన సుమారు 35 బ్యాంకు ఖాతాల్లోకి వందల కోట్లు నగదు క్రిప్టో రూపంలో బదిలీ అయిందని పోలీసులు గుర్తించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల కేసులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలకు సంబంధించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా మ్యూల్ ఖాతాల వ్యవహారంలో విదేశీ లింకులున్న షేక్ బాషా సుల్తాన్‌ను అరెస్టు చేశారు. ఇతనిది ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేట. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన 26 సైబర్ క్రైం మోసాల్లో ఇతను నిందితుడని బ్యూరో అధికారులు గుర్తించారు. విదేశీ సైబర్ నేరగాళ్లకు కమీషన్ పద్ధతిలో బ్యాంకు ఖాతాలను షేక్ బాషా అందిస్తున్నాడని, దుబాయ్‌లో ఉన్న ఇద్దరు నేపాల్ వాసులతో ఇతనికి పరిచయాలున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. నేపాల్‌కు చెందిన రామేశ్వర్ సహన్, రాజేష్ షాలు విదేశీ హ్యాండర్లుగా పనిచేస్తున్నారని, ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును మనీలాండరింగ్ చేయడానికి భారతీయ బ్యాంకు ఖాతాలను వీరు బాషా ద్వారా సేకరించినట్టు ఆమె పేర్కొన్నారు. చైనా లింక్ ఉన్న సైబర్ నేరగాళ్లకు దుబాయ్‌లోని నేపాల్‌వాసులు సహకరిస్తున్నారని, ఈ మోసంలో బాషా చురుకైనా పాత్ర పోషించాడని తెలిపారు. త్వరగా లాభాలు వస్తాయని నమ్మించే నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్, ఫారెక్స్, క్రిప్టో ప్లాట్‌ఫామ్‌ల జోలికి వెళ్లవద్దని ఆమె సూచించారు.

ఢిల్లీ పేలుళ్లకు టర్కీ, పాక్, సిరియా లింక్

న్యూఢిల్లీ, నవంబరు 21: ఢిల్లీలో ఈ నెల 10న జరిగిన కారు పేలుడు ఘటనకు టర్కీ, పాకిస్థాన్, సిరియా లింక్ ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. కారు పేలుడులో ఆత్మాహుతికి పాల్పడిన ఉమర్ నబీ 2022లో టర్కీలో 20 రోజుల పాటు పర్యటించినట్లు గుర్తించారు. ఇదే కేసులో సహ నిందితులైన ముజమ్మిల్ షకీల్, ముజఫర్ రాథెర్, ఉమర్‌తో కలిసి టర్కీలో పర్యటించినప్పుడు సిరియాకు చెందిన ఆపరేటివ్‌తో సమావేశమయ్యారు. జైష్ ఎ మహ్మద్‌కు చెందిన పాక్ హ్యాండ్లర్ ఉకాష ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బాంబుల తయారీ, ఉగ్రదాడుల ప్రణాళికలపై చర్చలు జరిపారు. ఆ తర్వాత ముజఫర్ అఫ్గానిస్థాన్ వెళ్లి అల్ ఖైదాలో చేరినట్లు అనుమానిస్తున్నారు.

అజిత్ దోవల్ వ్యాఖ్యలపై వివాదం!



న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ 2014లో (అప్పటికింకా ఆయన ఆ పదవి చేపట్టలేదు) ఓ సమావేశంలో చేశారని చెబుతున్న వ్యాఖ్యలు తాజాగా వివాదాస్పదమయ్యాయి. 2014 మార్చి 11న 'ఆస్ట్రేలియా ఇండియా ఇన్‌స్టిట్యూట్' అనే సంస్థ 'ప్రపంచానికి ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన ఓ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదని, హిందువులు వర్సెస్ ముస్లింలు అన్న కోణంలో కాకుండా.. దేశ సమస్యగా ఉగ్రవాదాన్ని చూడాలంటూ దోవల్ ఆ ప్రసంగంలో ప్రముఖంగా పేర్కొన్నారు. తాజాగా, ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో.. అజిత్ దోవల్ స్పందిస్తూ.. తాను అలా మాట్లాడలేదని, అది డీప్‌ఫేక్‌తో సృష్టించిన నకిలీ వీడియో అని పేర్కొన్నారు. కాగా, సదరు క్లిప్ ఉన్న వీడియోను పరిశీలించిన ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్ ఆల్ట్‌న్యూస్ మాత్రం.. అది ఫేక్ వీడియో కాదని తమ పరీక్షలో తేలిందని వెల్లడించింది.

కార్మికులందరికీ సామాజిక భద్రత!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులకు కనీస వేతనాలు.. క్రమం తప్పకుండా అందించడం వంటి భారీ సంస్కరణలు ఉన్నాయి. వేతనాల కోడ్ (2019); పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020); సామాజిక భద్రత కోడ్ (2020); వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పనిప్రదేశాల్లో పరిస్థితుల కోడ్ (2020)లను తక్షణమే అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చాలా దేశాలు ఇప్పటికే తమ చట్టాలను సరళీకరించి, ఏకీకృతం చేసినప్పటికీ మనం మాత్రం సంక్లిష్టమైన, కాలం చెల్లిన చట్టాలనే కొనసాగిస్తున్నామని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న 29 చట్టాల స్థానంలో ఏకీకృత, ఆధునికీకరించిన నాలుగు కోడ్‌లను అమల్లోకి తెచ్చినట్లు తెలిపింది. కొత్త కార్మిక కోడ్‌లకు సంబంధించిన చట్టానికి 2020లోనే ఆమోదం లభించింది. కానీ, కొన్ని రాష్ట్రాలు నిబంధనలను నోటిఫై చేయడంలో జాప్యం చేశాయి. దీంతో అమలు వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా నాలుగు కార్మిక స్మృతులు అమల్లోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం సమగ్ర నిబంధనలు, పథకాల రూపకల్పనకు సంప్రదింపులు ప్రారంభించనుంది. కొత్త కోడ్‌లు అమల్లోకి వచ్చినప్పటికీ అవసరమైనప్పుడు ప్రస్తుత కార్మిక చట్టాల్లోని నిబంధనలు కూడా వర్తిస్తాయని కేంద్ర కార్మిక శాఖ తెలిపింది. కాగా, 2015లో దేశంలో సామాజిక భద్రత కవరేజ్ 19 శాతం ఉండగా.. 2025 నాటికి ఇది 64 శాతానికి చేరినట్లు వెల్లడించింది. కొత్త కోడ్‌ల అమలుతో కార్మిక అనుకూల వ్యవస్థను ప్రోత్సహించినట్లయిందని పేర్కొంది.

ఆత్మనిర్భర భారత్‌కు పునాది..

తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా అన్ని చోట్లా దేశవ్యాప్తంగా ఈఎస్ఐసీ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతో




పాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. ఈ కోడ్‌లు ఆత్మనిర్భర భారత్‌కు పునాది లాంటివని అన్నారు. భారత్‌లోని కార్మిక చట్టాలు స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో అంటే 1930లు-1950ల్లో రూపొందించినవని.. అప్పట్లో ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ పని విధానాలు పూర్తి భిన్నంగా ఉండేవని మాండవీయ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చాలా దేశాలు ఇప్పటికే తమ కార్మిక చట్టాలను సరళతరం చేసినా.. భారత్‌లో మాత్రం పాత చట్టాలే కొనసాగుతున్నాయన్నారు. అందుకే సరికొత్త కార్మిక కోడ్‌లను అమల్లోకి తెచ్చామని తెలిపారు. "ప్రతి కార్మికుడికీ గౌరవం కల్పించాలన్నది మోదీ సర్కారు హామీ. ఈ రోజు నుంచి కొత్త కార్మిక స్మృతులు దేశంలో అమల్లోకి వచ్చాయి" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయని, యువతకు నియామక పత్రాలు అందుతాయని, మహిళలకు సమాన వేతనాలు, గౌరవం లభిస్తుందని, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని, ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయని వివరించారు. "ఈ సంస్కరణలు సాధారణ మార్పులు కాదు. కార్మికుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ తీసుకున్న అతిపెద్ద చర్య. స్వయం సమృద్ధ భారత్ దిశగా కీలక ముందడుగు. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతం" అని మాండవీయ పేర్కొన్నారు.

నాలుగు స్మృతుల్లో కీలక అంశాలు..

- ఉద్యోగులందరికీ నియామక పత్రాలు తప్పనిసరి. దీంతో ఉద్యోగ భద్రత, పారదర్శకత, స్థిరమైన ఉపాధికి హామీ లభిస్తుంది.
- గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు సహా ఉద్యోగులందరికీ సామాజిక భద్రత (పీఎఫ్, ఈఎస్ఐసీ, బీమా మొదలైనవి) కల్పించాలి.
- ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు (ఎఫ్‌టీఈ) శాశ్వత ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు కల్పించాలి. ఎఫ్‌టీఈలు ఐదేళ్లకు బదులు కేవలం ఏడాది సర్వీసు పూర్తిచేస్తే గ్రాట్యుటీకి అర్హులు.
- కార్మికులందరికీ కనీస వేతనం ఇక చట్టబద్ధమైన హక్కు. యజమానులు సకాలంలో వేతనాలు చెల్లించడం తప్పనిసరి. అనధికారికంగా ఎలాంటి కోతలూ విధించకూడదు.
- బీడీ, సిగరెట్లు, మైనింగ్ పరిశ్రమల్లో రోజుకు 8-12 గంటల వరకు పనిచేయొచ్చు. వారానికి 48 గంటలు మించొద్దు. 30 రోజుల పని పూర్తి చేసుకుంటే బోనస్‌కు అర్హత ఉంటుంది.
- 40 ఏళ్లు పైబడిన ఉద్యోగులందరికీ యాజమాన్యాలు ఏటా ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడం తప్పనిసరి.
- సమాన పనికి సమాన వేతనం తప్పనిసరి. ట్రాన్స్‌జెండర్ సహా లింగ వివక్ష ఉండరాదు.
- సాధారణ పని గంటలకు మించి (ఓవర్ టైమ్) పని చేస్తే రెగ్యులర్ వేతనానికి రెట్టింపు చెల్లించాలి.
- అన్ని షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లో (భూగర్భ గనులు సహా) పనిచేయడానికి మహిళలకు అనుమతి. అవసరమైన భద్రతా చర్యలతో పాటు వారి సమ్మతి తప్పనిసరి.
- మహిళా ఉద్యోగుల కుటుంబంలో అత్తమామలకు చోటు. తద్వారా 'డిపెండెంట్ కవరేజ్' పెరుగుతుంది.
- గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారి చట్టంలో నిర్వచనం. గిగ్ వర్కర్ అంటే సాధారణ, సంప్రదాయ యాజమాన్యాలు ఏర్పాటు చేసే ఆఫీసుల్లో పనిచేసేవారు కాదు. ప్లాట్‌ఫాం వర్కర్ అంటే ఆన్‌లైన్ వేదికల ద్వారా సేవలందించేవారు. ఆన్‌లైన్ అగ్రిగేటర్ అంటే.. సేవలందించేవారికి, వినియోగదారులకు మధ్య అనుసంధానకర్త.
- అగ్రిగేటర్లు (ఉబెర్, ఓలా, స్విగ్గీ వంటి సంస్థలు) తమ వార్షిక టర్నోవర్‌లో 1-2% (కార్మికులకు చెల్లించే మొత్తంలో 5% వరకు) సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి.
- ఆధార్ అనుసంధానిత 'యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)' ద్వారా సామాజిక భద్రత ప్రయోజనాలు రాష్ట్రాల మధ్య వలసలతో సంబంధం లేకుండా పోర్టబుల్‌గా ఉంటాయి.
- జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్లు, డబ్బింగ్ కళాకారులు, మీడియా వృత్తి నిపుణులు కూడా కార్మిక రక్షణ విధివిధానాల పరిధిలోకి వస్తారు. నియామక పత్రాలు, వేతనాల భద్రత, పని వేళల నియంత్రణ తప్పనిసరి.
- కాంట్రాక్ట్, వలస కార్మికులకు కూడా సమాన వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలన్నీ అందించాలి. కాంట్రాక్ట్ సిబ్బందికి యాజమాన్యాలు సామాజిక భద్రత కల్పించాలి. తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి.

లోకం తీరు



జీవితంలో ఒక్కసారైనా భర్త వేధింపులు

» భారత్‌లోని మహిళల్లో 30% బాధితులే

న్యూఢిల్లీ, నవంబరు 21 : మనదేశంలోని మహిళల్లో 30% మంది తమ జీవిత కాలంలో ఒక్కసారైనా భర్తల వేధింపులకు గురి అవుతున్నారని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. 2023లో 15-49 ఏళ్ల మధ్య ఉన్న మహిళల్లో కనీసం యాభై శాతం మంది మగడి హింసను ఎదుర్కొన్నారని తెలిపింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు, అంటే కనీసం 84 కోట్ల మంది, భర్తల వేధింపులను లేక లైంగిక హింసను జీవితకాలంలో చవిచూస్తున్నారని, 15-49 ఏళ్ల మధ్య ఉన్న మహిళల్లో 8.4% మంది ఇతరుల హింసకు (భర్త కాకుండా) గురి అవుతున్నారని పేర్కొంది. భారత్ సహా 165 దేశాల్లో దీనిపై 2000 నుంచి 2023 వరకు అధ్యయనం జరిపి నివేదిక రూపంలో డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసింది. ఈ నివేదికను అనుసరించి, భారత్‌లో 15 ఏళ్లు, ఆపై వయసు మహిళల్లో నాలుగు శాతం మందికి ఇతరుల నుంచి (జీవిత భాగస్వామి కాదు) లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయి. ఏటా నవంబరు 25ను బాలికలు, మహిళలపై వేధింపులు, లైంగిక హింస వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగానే ఈ నివేదికను డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసింది. 2030 నాటికి మహిళలపై అన్నిరకాల హింసను నిర్మూలించాలనే లక్ష్యసాధనలో పెద్ద పురోగతి లేదని ఈ నివేదిక పెదవి విరిసింది. 2000కు ముందు ఉన్న పరిస్థితుల్లో, ఆ తర్వాత కూడా పెద్దగా మార్పు కనిపించలేదని వివరించింది.

సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా

అంబేడ్కర్ స్ఫూర్తితోనే కర్తవ్య నిర్వహణ

» సంపన్న ఎస్సీలకు రిజర్వేషన్లు ఉండొద్దు

» వీడ్కోలు సమావేశంలో జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ, నవంబరు 21: పూర్తి సంతోషం, సంపూర్ణ సంతృప్తితో న్యాయస్థానాలను వీడుతున్నట్టు సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. శుక్రవారం చివరి పనిదినం కావడంతో ఆయన భావోద్వేగానికి లోనయి అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా నాలుగు దశాబ్దాల పాటు న్యాయవ్యవస్థతో ఆయనకు అనుబంధం ఉంది. ఆదివారం ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సాయంత్రం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆయనను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 'నేను రాజ్యాంగాన్ని పట్టుదలతో చదివే విద్యార్థిని. రాజ్యాంగ విలువలైన సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభాతృత్వం నా హృదయానికి దగ్గరగా ఉంటాయి' అని అన్నారు. తన మూలాలను గుర్తు చేసుకుంటూ మహారాష్ట్రలోని అంతగా ప్రాచుర్యంలేని లేని ప్రాంతం నుంచి వచ్చానని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి వరకు ఎదిగానని, తల్లిదండ్రులు నేర్పిన విలువలే తనను ఈ స్థానానికి తీసుచ్చాయని తెలిపారు. ఆ పదవిని చేపట్టిన తొలి బౌద్ధ, రెండో దళిత వ్యక్తి ఆయనే కావడం విశేషం. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ క్రీమిలేయర్ పరిధిలోకి వచ్చే ఎస్సీలకు ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లు ఉండకూడదని తీర్పు ఇచ్చారు. దీనిని ప్రస్తావిస్తూ 'ఎస్సీలందరికీ రిజర్వేషన్ల కారణంగా వ్యవసాయదారుడి కుమారుడు ఢిల్లీలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో చదివే సీనియర్ ఐఏఎస్ అధికారి కుమారుడితో పోటీ పడాల్సిన పరిస్థితి వస్తోంది. నా వద్ద పని చేసే లా క్లర్క్.. సీనియర్ ఐఏఎస్ అధికారి కుమారుడు. ఎస్సీలకు లభించే సౌకర్యాలనేవీ తాను తీసుకోబోనని ఆయన చెప్పాడు. ఒక యువకుడికి అర్థమయిన విషయం రాజకీయ నాయకులకు ఎందుకు అర్థం కాదో తెలియదు' అని అన్నారు. ఉదయం జరిగిన లాంఛనప్రాయ ధర్మాసనంలోనూ జస్టిస్ గవాయి తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 1985లో తాను లా విద్యార్థిగా కోర్టులో ప్రవేశించానని, ఇప్పుడు జస్టిస్ విద్యార్థిగా కోర్టును విడిచిపెడుతున్నానని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో తన తండ్రి చాలా సన్నిహితంగా మెలిగేవారని, అది తనపై ప్రభావం చూపిందని తెలిపారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ చూసిన నిబద్ధతే తనను మార్గదర్శనం చేసిందని అన్నారు. అందుకే ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య సమతౌల్యం ఉండేలా చూసేవాడినని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ తనకు ఇష్టమైన అంశమని చెప్పారు. ప్రజల హక్కులను కాపాడుతునే పర్యావరణం, వన్యప్రాణి రక్షణ కోసం ప్రయత్నించానని అన్నారు. అందరికీ కృతజ్ఞతలు చెప్పిన సమయంలో స్వరం గద్గదమయింది. లాంఛనప్రాయ ధర్మాసనంలో ఆసీనులైన తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో జస్టిస్ గవాయ్‌ను ప్రశంసించారు. ఆయన సహచరుడు మాత్రమే కాదు, సోదరుడని అన్నారు. జస్టిస్ గవాయ్ కేసులను గౌరవం, సహనంతో వినేవారని ప్రశంసించారు. యువ లాయర్లను ప్రోత్సహించేవారని చెప్పారు. జరిమానా విధిస్తానంటూ ప్రతి రోజూ న్యాయవాదులను బెదిరించేవారని, కానీ నిజానికి ఒక్క రోజు కూడా అలా చేయలేదని అన్నారు.

రాష్ట్రపతి ప్రశ్నలపై 'స్వదేశీ భాష్యం'

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా తాత్సారం చేస్తున్న సమస్యపై రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలకు 'స్వదేశీ భాష్యం' చెప్పి సమాధానాలు ఇచ్చినట్టు జస్టిస్ గవాయ్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి విదేశీ కోర్టుల తీర్పును కూడా ప్రస్తావించలేదని అన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?

» రష్యాపై అమెరికా ఆంక్షల ప్రభావం

న్యూఢిల్లీ, నవంబరు 21: దేశంలో కొన్నాళ్లుగా నిలకడగా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలు సమీప భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉందా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. రష్యా నుంచి భారత్‌కు చవకగా లభిస్తున్న ముడి చమురు దిగుమతులు తగ్గిపోతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ చమురు సంస్థలపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు భారత్‌పై పరోక్షంగా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నాయి. రష్యా చమురు తక్కువ ధరకు లభించడంతో భారత్ కొంతకాలంగా దేశీయంగా చమురు ఉత్పత్తుల ధరలను నిలకడగా కొనసాగిస్తోంది. కానీ, అమెరికా ఆంక్షలతో రష్యా నుంచి భారత్‌కు దిగుమతులు క్రమంగా తగ్గిపోతున్నాయి. రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు శుక్రవారం అమలులోకి రాగా 4.8 కోట్ల ముడి చమురు బ్యారెళ్లు నడి సంద్రంలో నిలిచిపోయాయి. రష్యా నుంచి బయలుదేరిన ఈ చమురు బ్యారెళ్లలో అధిక శాతం భారత్, చైనాకు చేరాల్సి ఉందని సమాచారం. ఆయా నౌకలలోని చమురును దిగుమతి చేసుకునేందుకు చాలా పోర్టులు, రిఫైనరీలు నిరాకరిస్తుండగా.. అవి భారత్‌కు చేరే అవకాశం కనిపించడం లేదు. మరోపక్క, రోస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థల నుంచి ఐఓసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) సహా పలు భారతీయ సంస్థలు డిసెంబరు, జనవరి కొనుగోళ్లను ఇప్పటికే ఆపేశాయి. అమెరికా ఆంక్షలు విధించని సంస్థల ద్వారా రష్యా నుంచి ముడి చమురు వచ్చే అవకాశం ఉన్నా.. అది ఎంత కాలమో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా, అమెరికాకు చెందిన చమురు సరఫరాదారులను భారత్ ఇటీవల ఆశ్రయిస్తోంది. అయితే, ఈ దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటే రష్యాతో పోలిస్తే రవాణా ఖర్చులు ఐదింతలు పెరగనున్నాయి. దిగుమతి ఖర్చులు పెరిగి రిఫైనరీల ఆదాయంపై ప్రభావం పడనుంది. ఫలితంగా సమీప భవిష్యత్తులో భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎయిర్‌షోలో కూలిన తేజస్

» పైలట్ దుర్మరణం

» ప్రదర్శన చివరి రోజు ఘటన..




న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రపంచంలోనే అతిపెద్దదైన, దుబాయ్ వేదికగా జరుగుతున్న ఎయిర్ షోలో చివరిరోజు ఘోర ప్రమాదం సంభవించింది. భారత వాయుసేనకు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్-ఎమ్‌కే1 కూలిపోయింది. అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గాల్లోకి లేచిన తేజస్, నింగిలో విన్యాసాలు చేస్తుండగానే నేరుగా కిందికి జారింది. ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన జనం చూస్తుండగానే ఆ యుద్ధ విమానం నేలను తాకి పేలిపోయింది. ఈ ఘటనలో పైలట్ తీవ్రగాయాలతో మృతిచెందినట్లు భారత వాయుసేన ప్రకటించింది. హాల్ అభివృద్ధి చేసిన సింగిల్ సీటర్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ) ఇది. నెగెటివ్ జీ-ఫోర్స్ (గురుత్వాకర్షణకు వ్యతిరేక దిశలోని శక్తి) టర్న్ నుంచి యుద్ధ విమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో పైలట్ విఫలమవ్వడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. దుబాయ్ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 2:15 గంటలకు ఈ ఘటన జరిగింది. 2001 జనవరి 4న తేజస్ మొదటిసారి గాల్లోకి లేచాక అంటే గత 24 ఏళ్లలో ఈ తేలికపాటి యుద్ధ విమానాలు కూలిపోవడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చి 12న.. త్రివిధ దళాల ఆధ్వర్యంలో శిక్షణా విన్యాసాలు నిర్వహిస్తుండగా పోఖ్రాన్‌కు 100 కి.మీ దూరంలోని రాజస్థాన్ జైసెల్మేర్‌లోని జనావాసాల సమీపంలో తేజస్ కూలిపోయింది. పారాచూట్‌తో ద్వారా బయటపడటంతో పైలట్ ప్రాణాలు దక్కాయి. నవంబరు 17న మొదలైన దుబాయ్ ఎయిర్ షో శుక్రవారమే ముగిసింది. కాగా.. ఎయిర్ షోలో తేజస్ నుంచి ఆయిల్ లీక్ అవుతున్నట్లుగా పాక్ వీడియోలు షేర్ చేసింది. అలాంటిదేమీ లేదని కేంద్రం గురువారమే స్పష్టం చేసింది. ఆ మర్నాడే తేజస్ కూలిపోవడంతో 'ఆయిల్ లీకేజీ' వార్తల వెనుక వాస్తవం ఏమిటి? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ బృందం ప్రకారం.. తేజస్ నుంచి ఏ దశలోనూ ఆయిల్ లీకేజీ జరగలేదు.

మరి ఎలా కూలింది?

ఎయిర్ షో విన్యాసాల్లో భాగంగా తేజస్ పైలట్ 'బారెల్ రోల్' అనే విన్యాసాన్ని ప్రదర్శిస్తుండగా ప్రమాదం సంభవించింది. బారెల్ రోల్‌లో భాగంగా విమానం గాల్లోనే నిలువుగా 360 డిగ్రీలు చుడుతుంది. ఇలా గిరగిరా తిరగడం సంక్లిష్టమైన ప్రక్రియ కానప్పటికీ ఈ విన్యాసంలో పైలట్ క్షణకాలం తలకిందులుగా ఉంటాడు. శుక్రవారం ఎయిర్ షోలో పైలట్.. ఈ కచ్చితమైన లూప్‌నకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మొదట పైకి ఎగసి.. తర్వాత తలకిందులుగా వెళ్లి.. మళ్లీ పైకి ఎగిసే క్రమంలో ప్రమాదం సంభవించింది. విమానాన్ని మళ్లీ పైకి లేపే క్రమంలో వేగం సరిపోక కూలిపోయి ఉండొచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంజిన్‌లో మంటలు చెలరేగడం వల్లే కూలిపోయి ఉండొచ్చుననీ భావిస్తున్నారు.

కర్ణాటకలో హైడ్రామా!



» ఢిల్లీ వెళ్లిన డీకే ఆప్త ఎమ్మెల్యేలు

» ఆ విషయం తనకు తెలియదన్న డీకే

» 'మార్పుపై' నిర్ణయం అధిష్ఠానానిదే: సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో హైడ్రామా చోటు చేసుకుంది. సీఎం మార్పుపై చర్చ తీవ్రమైన వేళ.. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని, మరో రెండేళ్లు తానే బడ్జెట్ ప్రవేశపెడతానని సీఎం సిద్దరామయ్య చెప్పారు. ఈ ప్రకటన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆప్తులలో ఆగ్రహం పెల్లుబికేలా చేసింది. ఈ పరిణామాల క్రమంలో ఆయనకు సన్నిహితులైన ఎమ్మెల్యేలు గురువారం ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేని కలిశారు. మంత్రి చలువరాయస్వామితోపాటు మరింతమంది శుక్రవారం ఢిల్లీకి వెళ్లారు. ఇదే సమయంలోనే చక్కెర శాఖ మంత్రి శివానందపాటిల్ ఢిల్లీ వెళ్లడం సరికొత్త చర్చలకు దారితీసింది. ఢిల్లీ వెళ్లిన మంత్రులతోపాటు ఎమ్మెల్యేలకు సిద్దరామయ్య నేరుగా ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలుస్తోంది. మైసూరులో సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పు లేదా కేబినెట్ విస్తరణపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమని అన్నారు. ఖర్గే శనివారం బెంగళూరుకు వస్తున్నారని, తాను స్వయంగా వెళ్లి కలుస్తానని అన్నారు. సిద్దరామయ్యకు ఆప్తులుగా పేరొందిన ముఖ్యులు డిన్నర్ మీటింగ్ నిర్వహించడం సరికొత్త చర్చకు దారితీసింది. మంత్రి సతీశ్ జార్కిహొళి తన నివాసంలో గురువారం రాత్రి విందు ఇచ్చారు.

ఎమ్మెల్యేలంతా నావాళ్లే: డీకే

గ్రూపు రాజకీయాలు తన రక్తంలోనే లేవని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలంతా తనవాళ్లేనని చెప్పారు. తనకు ప్రత్యేకమైన గ్రూపులు, ఆప్తులు లేరన్నారు. సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు అధికారంలో ఉంటానన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, 'చాలా సంతోషం, కాదన్నది ఎవరు?. ఆయనకు మా మద్దతు ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. తాను ఎవరినీ ఢిల్లీకి పంపలేదని, తనకు ఆ విషయం తెలీదని అన్నారు. అయితే, "ఎక్కడైతే కృషి ఉంటుందో.. అక్కడే ఫలాలు ఉంటాయి. ఎక్కడైతే భక్తి ఉంటుందో.. అక్కడే భగవంతుడు ఉంటాడు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

श्रम एवं रोजगार मंत्रालय
भारत सरकार
MINISTRY OF LABOUR & EMPLOYMENT
GOVERNMENT OF INDIA

దేశ శ్రామిక శక్తి

కొరకు

నూతన శకం



"శ్రామిక శక్తి పట్ల దేశం గర్విస్తోంది. శ్రమయేవజయతే!"
-ప్రధానమంత్రి, నరేంద్ర మోదీ

నాలుగు లేబర్ కోడ్‌ల

ప్రభావవంతమైన ఆచరణ

- వేతనాల కోడ్, 2019
- సామాజిక భద్రత కోడ్, 2020
- పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020
- వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020

మోదీ ప్రభుత్వ హామీ

- అందరికీ కనీస మరియు సకాల వేతనాలు
- నియామక పత్రాలు తప్పనిసరి
- మహిళా శ్రామికులందరికీ సమాన అవకాశాలు మరియు వేతనాలు
- 40 కోట్ల శ్రామికులకు సామాజిక భద్రత హామీ
- స్థిర కాల ఉద్యోగులకు 1 సంవత్సరం సర్వీసు తరువాత గ్రాట్యుటీ
- శ్రామికులకు తప్పనిసరి ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు
- ప్రమాదకర రంగాలలోని శ్రామికులకు 100% ఆరోగ్య భద్రత



CBC 23101/13/0002/2526

ఆత్మనిర్భర్ భారత్ కోసం శ్రామిక సంస్కరణలు

మాతో అనుసంధానం అయ్యేందుకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుప్రీం సమాధానాలు

తన పద్నాలుగు ప్రశ్నలకూ సుప్రీంకోర్టు ఇచ్చిన సమాధానం రాష్ట్రపతిగారికి కచ్చితంగా సంతృప్తినీ, సంతోషాన్నీ కలిగించివుంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటివరకూ పద్నాలుగుసార్లు మాత్రమే ఈ 'ప్రెసిడెన్షియల్ రెఫరెన్స్' అధికారాన్ని రాష్ట్రపతి వినియోగించుకున్న నేపథ్యంలో, బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు, రాష్ట్రపతికీ కాలపరిమితులు విధిస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నెలలోనే రాష్ట్రపతి న్యాయసలహా పేరిట దానికి పలుప్రశ్నలు సంధించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాష్ట్రపతిని రంగంలోకి దించి పాలకులు న్యాయ వ్యవస్థతో యుద్ధం కొనసాగిస్తున్నారని న్యాయకోవిదులు సైతం గొణిగారు. అలాగే, ఈ ప్రశ్నల వెనుక లక్ష్యాన్నీ అనుమానించారు. సంధించిన ఆ ప్రశ్నల్లోనే మీ తీర్పు ఎలా చెల్లుబాటవుతుందో చెప్పుకోండి చూద్దాం అన్న అసలు ప్రశ్న కూడా ఉన్నందున, ఈ న్యాయసలహా దెబ్బకు సుప్రీంకోర్టు దిగివస్తుందన్న మేధావుల అంచనా ఇప్పుడు నిజమైంది.

గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సి రావడం నిజానికి సర్వోన్నత న్యాయస్థానానికే పెద్ద పరీక్ష. తమిళనాడు గవర్నర్ విషయంలో అది చేసీచేసీ విసిగిపోయిన నేపథ్యంలోనే, ఏప్రిల్‌లో ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం వినూత్నంగా, విప్లవాత్మకంగా ఆ తీర్పు చెప్పింది. కేసు తమిళనాడుది కావడం, డీఎంకేకు అది రాజకీయంగా పైచేయి నివ్వడంతో కేంద్రం పెద్దలకు మా చెడ్డకోపం వచ్చింది. విపక్షపాలిత రాష్ట్రాలన్నింటికీ ఉపశమనాన్ని ఇచ్చిన ఆ తీర్పు, రవి తరహా గవర్నర్లు పెడుతున్న బాధలను అనుభవిస్తున్న పార్టీలకు శక్తినీ, ఉత్సాహాన్నీ ఇచ్చింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను రాజ్యాంగ బద్ధ వ్యవస్థలుగా కాక, శత్రుసేనలుగా భావించి సంహరించే గవర్నర్లకు ఆ తీర్పు ఒక ఘాటైన హెచ్చరిక. వారి పరిధిని గుర్తు చేస్తూ లక్ష్మణరేఖ దాటవద్దన్నది. ప్రభుత్వం పంపిన బిల్లులను అటు ఆమోదించకుండా, ఇటు తిప్పిపంపకుండా, కనీసం రాష్ట్రపతికి నివేదించకుండా గవర్నర్ ఎన్ని ఎత్తులు వేశారో కోర్టు గమనించింది. శాసనసభ రెండోసారి పంపినా సంతకం చేయకుండా, ఆఖరుఘడియలో అతితెలివిగా రాష్ట్రపతి టేబుల్‌మీదకు ఆ బిల్లులను నెట్టేయడమూ గమనించింది కనుకనే, సుప్రీంకోర్టే వాటిపై ఓ నిర్ణయం తీసుకుంది. 142వ అధికరణద్వారా తనకు దఖలుపడిన ప్రత్యేకాధికారాలను వినియోగించుకొని, గవర్నర్ ఆమోదం లభించినట్టుగా నిర్ధారించింది. రాజకీయకక్షతో గవర్నర్ సృష్టించిన కృత్రిమ సంక్షోభాలను సాహసోపేతమైనమార్గంలో పరిష్కరించింది. బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం నిర్దిష్టకాలపరిమితిని విధించకపోవడం ఒక గౌరవంగా కాక, ఒక నిరంకుశ అధికారంగా, దుర్వినియోగం చేయగల అవకాశంగా తీసుకుంటున్న గవర్నర్లకు ఆ తీర్పు ముకుతాడు వేసింది. మీకు నచ్చిందే చేయండి అని గవర్నర్లకు చెబుతూనే, బిల్లు ఆమోదానికీ, తిరస్కారానికీ, రాష్ట్రపతి నివేదనకు కాలపరిమితులు విధించింది.

ప్రజాస్వామ్యానికీ, సమాఖ్యవ్యవస్థకు సత్తువనిచ్చే ఆ తీర్పును ఈ ఐదుగురు సభ్యుల ధర్మాసనం నీరుగార్చడంతో వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చింది. గవర్నర్, రాష్ట్రపతి విధుల్లో వేలుపెట్టబోనని కోర్టు హామీ ఇస్తోంది. గవర్నర్లకు గడువులుండవనీ, ఏమీ తేల్చకున్నా ఎవరూ ప్రశ్నించరని చెబుతోంది. మరీ అన్యాయ మనిపిస్తే ఓ మాట అడుగుతామని కాస్తంత వేలుదూరేంత సందు పేరుకు మిగల్చుకున్నా, మీ నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతమనీ, డీమ్డ్ అసెంట్, ఆటోమేటిక్ వంటివి రాజ్యాంగంలోనే లేవని ధైర్యం చెప్పింది. రాష్ట్రాల్లో అధికార కేంద్రాలుగా తయారై, ఎన్నికలు వచ్చేనాటికి క్షేత్రాన్ని రాజకీయంగా సిద్ధం చేస్తూ, విపక్ష పార్టీ ప్రభుత్వాలను కూల్చేందుకు ఉపకరిస్తున్న గవర్నర్లకు, వారి యజమానులకు ఈ తీర్పు సంతోషం కలిగిస్తుంది. ప్రభుత్వాలు రాజ్యాంగ విహితంగా నడవనప్పుడు న్యాయస్థానాలు కాస్తంత చొరవ, దూకుడు ప్రదర్శించి గాడినపెట్టడం అవసరం. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని రక్షించడానికీ, కొలీజియం వ్యవస్థను పరిరక్షించుకోవడానికీ కార్యనిర్వాహక వ్యవస్థతో న్యాయవ్యవస్థ ఎంత పోరాడిందో చూశాం. ఇందుకు పూర్తి భిన్నంగా పుస్తకంలో ఉన్నదే అప్పచెప్పడానికి ఇప్పుడు సిద్ధపడిందంటే భయమో భక్తో కావచ్చు, లేదా, మధ్యలో మాకెందుకీ గొడవ అనుకొని కూడా ఉండవచ్చు.

ప్రమాదంలో ప్రజాస్వామ్య శ్వాసకోశాలు

మీరు ఆ ప్రసంగాన్ని వింటే ఆ మాటలు బాల్‌గంగాధర్ తిలక్‌వో, జవహర్‌లాల్ నెహ్రూవో, జయప్రకాశ్ నారాయణ్‌వో లేదా నెల్సన్ మండేలావో అయివుండొచ్చని భావిస్తారు. అయితే మీరు పొరపడ్డారు. ఆ వక్త సాక్షాత్తు గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.

ఆ ప్రసంగం విలేఖర్లకు వీనుల విందుగా ఉంటుందేమో?! గత పదకొండు సంవత్సరాలుగా విలేఖర్ల సమావేశంలో పాల్గొనేలా ప్రధానమంత్రిని అంగీకరింపచేసేందుకు వారు చేయని ప్రయత్నం లేదు కదా. విఫల మనోరథులు అయిన పాత్రికేయులు ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెలువరించిన ఆ ప్రసంగాన్ని విని సహజంగానే ఆనందభరితులయి వుంటారు. ప్రత్యక్ష ప్రసారమయ్యే పత్రికా గోష్ఠిలో విలేఖర్లు అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వకూడదన్న తన దృఢ సంకల్పాన్ని ప్రధానమంత్రి ఎట్టకేలకు సడలించుకున్నారేమోనన్న ఆశాభావం సైతం వారి మనస్సుల్లో తటిల్లమని ఉంటుంది. తాము ఇక నిరంతరం జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదని, తమ అభిప్రాయాలను 'ఒక వైపు' లేదా 'మరో వైపు' అనే పద బంధాలతో వివరిస్తూ సమతుల్య సంపాదకీయాలు రాయవచ్చునే భరోసాను సంపాదకీయ రచయితలకు ప్రధానమంత్రి ప్రసంగం కలిగిస్తున్నది. ఆయన మాటలు వ్యంగ్య చిత్రకారులకు కూడా ఎనలేని ఉత్సాహాన్ని కలిగిస్తాయి. 'ఎవరినీ వదలవద్దు, ప్రధానమంత్రిని సైతం విడిచి పెట్టవద్దు' అన్న వివేకవంతమైన మాటలను గుర్తు చేసుకుంటూ కార్టూనిస్టులు తమ పెన్సిళ్లకు పదునుపెడతారు. అవి జాలువార్చిన గీతలు, వ్యాఖ్యలు ప్రజలు తమ పాలకుల అవివేకానికి, అధికార ఔద్ధత్యానికి పగలబడి నవ్వుకునేలా చేస్తాయి. 'పాఠక మహాశయా, నన్ను క్షమించు నేను ఏమి చేస్తున్నానో నాకు తెలుసు' అన్న ప్రార్థనతో సమాజ యథార్థాలను ఎత్తిచూపిన వార్తలు, వార్తా వ్యాఖ్యలు అనేకాన్ని చెత్తబుట్ట పాలు జేసిన ఎడిటర్లకు ఆ మాటలు తమ అసలు విధ్యుక్త ధర్మ నిర్వహణకు ప్రోత్సాహకరమైన పిలుపు అవుతాయి.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

నరేంద్ర మోదీ మాటలు నిజంగా చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి, సందేహం లేదు. రామ్‌నాథ్ గోయెంకా (1904–1991) ఔదలదాల్చిన ఆదర్శం సాహసోపేత పాత్రికేయం (Journalism of Courage). ఆ ఆదర్శమే ఆయన నెలకొల్పిన వార్త పత్రికకు మార్గదర్శక ధర్మసూత్రమయింది. ప్రతి రోజూ ఆ పత్రిక మాస్ట్ హెడ్‌లో భాగంగా ఉంటోంది. రామ్‌నాథ్ గోయెంకాను కొనియాడుతూ ప్రధాన మంత్రి ఇలా ఉద్ఘాటించారు: 'రామ్‌నాథ్ గోయెంకా బ్రిటిష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దృఢ వైఖరితో వ్యవహరించారు. బ్రిటిష్ వారి ఆదేశాలను పాటించడం కంటే తన పత్రికను మూసివేసేందుకే ప్రాధాన్యమిస్తానని ఆయన ఒక సంపాదకీయంలో స్పష్టం చేశారు. అదే విధంగా, మన దేశాన్ని ఎమర్జెన్సీ రూపంలో దేశాన్ని బానిసత్వ అంధకారంలోకి నెట్టివేసినప్పుడు కూడా రామ్‌నాథ్ గోయెంకా నాటి పాలకులపై రాజీలేని పోరాటం చేశారు. ఎమర్జెన్సీ విధించి యాభై సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ ఏడాది జూన్‌లో దేశ ప్రజలు అందరూ ఆ చీకటి రోజులు గుర్తు చేసుకున్నారు'.

బాగా చెప్పారు. అయితే నేటి పత్రికా రంగంలో ఉన్న వాస్తవ పరిస్థితులు ఏమిటి? భారతదేశ ప్రముఖ వార్తా పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రభవించినవే. ఆ మహోన్నత పోరాట లక్ష్యాలు, ఆదర్శాలతో స్ఫూర్తి పొందినవే. పత్రికా రంగం పరిస్థితులకు అద్దం పట్టే గోది మీడియా (ప్రభుత్వ పక్షపాతంతో వ్యవహరించే పత్రికలు, ఛానెల్స్) అనే పదాన్ని సృష్టించవలసిన అవసరం 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశం కల్పిస్తుందని నాటి త్యాగధనుల తరం ఊహించి ఉండదు. అసంఖ్యాక పాఠకులు, వీక్షకులు చదవడానికి, చూడడానికి తిరస్కరిస్తున్నప్పటికీ అనేక వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రభుత్వ అండదండల పుణ్యమా అని ఇంకా పచ్చగా వర్ధిల్లుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు: 'రామ్‌నాథ్ గోయెంకా సదా సత్యం పక్షాన నిలబడ్డారు. తనను వ్యతిరేకిస్తున్నవారు ఎంత శక్తిమంతులు అయినప్పటికీ తన విధ్యుక్త ధర్మ నిర్వహణకే ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారు'.

> **కంటికి కనిపించని సెన్సార్ అనుక్షణమూ పనిచేస్తోంది; ప్రధాన వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్ అన్నీ 24x7 పర్యవేక్షణలో ఉన్నాయి; ఎడిటర్లకు ఫోన్ కాల్స్ వెళ్లుతున్నాయి; ఏవి ప్రచురించాలో, ఏవి ప్రచురించకూడదో సలహాలు లేదా సలహాపూర్వక సూచనలు ఇవ్వడం జరుగుతోంది; పాటించని వారికి సమస్యలు, ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ మీడియా పరిస్థితి.**

పత్రికా వార్తలు ఒకప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి దోహదం చేసేవిగా ఉండేవి. ఇప్పుడు భిన్నమైన వార్తలు పత్రికల గురించి వినవస్తున్నాయి. ఉదాహరణకు ఒక ఎడిటర్ గురించి వినవచ్చిన వార్తను చూడండి: తాను పనిచేస్తున్న పత్రిక యాజమాన్యంతో



ఆయన కుదుర్చుకున్న కాంట్రాక్టు ముగిసేందుకు ఇంకా చాలా కాలం ఉంది. అయితే ఒక రోజున ఉన్నపాటుగా ఆయనకు మిగతా కాంట్రాక్టు కాలపు వేతన భత్యాల మొత్తానికి సంబంధించిన చెక్ అందింది. అదే రోజు సాయంత్రానికి బాధ్యతలను కొత్త ఎడిటర్‌కు అప్పగించి ఇంటికి వెళ్లిపోవాలని యాజమాన్యం నుంచి ఆదేశమూ జారీ అయింది. ఒక టీవీ యాంకర్‌కు విశేష వీక్షకాదరణ ఉన్నది. ఆయన పనిచేస్తున్న టీవీ ఛానెల్ యాజమాన్యం మారింది, ఆ యాంకర్‌ను ఆ సంస్థ నుంచి పంపించివేశారు. ఈ ఉదంతాన్ని అర్ధరాత్రి తిరుగుబాటుగా మీడియా వర్గాలలో చెప్పుకున్నారు. ఇంకా ఎంతోమంది ప్రముఖ పాత్రికేయులకు అంతకంటే దిగ్భ్రాంతికరమైన అనుభవాలు ఎదురయ్యాయి. గత పది సంవత్సరాలలో ప్రఖ్యాత పాత్రికేయులు ఎందరో తమ ఉద్యోగాన్ని కోల్పోయారు. ఇప్పటికీ వారిలో చాలామంది ఉద్యోగాన్వేషణలోనే ఉన్నారు!

కొద్ది రోజుల క్రితం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఒక సమావేశం గురించి యశ్వంత్ సిన్హా ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. ప్రెస్ క్లబ్ ఆహ్వానంపై సిన్హా అక్కడకు వెళ్లి ఒక ప్రసంగాన్ని వెలువరించారు. ప్రసంగం అనంతరం పాత్రికేయులతో ఆయన పిచ్చా పాటీ చేశారు. ఆ సందర్భంగా ఆయన తాను అప్పుడప్పుడు చేస్తున్న ప్రకటనల గురించి ఎలాంటి వార్తలు రావడం లేదని మృదువుగా మందలించారు. ఆయన మాటతో ప్రతి ఒక్కరూ మౌనం వహించారు. చివరకు ఒక యువ పాత్రికేయుడు ఇలా అన్నాడు: 'యశ్వంత్ సిన్హా గారూ, మీ ప్రకటనలపై నేను వార్తలు రాస్తాను. నేను గనుక ఉద్యోగాన్ని కోల్పోతే, నాకు మరెక్కడైనా ఒక ఉద్యోగాన్ని ఇప్పించగలరా?'. యశ్వంత్ సిన్హా దిగ్భ్రాంతి చెందారు.. తేరుకొని మెల్లగా ఆ పాత్రికేయుడుతో ఇలా అన్నారు: 'మీరు మీ ఉద్యోగాన్ని కాపాడుకోండి'.

నేను ఒక సాయంత్రం ఒక చిన్న రెస్టారెంట్‌కు పాత్రికేయ మిత్రుడు ఒకరితో కలిసి డిన్నర్‌కు వెళ్లాను. మేము విందులో ఉండగా రాత్రి పదిగంటల సమయంలో ఆ పాత్రికేయుడికి అతని కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తక్షణమే ఇంటికి వెళ్లాలని, అక్కడ ఒబి వ్యాన్ వేచి ఉన్నదని, ముందుగా సిద్ధం చేసి ఉన్న ఒక ప్రకటనను చదవాలనేది ఆయనకు అప్పగించిన పని. ఈ సందేశమందిన వెన్వెంటనే నా పాత్రికేయ మిత్రుడు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. 'ఇప్పటికే గృహానికి చేరిన మరో విలేఖరికి ఆ బాధ్యత అప్పగించండి అని మీ బాస్‌కు చెప్పవచ్చు కదా' అని నేను అన్నాను. 'నా తల్లిదండ్రులు వృద్ధులు. నా పై ఆధారపడి ఉన్నారు. పైగా నేను చెల్లించవలసిన రుణాలు కూడా ఉన్నాయి' అంటూ నా మిత్రుడు విధి నిర్వహణకు వెళ్లిపోయాడు.

కొంతమంది పాత్రికేయులు అత్యాశాపరులు. వారే వృత్తి జీవితంలో వృద్ధి చెందుతూవుంటారు. ఈ అత్యాశాపరులు విచిత్రమైన వార్తలు సృష్టిస్తారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతీయ నావికా దళ యుద్ధ నౌకలు కరాచీని దిగ్బంధం చేశాయని, భారత సైనిక దళాలు కరాచీ నగరంలో ప్రవేశించేందుకు సంసిద్ధంగా ఉన్నాయనే వార్తలను ప్రసారం చేయడం ఇందుకు ఓ ఉదాహరణ.

యశ్వంత్ సిన్హా, నేను చెప్పిన ఉదంతాలు, ఇంకా మీరు విన్నవీ పత్రికారంగంలో ఎల్లెడలా పరివ్యాప్తమై ఉన్న భయోత్పాత పరిస్థితులను వెల్లడిస్తున్నాయి. విశ్వసనీయమైన వ్యక్తులు నాకు చెప్పిన, నేను స్వయంగా తెలుసుకున్న కొన్ని విషయాలను వెల్లడిస్తాను: అగోచర సెన్సార్ అనుక్షణమూ పనిచేస్తూ ఉన్నది; ప్రధాన వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్ అన్నీ 24X7 పర్యవేక్షణలో ఉన్నాయి; ఎడిటర్లకు ఫోన్ కాల్స్ వెళ్లుతున్నాయి; ఏవి ప్రచురించాలో, ఏవి ప్రచురించకూడదో సలహాలు లేదా సలహాపూర్వక సూచనలు ఇవ్వడం జరుగుతోంది; పాటించని వారికి సమస్యలు, ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ మీడియా పరిస్థితి, నన్ను నమ్మండి. హిందీ మీడియా మినహా మిగతా భారతీయ భాషలలోని చిన్న మీడియా సంస్థలకు మాత్రమే ఈ నిరంతర నిఘా, నిత్యపర్యవేక్షణల నుంచి మినహాయింపు లభిస్తున్నట్టుగా కనిపిస్తోంది. భయం స్వేచ్ఛకు పరమ శత్రువు. భయంతో రాజీపడిన మీడియా, లేదా నిర్భీతితో తలెత్తుకొని నిలబడే మీడియా.. భారత్ ముందు రెండుదారులున్నాయి. భయం గల మీడియా ప్రజాస్వామ్యాన్ని రక్షించలేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విద్య, ఉపాధి రంగాల్లో నూతనోత్సాహం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు దీటుగా నిలిపేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నది. గత ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాల కారణంగా జరిగిన నష్టాన్ని పూరించేందుకు ఉన్నత విద్యామండలిని బలోపేతం చేసింది. జాతీయ సంస్థల్లో పాలనాపరమైన అనుభవం, అంతర్జాతీయంగా పరిశోధనా ప్రామాణికత కలిగిన చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి స్వల్పకాలంలోనే ఉన్నత విద్యామండలిని సక్రమ పద్ధతిలోకి తీసుకురాగలిగారు. 'ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీల వంటి జాతీయ విద్యాసంస్థల్లోని ప్రతిభావంతమైన ఆచార్యులను రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల్ని ప్రభుత్వం నియమించింది. ఇటీవల రెండు విభజన విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి ఉపకులపతుల్ని ప్రభుత్వం నియమించింది. ఏలూరు కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని, రాజమహేంద్రవరం కేంద్రంగా శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించింది.

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి 2025–26 విద్యా సంవత్సరానికి పీజీ ప్రవేశాలను సకాలంలో పూర్తి చేసింది. కొత్తగా ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న తెలుగు విశ్వవిద్యాలయం కూడా ఇటీవల పీజీ, డిప్లమా, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం, కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం ప్రకటనలు విడుదల చేసింది. రాష్ట్రంలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశాలను ఉన్నత విద్యామండలి అధికారులు ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కృషితో సుమారు మూడు వందల ఎంబీబీఎస్ సీట్లు, మరికొన్ని పీజీ మెడికల్ సీట్లు పెంచారు. అంటే ఈ ఏడాది నాలుగైదు కొత్త మెడికల్ కళాశాలలు రాష్ట్రానికి వచ్చినట్లే. ఎల్.ఎల్.బి, డి.ఎడ్, బి.ఎడ్ ప్రవేశాల్ని త్వరితగతిన మండలి పూర్తి చేసింది. అన్ని విశ్వవిద్యాలయాల, కళాశాలల ప్రమాణాలను తనిఖీ చేసి, మౌలిక సదుపాయాల్ని ఏర్పాటు చేయించింది. డీఎస్సీ నియామకాలు చేపట్టి పదహారు వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి 'లీప్ లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' విధానాన్ని తీసుకొచ్చింది. రానున్న డీఎస్సీ కోసం వెంటనే టెట్ పరీక్ష ప్రకటన విడుదల చేసింది. ఎపీ సెట్ లెక్చరర్‌షిప్ పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఉన్నతాధికారి ఇప్పటికే వెల్లడించారు. ప్రవేశాలు, అర్హత పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా దూసుకుపోతున్నది.



ఏపీలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు సంబంధించిన అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే పలు యూనివర్సిటీలకు వీసీలను నియమించింది. సకాలంలో ప్రవేశపరీక్షల నిర్వహణకు కృషి చేస్తోంది. సహ, సహాయ ఆచార్య వంటి పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తే యూనివర్సిటీలకు కొత్తకళ రానుంది.

టెక్నాలజీ దిగ్గజం గూగుల్ సుమారు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖపట్నంలో ఒక గిగావాట్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు సిద్ధమయింది. ఈ నిర్ణయం ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆమోదించింది. ఈ నిర్మాణంతో డేటా సెంటర్ ఆపరేషన్లు, ఇంజనీరింగ్, ఐటీ వంటి రంగాల్లో ఏడాదికి సుమారు 1,88,220 ప్రత్యక్షంగానీ, పరోక్షంగానీ ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. గూగుల్ క్లౌడ్ ఉత్పాదకత ఆధారిత ప్రభావంతో ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఏటా సుమారు రూ.9,553 కోట్లు అదనంగా లభిస్తుందని భావిస్తున్నారు.

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ఐటీ ఎకో సిస్టమ్‌కు గేమ్ ఛేంజర్‌గా అంచనా వేస్తున్నది. దీంతో విశాఖపట్నం 'ఏఐ సిటీ'గా అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి కృత్రిమమేధ, క్లౌడ్, డేటా అనలిటిక్స్ హబ్‌గా విశాఖపట్నం అభివృద్ధి చెందుతుంది. అందుకు తగిన నిరంతర పయనంలో ఐటీ మంత్రి నారా లోకేశ్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. అందుకోసం దేశవిదేశాల్లో ఏపీ ప్రభుత్వం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నది. ఈ డేటా సెంటర్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఈ–గవర్నెన్స్ రంగాలకు మద్దతుగా ఒక ప్రాముఖ్యమైన మౌలిక సదుపాయంగా పనిచేయనుంది. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఇది కేవలం ఒక పెట్టుబడి కాదు, ఒక బలమైన ఆకాంక్ష నిజమవుతున్న క్షణం' అని తెలిపారు. ప్రపంచంలోని అతి పెద్ద సాంకేతిక పెట్టుబడులకు ఆతిథ్యం ఇవ్వడం ఏపీకి గర్వకారణమని అభిప్రాయపడ్డారు. రాజధాని అమరావతి కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు, ఐటీ సంస్థలు మరికొన్ని రానుండటం రాష్ట్ర సామాజిక, ఆర్థికాభివృద్ధికి మరింత వెన్నుదన్ను కానుంది.

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో విద్యా, ఉపాధి రంగాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇక రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 'సహ, సహాయక ఆచార్య' ఉద్యోగాల భర్తీ కోసం కసరత్తు చేస్తోంది. న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కొన్ని కేసుల విషయంలో పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ వివాదాలను పరిష్కరించి, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సుమారు రెండువేల ఉద్యోగాల్లో కనీసం సగమైనా ప్రభుత్వం ఈ ఏడాది భర్తీ చేస్తుందని నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. ఈ ఆకాంక్ష కూడా త్వరగా నెరవేరితే ఏపీ విశ్వవిద్యాలయాలు పూర్వ వైభవాన్ని సంతరించుకునే అవకాశాలు ఉన్నాయి. నవ్యాంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవాన్ని జరుపుకోనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల చరిత్ర, అభివృద్ధి గురించి వ్యాఖ్యానించవలసి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం ఈ లోగా ఆచార్యుల ఉద్యోగాల భర్తీ విషయంలోనూ తగిన చర్యలు తీసుకుని నూతనోత్సాహం కొనసాగిస్తుందని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

• జీకేడీ ప్రసాదరావు
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

హిడ్మా.. ఇంత స్పందనా?



హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత సోషల్ మీడియాలో ఆయనకు మద్దతుగా వస్తున్న కథనాలు, పోస్టులను చూస్తే 'ఒక అజ్ఞాత నక్సలైట్ నాయకుడు మరణిస్తే ఇంత స్పందనా?' అని ఆశ్చర్యం కలుగుతుంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ మరణించినప్పుడు కూడా ఇంత స్పందన లేదేమో.

హిడ్మా బయటి ప్రపంచానికి తెలిసిన వ్యక్తి కాదు. పుట్టింది ఒక గోండు గూడెంలో. 25 ఏళ్లుగా ఆయుధంతో పోరాడుతున్నాడు. ఆదివాసీల గుండెల్లో హిడ్మాకు వెలకట్టలేని స్థానం ఉంది కాబట్టే ఇంతకాలం రకరకాల పోలీసు బలగాలు గాలించినా, దాడి చేసినా దొరకలేదు. ఒక విప్లవోద్యమ నాయకుడిగా ఈ ప్రపంచానికి సుపరిచితుడైన హిడ్మా మరణం తర్వాత ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో ఆయనకు జేజేలు పలుకుతూ పోస్టులు మారుమోగిపోతున్నాయి. హిడ్మా బతికుంటే బాగుండునని వేల గొంతులు నినదిస్తున్నాయి. ఆయనను గుండెల్లో దాచుకున్న ఆదివాసీలకు అక్షరజ్ఞానం ఉంటే, ఈ సోషల్ మీడియాను వాడుకోవడం తెలిస్తే, ఈ ప్లాట్‌ఫాంలు ఇంకెంతగా మారుమోగిపోయేవో! తాము చేయలేని పనిని తమ నాయకుడు, చేయాలని ప్రజలు కోరుకుంటారు. అందుకే వీళ్ల అభిమానులు మాత్రమే అవుతారు, వాళ్లు చరిత్రలో హీరోలు అవుతారు.

ఆదివాసీల్లో హిడ్మాకు ఏ స్థాయిలో ఆదరణ ఉందో ఆయన అంత్యక్రియల దృశ్యాలు తెలియచెబుతాయి. జాతీయ, అంతర్జాతీయ, స్థానిక మీడియా సంస్థల ప్రతినిధులతో పూవర్తి కిక్కిరిసిపోయింది. తమ నేతను విగతజీవిగా చూసి ఆదివాసీలు భోరున విలపిస్తూ, శవాన్ని గుండెలకు హత్తుకుని ముద్దాడిన దృశ్యాలు ఆదివాసీల గుండెల్లో ఎన్నటికీ చెరగని హిడ్మా స్థానానికి నిదర్శనం. కొమురం భీం, రాంజీ గోండు, అల్లూరి సీతారామరాజుల వారసుడిగా హిడ్మాకు ఆదివాసీల్లో స్థానం దక్కుతుంది.

అర్జెంటీనాలో పుట్టి, క్యూబా విప్లవం తర్వాత, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో కూడా విప్లవ బీజాలు నాటిన చెగువేరా ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో ఐకాన్‌గా నిలిచిపోయాడు. అదే తరహాలో, పూవర్తిలో పుట్టి, దండకారణ్యం, గడ్చిరోలి, ఏఓబీలో విప్లవజ్వాలను రగిలించిన నేతగా, కొందరి గుండెల్లో నిద్రించిన యోధుడిగా మడావి హిడ్మా భారత విప్లవోద్యమ చరిత్రలో నిలిచిపోతాడు. చెగువేరా ఎంతటి ప్రజాదరణ పొందాడంటే, ఆయన ఫొటో ఉన్న టీ–షర్ట్‌లను నేటితరం కాలేజీ కుర్రాళ్లు వేసుకుంటున్నారు. అలాగే రాబోయే రోజుల్లో హిడ్మా ఫొటోతో ఉన్న టీ–షర్ట్‌ను కూడా కుర్రాళ్లు వేసుకుని తిరిగే రోజులు వస్తాయి. హిడ్మా మరణం తర్వాత సోషల్ మీడియాలో ఆయనకు మద్దతుగా వెలుస్తున్న పోస్టులే అందుకు నిదర్శనం.

– ఎ.రమణ కుమార్, జర్నలిస్టు

నల్లమల సాగర్.. ముందస్తు జాగ్రత్తలు తప్పవు

పోలవరం బనకచర్ల అనుసంధానం అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక మెట్టు దిగడం శుభ సూచికమే! దీంతో రాయలసీమ వాసుల ఆకాంక్షలు పాక్షికంగా నెరవేరాయి. ఇక పెండింగ్ ప్రాజెక్టుల పనులు మొదలుపెడితే చాలు. వాస్తవంలో బనకచర్ల అనుసంధాన పథకం నిర్మాణం కష్టతరమూ, అసాధ్యం కూడా. కూటమి ప్రభుత్వానికి ఈ టర్మ్ సన్నాహాలకు సరిపోతుంది. ముందుకు సాగినా టెండర్లు పిలవగలరు. తీవ్ర అభ్యంతరాల మధ్య అనుమతులు పొందటం అంత సులభం కాదు. 2029 తర్వాత కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ అయిదేళ్లలో కూడా నిర్మాణం పూర్తి కాదు. దీనికి పోలవరం ఓ ఉదాహరణ. పైగా టన్నెల్స్ తవ్వడం బహు క్లిష్టమైనది.

వెలుగొండ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు ఫాల్ట్‌జోన్లు ఏర్పడి ఏళ్లూ పూళ్లూ గడిచిన అనుభవముంది. పైగా అంతర్రాష్ట్ర జల వివాదాలు జటిలంగా తయారయ్యాయి. దీనికి తోడు వరద జలాల ఆధారంగా డీపీఆర్ ఆమోదం వీటన్నింటికీ మించి క్లిష్టమైనది. తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాల అభ్యంతరాల కన్నా ప్రజల భావోద్వేగాలకు జడిసి కేంద్ర ప్రభుత్వం తటస్థంగా ఉండిపోయింది. కేంద్ర పర్యావరణ శాఖ, గోదావరి –కృష్ణా యాజమాన్య బోర్డులతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీల చేత అడ్డంగా రాయించి కేంద్ర జల సంఘం చేతులు దులుపుకున్నది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎట్టకేలకు సరైన నిర్ణయం తీసుకున్నది. అయితే ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన 'పోలవరం, నల్లమల సాగర్'కు బాలారిష్టాలు లేకపోలేదు. ముందుగా వరద జలాలు ఆధారం అనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి. దేశంలో ఇంతవరకు వరద జలాల ఆధారంగా ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం ఆమోదించలేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉన్నప్పటికీ, ఏపీకి అనుకూలంగా ఏదైనా ఆమోదం ఇస్తే – అది దేశవ్యాప్తంగా ఒక సంప్రదాయంగా మారిపోయే అవకాశముంది. అందుకే కేంద్ర జల సంఘం అలాంటి నిర్ణయం తీసుకోవడానికి సాహసించకపోవచ్చు. పైగా ట్రిబ్యునల్ అవార్డు మేరకు గోదావరి వరద జలాలకు బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకూ హక్కు ఉంది. పోలవరం, నల్లమల సాగర్ అనుసంధానం వరద జలాల ఆధారంగా డీపీఆర్ ఆమోదించిన వెంటనే తెలంగాణ, మహారాష్ట్ర రెండూ (ఈ పాటికే కోరి ఉన్నందున) వరదజలాల ఆధారంగా తమ డీపీఆర్‌లు సమర్పిస్తాయి. ఈ విషయం కేంద్ర జలసంఘం పరిగణనలోకి విధిగా తీసుకుంటుంది.

బనకచర్ల అనుసంధానం విషయంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేవనెత్తిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం చాలా తేలిగ్గా తీసుకుంటున్నది. ఇది కూడా సులభంగా అధిగమించలేనిదే! ప్రస్తుతం నిర్మాణంలోని పోలవరం తొలిదశ ఆధారంగా పోలవరం నల్లమల సాగర్‌కు అయినా నీళ్లు వచ్చే అవకాశం లేదు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లు ఎత్తు నిర్మాణం జరిగి, పూర్తిస్థాయిలో నీళ్లు నిలిపినపుడు మాత్రమే సాధ్యం. పోలవరం హెడ్‌వర్క్స్ పూర్తి చేయవచ్చు గానీ, పూర్తిస్థాయిలో నీళ్లు నింపేందుకు నిర్వాసితుల తరలింపు ఎన్ని సంవత్సరాలు పడుతుందో! ఇవన్నీ అటుంచి పోలవరం రిజర్వాయర్ నుంచి గోదావరి వరద జలాలను తరలించడం సాధ్యం కాదు. అలా చేయాలంటే పోలవరం ఆపరేషన్ షెడ్యూల్ మార్పు చేయవలసి ఉందని. అంటే తిరిగి డీపీఆర్ ఆమోదం పొందాలని స్పష్టం చేసింది. 'పోలవరం, నల్లమల సాగర్ పథకం' పోలవరం ప్రాజెక్టులో భాగమైనపుడే అది సాధ్యం.


> **గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు ఇచ్చి, మిగిలిన నీళ్లు తమకు కృష్ణా ద్వారా ఇవ్వాలనేది రాయలసీమ వాసుల కోర్కె. కనీసం అయిదారు మాసాల్లో ట్రిబ్యునల్ తీర్పు వస్తుంది. ఆ తీర్పు తర్వాత బొల్లాపల్లి వరకు వచ్చే గోదావరి జలాలు డెల్టాకు, సాగర్ కుడికాలువ ఆయకట్టుకు ఇచ్చి, మిగిలే నీళ్లు రాయలసీమకు భేషుగ్గా ఇవ్వవచ్చు.**



పోలవరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 194 టీఎంసీలు అయినా, మనం అధికారయుతంగా ఉపయోగించుకునే పరిధి ఇంకా ఎక్కువ ఉంటుంది. ఆ నీటి నుంచి నల్లమల సాగర్ అనుసంధానం ప్రాతిపదిక చేసుకొంటే ఎవరి వైపు నుంచీ అభ్యంతరాలు ఉండవు. కేంద్ర జలసంఘం సులభంగా డీపీఆర్ ఆమోదిస్తుంది. బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా మరో చిక్కుముడి ఉంది. పోలవరం నుంచి తరలించే జలాలు కృష్ణానదిలో కలపకూడదు. కృష్ణా వద్ద ఏ పాయింట్‌కు తెచ్చినా, ఆక్విడెక్ట్ (నీటి మార్గ వంతెన) నిర్మించి నదిని దాటించాల్సి ఉంటుంది. ఒకవేళ 80టీఎంసీలకు మించితే కృష్ణా నికర జలాలను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. దీన్ని గోదావరి ట్రిబ్యునల్ తన తీర్పులో స్పష్టంగా పొందుపర్చింది. గోదావరి ట్రిబ్యునల్ అవార్డుతో పాటు ఇంతవరకు కేంద్ర జలసంఘం పాటిస్తున్న నియమ నిబంధనలు పోలవరం, నల్లమల సాగర్ అంశంలో పాటించకపోతే బనకచర్ల అనుసంధానానికి ఎదురైన ఇబ్బందులు ఇక్కడా తప్పవు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరికోసం ఉద్దేశించి బనకచర్ల అనుసంధానంపై ఇంత హడావుడి చేశారో, ఆ ప్రాంతమైన రాయలసీమలోనే ఆ ప్రాజెక్టుపై సానుకూలత లేదు. 'మన ఇంటి ముంగిట పోయే కృష్ణానది నీళ్లు ఇవ్వకుండా, గోదావరి జలాలు ఎందుకు' అనే తీవ్ర మథనం ఉండేది. ఒక విధంగా వారి మనోభావాలను కూటమి ప్రభుత్వం మన్నించినట్లే భావించాలి. గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు ఇచ్చి, మిగిలిన నీళ్లు తమకు కృష్ణా ద్వారా ఇవ్వాలనేది రాయలసీమ వాసుల కోర్కె. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగుతోంది. కనీసం అయిదారు మాసాల్లో ట్రిబ్యునల్ తీర్పు వస్తుంది. ఆ తీర్పు తర్వాత బొల్లాపల్లి వరకు వచ్చే గోదావరి జలాలు డెల్టాకు, సాగర్ కుడికాలువ ఆయకట్టుకు ఇచ్చి, మిగిలే నీళ్లు రాయలసీమకు భేషుగ్గా ఇవ్వవచ్చు. ఈలోపు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వాటికి పంట కాలువల నిర్మాణం పూర్తిచేయడం సముచితమైన చర్యగా వుంటుంది.

▪ వి. శంకరయ్య (విశ్రాంత పాత్రికేయుడు)





● అల నక్షత్రాలను పోలి

కార్తీకమాసం ముగియడంతో జిల్లావ్యాప్తంగా పోలి పాడ్యమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నెలరోజుల పాటు నోములు ఆచరించిన భక్తులు కృష్ణానదిలో పోలిని స్వర్గానికి పంపి కార్తీక పూజలకు ముగింపు పలికారు. సీతానగరంలోని ఘాట్ వద్ద భక్తులు వదిలిన దీపాలతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా వెలిగింది.





పుష్ప హోటల్‌లో.. పేలిన తూటా!

» 1991లో తెగబడిన షెల్టర్ జోన్ పీడబ్ల్యూజీ నక్సల్స్ 6

» మొగల్రాజపురంలో ఎస్ఐ దారుణ హత్య.. నేటికి 34 ఏళ్లు

నిడమానూరు డబుల్ డెక్కర్‌పై నీలినీడలు

నిడమానూరు జంక్షన్-మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై ప్రతిపాదించిన డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో దీనిపై కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ పునరాలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ప్రతిపాదించిన 7 కిలోమీటర్ల నాలుగు వరసల ఫ్లై ఓవర్ ప్రతిపాదన ఉపసంహరణ దిశగా ఆ ఆలోచనలు ఉన్నాయి.

సింగిల్ ఫ్లై ఓవర్‌ను రద్దుచేసే యోచనలో కేంద్రం

వెస్ట్ బైపాస్ పూర్తికావటంతో పునరాలోచనలో మోర్త్

- విశాఖ నుంచి వచ్చే ట్రాఫిక్ వెస్ట్ బైపాస్‌కు వెళ్తుందనే ఆలోచన
- మెట్రో మార్గానికి ఇబ్బంది లేకుండా ప్రతిపాదనలు
- నగరానికి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అవసరమే..
- కీలకమైన ప్రాజెక్టు చేజారకుండా ప్రజాప్రతినిధులు పట్టుబట్టాలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఏలూరు రోడ్డు, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1 వెళ్తుంది. ఈ మార్గంలోని నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై మధ్య వరసలో 4 వరసల ఫ్లై ఓవర్‌కు గతంలోనే కేంద్రం అంగీకరించింది. అయితే, ఈ ఫ్లై ఓవర్ కారణంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు మెట్రో లైన్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.5 కిలోమీటర్ల మేర సింగిల్ ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. కింది వరసలో సాధారణ ఫ్లై ఓవర్‌పై బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రయాణిస్తాయని, పై ఫ్లై ఓవర్‌పై మాత్రం మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తాయని, ఈ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు రూ.1,000 కోట్లు అంచనా వ్యయం అవుతుందని మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు అండ్ ట్రాన్స్‌పోర్ట్ (మోర్త్)కు ఏపీఎంఆర్‌సీ అధికారులు ప్రతిపాదించారు. దీనిపై మోర్త్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ అంతా అటు వెళ్లే అవకాశం ఉంది కాబట్టి.. సాధారణ ఫ్లై ఓవర్ అవసరం లేదన్న దిశగా మోర్త్ ఆలోచన చేస్తోంది. సాధారణ ఫ్లై ఓవర్ కాదనుకుంటే.. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కూ అవకాశం ఉండదు. కానీ, మెట్రోకు ఇబ్బంది ఉండదు.

మిగతా 6లో..



ప్రజాప్రతినిధులు స్పందించాలి

మెట్రో కారిడార్ కారణంగా నిడమానూరు ఫ్లై ఓవర్ విషయంలో కాలయాపన జరిగింది. ఇదే సందర్భంలో విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-3 పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిడమానూరు ఫ్లై ఓవర్ ప్రతిపాదన నుంచి తప్పుకొనే ఆలోచనలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారులకు సంకేతాలు అందించినట్టు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు గట్టిగా నిలబడకపోతే మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది.

నగరానికే అతిపెద్దది

ఇప్పటి వరకు విజయవాడలో ఉన్న ఫ్లై ఓవర్ల కంటే నిడమానూరు ఫ్లై ఓవర్ అతి పెద్దది. కనకదుర్గ ఫ్లై ఓవర్ కంటే కూడా రెట్టింపు సంఖ్యలో 7 కిలోమీటర్ల మేర ఉంటుంది. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లకు అనుసంధానంగా మహానాడు జంక్షన్ నుంచి సెంట్రల్ మీడియంలో నిడమానూరు జంక్షన్ వరకు 4 వరసల విధానంలో నిర్మించేలా దీని డీపీఆర్ తయారు చేశారు.

కమర్షియల్ కాటన్ కార్పొరేషన్

మొంథా నాశనం చేసినా కేజీ పత్తి కొనని సీసీఐ

నాణ్యత ఉంటేనే కొంటామని స్పష్టీకరణ

» దిక్కుతోచక పంట తీయకుండానే దున్నేస్తున్న రైతన్న

» పంట తీస్తే కూలీ ఖర్చులు కూడా నష్టమేనని ఆవేదన


» ప్రజాప్రతినిధులు సీఎంను కలవాలంటున్న రైతులు

ఆపద వచ్చినప్పుడు పత్తి రైతులు సీసీఐ వైపు.. ధాన్యం రైతులు ఎఫ్‌సీఐ వైపు.. అపరాల రైతులు మార్క్‌ఫెడ్ వైపు చూస్తారు. విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఆయా సంస్థలను రంగంలోకి దింపి పంట కొనుగోళ్లు చేపడతాయి. మద్దతు ధర అందించి వెన్నుదన్నుగా నిలుస్తాయి. ఓవైపు మొంథా తుఫానులో తడిసిన ధాన్యాన్ని కొంటుంటే.. సీసీఐ మాత్రం పత్తి కొనకుండా చోద్యం చూస్తోంది. అర్థం లేని నిబంధనలు విధిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, నందిగామ) : నెల కిందట జిల్లాలోని ఆరుచోట్ల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే చేసింది కానీ, ఎక్కడా కేజీ పత్తి కొనలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలతో స్పందించిన సీసీఐ ఎట్టకేలకు మంగళవారం కొద్దిమేర పత్తి కొనింది. అది కూడా.. ఆ రోజు నందిగామలో 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులు వస్తుండటంతో కేవలం 400 క్వింటాళ్లు కొని, ఆ తరువాత ఆపేసింది. ఆ తర్వాత నాణ్యమైన పత్తి మాత్రమే కొంటామంటూ నిబంధనలు విధించింది. రైతు సంక్షేమం కోసం ఏర్పడిన సీసీఐ ప్రైవేట్ వ్యాపారుల తీరున కొనుగోలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇంత జరుగుతున్నా పత్తి రైతుల కోసం ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు తమ గోడు తెలియజేయాలని కోరుతున్నారు.

మిగతా 6లో..

ట్రాక్టర్‌తో పంట దున్నేస్తున్న రైతు



కన్నీటితో పంట తొలగింపు

తుఫాను అనంతరం తిప్పుకొన్న చేలల్లో ఇంకా పత్తి ఉంది. దాన్ని తీయించాలంటే క్వింటాకు రూ.3 వేలకుపైగా ఖర్చవుతుంది. ఆ పత్తిని తీయించినా కొనేవారు లేరు. తీసిన ఖర్చులతో పాటు రవాణా ఖర్చులు కూడా అందే పరిస్థితి లేకపోవడంతో పంటను దున్నేస్తున్నారు. పండిన పంట మట్టిలో కలిసిపోతుంటే అన్నదాతలు మదనపడిపోతున్నారు. ప్రత్యామ్నాయ పంటకు స్థోమత, నీటి వనరులు లేని రైతులు తమ పంటను కూలీలకు అప్పగిస్తున్నారు.

నష్టం అంచనాలపై అనుమానాలు

మొంథా తుఫాను దెబ్బతిన్న పంటనష్టం అంచనాకు అధికారులు తీసుకున్న ప్రామాణికాలపైనా అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. వర్షం తగ్గిన వెంటనే డ్రోన్ల సాయంతో అధికారులు నష్టం అంచనా వేశారు. వాస్తవానికి వర్షం వెలసిన వారం తరువాత కానీ, నష్టం ఏ మేర జరిగిందో తెలియదు. డ్రోన్‌లు తిప్పిన అధికారులు ఏ మేర నష్టం జరిగిందన్నది చెప్పట్లేదు. ప్రభుత్వానికి నివేదిక పంపి చేతులు దులుపుకొన్నారు.

కుర్చీలు లేకపోవడంతో నేలపైనే శిశువులను ఎత్తుకుని కూర్చున్న బాలింతలు, వారి సహాయకులు



భయోమెట్రిక్

పాతప్రభుత్వాసుపత్రిలో బాలింతల అవస్థలు

» ఎన్టీఆర్ ఆరోగ్యమిత్ర వద్ద పడిగాపులు

» కూర్చోడానికి లేని బెంచీలు, శిశువులతో నిలబడే క్యూ

» నేలపైనే కూర్చుంటున్న కొందరు బాలింతలు

» ఇరుకైన గదిలోకి తోసుకుంటూ వెళ్తూ అవస్థలు

» శిశువులకు గాయాలయ్యే అవకాశం

» చోద్యం చూస్తున్న ఆసుపత్రి అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పాత ప్రభుత్వాసుపత్రిలో సరైన సదుపాయాలు లేక బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో ప్రసవమై.. శిశువు జన్మించిన ఎనిమిది రోజులకు బాలింత.. బిడ్డతో కలిసొచ్చి ఆరోగ్యమిత్ర వద్ద బయోమెట్రిక్, ఫొటో తీయించుకోవాలి. ఇలా.. పాత ప్రభుత్వాసుపత్రికి బయోమెట్రిక్ కోసం వచ్చే బాలింతలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పదుల సంఖ్యలో బాలింతలను ఒకేసారి పిలుస్తున్నారు. దీంతో కూర్చోడానికి బల్లలు లేక చాలామంది అలాగే నిలబడిపోతున్నారు. అప్పటికే బిడ్డకు జన్మనిచ్చి కుట్లు, ఇతర నొప్పులతో విలవిల్లాడుతున్న వారికి

మిగతా 6లో..

ఫ్యాన్లు లేక ఉక్కపోత

బయోమెట్రిక్ కోసం వచ్చే బాలింతలు, వారి సహాయకులు గాలి ఆడక ఇబ్బందులు పడుతున్నారు. పదుల సంఖ్యలో బాలింతలను బయోమెట్రిక్ కోసం పిలిపించి గది బయటే ఉంచుతున్నారు. ఆ గది బయట ఫ్యాన్లు లేకపోవడంతో పసిపిల్లలతో వచ్చిన బాలింతలు ఇబ్బంది పడుతున్నారు.

విన్నపాలు వినాలా

ఎల్‌ఆర్‌ఎస్‌లో నాలా గందరగోళం

» జూలై 25న నాలా రద్దు.. కొత్తగా ఈడీసీ విధానం

» రద్దుకు ముందు దరఖాస్తు చేస్తే నాలా ఫీజే కట్టాలి

» రెవెన్యూ శాఖ ప్రమేయం తొలగింపు

» ఎంత ఫీజు కట్టాలో తెలియక దరఖాస్తుదారుల సందిగ్ధం

» రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం అంటున్నా సందిగ్ధమే..

» వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు

» ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



సాఫీగా సాగిపోవాల్సిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌కు 'నాలా' ప్రతిబంధకాలు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రభుత్వం నాలాను రద్దుచేసి ఈడీసీని ప్రవేశపెట్టినప్పటికీ రెండింటి మధ్య లోటుపాట్ల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వందల సంఖ్యలో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వ్యవసాయ భూమిని వ్యవసాయేతరంగా మార్చుకోవటానికి గతంలో నాలా చట్టం ఉండేది. ప్రభుత్వం దీనిని రద్దుచేసి రెవెన్యూతో సంబంధం లేకుండా ఆ స్థానంలో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్ (ఈడీసీ)ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ప్లాన్‌కు అనుమతి కోరే సమయంలోనే ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)కు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విజయవాడ, సీఆర్‌డీఏ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వందలాది సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ నగరంలో 1,500 వరకు, సీఆర్‌డీఏ పరిధిలో 4 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. అయితే, ఈ దరఖాస్తులు ఓ పట్టాన పరిష్కారం కావట్లేదు. విజయవాడ నగరంలోనే 900, సీఆర్‌డీఏ పరిధిలో 2 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇంత భారీ సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి 'నాలా'నే కారణమని తెలుస్తోంది.

సమస్య ఇలా..

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే క్రమంలో పోర్టల్‌లో నాలా, ఈడీసీ రెండు ఆప్షన్లు చూపిస్తోంది. జూలై 25న నాలా రద్దు చేశారు. ఈలోపు వాటికి మాత్రం నాలా కట్టాలని, ఆ తర్వాత వచ్చిన వాటికి మాత్రం ఈడీసీ కట్టాలని చెబుతున్నారు. ఈడీసీ అయితే వెంటనే అదే పోర్టల్‌లో డబ్బు చెల్లించవచ్చు. నాలా అయితే అదే పోర్టల్‌లో కట్టడానికి వీల్లేదు. నాలా వ్యవస్థను రద్దు చేశాక రెవెన్యూ శాఖ ఫీజును కట్టించుకోవటం లేదు. మరి ఈ నాలాను ఎలా కట్టాలని దరఖాస్తుదారులు అడిగితే సెల్ఫ్‌గా కట్టుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు

మిగతా 6లో..

» రద్దు చేసిన ఆప్షన్ ఎందుకు?

నాలా రద్దు చేశాక కూడా పోర్టల్‌లో నాలా ఆప్షన్ ఎందుకు ఇచ్చారని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈడీసీ ఆప్షన్ ఇచ్చిన నేపథ్యంలో, దానికే డబ్బు కట్టించుకుంటే సమస్య తేలిగ్గా పరిష్కారమవుతుందంటున్నారు. దీంతో వందలాది దరఖాస్తుదారులు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, సీఆర్‌డీఏ అధికారుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఈ సమస్య తమ చేతుల్లో లేదని చెబుతున్నారు. నాలా రద్దుకు ముందు రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం చెల్లించాల్సి వచ్చేది. రద్దు తర్వాత ప్రవేశపెట్టిన ఈడీసీ విధానంలో అయితే రిజిస్ట్రేషన్ విలువపై 4 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నాలా రద్దు కాకముందు ఉన్న వాటిని ఈడీసీ పరిధిలోకి తేవటం వల్ల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఇలా రెండుగా ఇచ్చారు. దీనికి స్థానికంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిష్కారాన్ని చూపలేకపోతున్నారు. దీంతో వీటిని తాత్కాలికంగా పెండింగ్‌లో పెడుతున్నారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తమ గోడు వినిపిస్తున్న డ్వాక్రా మహిళలు



స్త్రీనిధి స్వాహా

పెనమలూరులో ఓ బుక్‌కీపర్ చేతివాటం

రూ.25 లక్షల వరకు మాయం

» విధుల నుంచి తొలగించిన అధికారులు

» ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

పెనమలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలంలోని ఓ డ్వాక్రా సంఘంలో రూ.25 లక్షల అవినీతికి పాల్పడిన బుక్‌కీపర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆమె చేతిలో మోసపోయిన కొందరు డ్వాక్రా గ్రూపు మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. పెనమలూరులోని ఐదో

మిగతా 6లో..

నలుగురు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు 6



ఇంద్రకీలాద్రిపై ముగిసిన కార్తీక ఉత్సవాలు

» పూర్ణాహుతితో ముగింపు 6

» 25 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ

సిటీబస్ పోర్టులో ఆటోల తిష్ఠ

» ఆటోల అడ్డగోలు పార్కింగ్‌తో స్తంభిస్తున్న ట్రాఫిక్

» బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

» కళ్లు మూసుకున్న ఆర్టీసీ అధికారులు 8



భక్తులకు గాజుల ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో సతీమణి

ఇంద్రకీలాద్రిపై ముగిసిన కార్తీక ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నెలరోజులపాటు జరిగిన పవిత్ర కార్తీకమాస ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వేదోక్తంగా పూర్ణాహుతిని నిర్వహించారు. శివాలయం వద్ద ఉన్న పాత యాగశాలలో వేద మంత్రాల మధ్య సాగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యుడు వి.శివ ప్రసాద్‌శర్మ, వేద పండితులు, దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు బడేటి ధర్మారావు, పెనుమత్స రాఘవరాజు, ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్‌బాబు పాల్గొన్నారు.

మహిళా భక్తులకు గాజుల ప్రసాదం

ఇంద్రకీలాద్రిపై శుక్రవారం మహిళా భక్తులకు గాజుల ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ సతీమణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుభప్రదమైన శుక్రవారం అపూర్వమైన ప్రసాదం లభించడం పట్ల వారు ఎంతో సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

25 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ

దేవస్థానం ఈవో శీనానాయక్ శుక్రవారం శివాలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం నుంచి వచ్చిన భవానీ భక్తులను కలిశారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన భవానీలు తాము మహామండపం 6వ అంతస్తులో అర్ధమండల దీక్ష తీసుకున్నామని తెలిపారు. అర్ధమండల దీక్షలను ఈనెల 25వ తేదీ వరకు స్వీకరించే అవకాశం ఉంది.

నలుగురు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

ఇంద్రకీలాద్రి : దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్టు శుక్రవారం ఈవో శీనానాయక్ తెలిపారు. ఏజెల్ సెక్యూరిటీ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ ఎ.సాయికుమార్, సెక్యూరిటీ సూపర్వైజర్స్ రాజేష్ నాయక్, శ్రీధర్, రమేష్ నాయక్‌లను దేవస్థానం విధులు నుంచి తొలగించాలని సెక్యూరిటీ ఏజెన్సీ, దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లను ఈవో ఆదేశించారు. ఏజెల్ సెక్యూరిటీ ప్రతినిధులు ఈవోని కలసి, నలుగురు సెక్యూరిటీ సిబ్బంది దేవస్థానం భద్రతాచర్యల్లో నిర్లక్ష్యం వహిస్తూ, వ్యక్తిగత విబేధాలతో సంస్థకు చెడ్డ పేరు తీసుకువస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. వీరి స్థానంలో తక్షణమే వేరొక సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఈవో ఆదేశించారు. దేవస్థానంలో ప్రైవేట్ సెక్యూరిటీ వ్యవస్థ పర్యవేక్షణకు దేవస్థానం తరఫున టెంపుల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏర్పాటు ఆవశ్యకతను ధర్మకర్తల మండలి చైర్మన్, దేవదాయశాఖ కమిషనర్ల దృష్టికి తీసుకువెళ్తామని ఈవో పేర్కొన్నారు.



నర్సింగ్ విద్యార్థితో జీజీహెచ్ వైద్యులు

జీజీహెచ్‌లో అరుదైన వాయిస్ శస్త్రచికిత్స

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అరుదైన వాయిస్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. మహిళా స్వరంతో మాట్లాడే 19 ఏళ్ల యువకుడికి ఆపరేషన్ చేసి పురుషుడి స్వరం రప్పించారు. ఈఎన్టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవి ఆపరేషన్‌ను నిర్వహించారు. వివరాలను ఆసుపత్రి వైద్యబృందం శుక్రవారం మీడియాకు వెల్లడించింది. ఏలూరుకు చెందిన నర్సింగ్ విద్యార్థి తేజవికాస్ మహిళా స్వరంతో మాట్లాడేవాడని వైద్యులు తెలిపారు. దీంతో అతను మానసికంగా ఇబ్బంది పడేవాడని చెప్పారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్యూబర్ఫోనియా వ్యాధి ఉన్నట్టు నిర్ధారించామన్నారు. వాయిస్ థెరపీ చేస్తే చాలా తక్కువ మార్పు వస్తుందని వైద్యులు చెప్పారు. టైప్-3 థైరోప్లాస్టీ శస్త్ర చికిత్స ఉత్తమ మార్గంగా శస్త్ర చికిత్స పూర్తి చేసినట్టు చెప్పారు. చికిత్స అనంతరం యువకుడికి సహజమైన పురుష స్వరంగా మారిపోయిందని తెలిపారు. చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ కె.రవి, అనస్తీషియా డాక్టర్ వినయ్‌లను సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి.రావు అభినందించారు. అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులకు నర్సింగ్ విద్యార్థి తేజవికాస్ కృతజ్ఞతలు తెలిపాడు.

రైతులకు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేస్తాం

- మంత్రి నారాయణ

తుళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రైతులతో ఎవరు అవహేళనగా మాట్లాడలేదని, రైతులకు ఏ సమస్య వచ్చినా రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాలలోని ఈ హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్నా 15 అంగన్‌వాడీ భవనాలు, 14 పీహెచ్‌సీ భవనాలు, 14 పాఠశాలలు, ఒక మల్టీ పర్పస్ శ్మశాన వాటిక నిర్మాణం, వాటిల్లో మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా మిగిలిన పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, గ్రామ కంఠాలు, జరీబు, లంక భూముల సమస్యలపై ప్రతిరోజూ అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. లంక భూములకు ఎన్జీటీ అనుమతులు ఇవ్వడం లేదని, ఒకరిద్దరు రైతులు తమకు కోరుకున్న చోటా ఫ్లాట్స్ కావాలని డిమాండ్ చేస్తున్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడ రిటర్నబుల్ ఫ్లాట్స్ ఇచ్చే అవకాశం లేదని మంత్రి నారాయణ తెలియజేశారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్లలో మౌలిక సదుపాయిల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రాజధానిలో మొత్తం 29,421 మంది రైతులకు 61,433 ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంకా కేవలం 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ప్రతిరోజు 30 నుంచి 40 రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని వివరించారు. గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని తెలిపారు. కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు కారణంగా కొన్ని ప్లాట్ల కేటాయింపు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఒకరిద్దరు రైతులు అనవసరంగా సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు పెడుతున్నారని, రైతులు ఎవరికీ అన్యాయం జరగదని రైతులకు ఏ సమస్య ఉన్నా పరిష్కారం చూపిస్తామని మూడు సంవత్సరాలలో రాజధాని పూర్తి చేసి తీరుతామని మరోసారి మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

1991లో తొలిసారిగా బెజవాడలోని పుష్పహోటల్‌లో పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) నక్సల్స్ ఓ ఎస్సైని దారుణంగా హత్యచేశారు. అది జరిగి నేటికి 34 ఏళ్లు అయ్యింది. బెజవాడలో నక్సల్స్ పంజా విసిరిన మొదటి ఉదంతం ఇది. పుష్పహోటల్‌లో తెల్లవారుఝామున 5.30 గంటల సమయంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్‌బీ)లో పనిచేసే ఎస్సై ఇమ్మానియేల్ రాజు దారుణ హత్యకు గురయ్యాడు. పెను సంచలనం సృష్టించిన మర్డర్ మిస్టరీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పుష్ప హోటల్‌లో.. పేలిన తూటా!



బెజవాడలో నిత్యం రద్దీగా ఉండే పుష్పహోటల్ సెంటర్

- 1991లో తెగబడిన షెల్టర్ జోన్ పీడబ్ల్యూజీ నక్సల్స్
- బెజవాడలోని పుష్ప హోటల్‌లో ఎస్ఐ దారుణ హత్య
- నక్సల్స్ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తున్నాడనే నెపంతో.. పిస్టల్‌తో కాల్చి హత్య



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎస్సై ఇమ్మానియేల్ రాజు నక్సల్స్ కదలికలపై పక్కా సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు, నక్సల్స్‌ల మధ్య పోరు నెలకొన్న సమయంలో ఎస్సై అందించే కీలక సమచారంతో నక్సల్స్‌కు ఇబ్బందికరంగా మారింది. పీపుల్స్ వార్ గ్రూప్‌లో సర్కారు జిల్లాల బాధ్యతలు చూడటంతో పాటు రాష్ట్ర కమిటీ మెంబర్, పొలిట్ బ్యూరో మెంబర్‌గా వ్యవహరించే నిమ్మలూరి భాస్కరరావు అలియాస్ మల్లిక్ పూర్తి సమాచారం తెలుసుకునే బాధ్యతను ఎస్సై ఇమ్మానియేల్ రాజుకు అప్పగించడం.. ఈ విషయం పీడబ్ల్యూజీ అగ్రనాయకత్వానికి సమాచారం అందింది. దీంతో సర్కారు జిల్లాలకు చెందిన ఓ దళానికి ఎస్సై ఇమ్మానియేల్ రాజును చంపమని బాధ్యతలు అప్పగించింది. విజయవాడలోని పీడబ్ల్యూజీ కొరియర్స్, సానుభూతిపరుల ద్వారా పుష్ప హోటల్ సెంటర్ దగ్గర నివశిస్తున్నాడని తెలుసుకున్నారు. ఇమ్మానియేల్ రాజు ఇల్లెక్కడో తెలుసుకోవటానికి ఇద్దరు పిల్లల్ని ఎంచుకుని, వారికి చిరుతిళ్లు కొనిపెట్టి ప్రతి ఇంటికీ వెళ్లి ఇమ్మానియేల్ రాజు ఇల్లు ఇదేనా అని అడిగించారు. ఇలా ఆ వీధిలో ఓ ఇంటి దగ్గర ఇమ్మానియేల్ రాజునే ఆ పిల్లలు అడిగారు. దీంతో ఇమ్మానియేల్ రాజు స్థానికంగా ఉండే పీడబ్ల్యూజీ సానుభూతిపరుడే ఈ పని చేయించాడని తెలుసుకుని ఆ పిల్లలకు తాను చెప్పాలనుకున్న ఘాటైన సందేశాన్ని చెప్పి పంపారు. పిచ్చి పని చేసిన విషయం తెలుసుకున్న నక్సల్స్ దళం ఆ సానుభూతిపరుడిని ఉన్న పళానా ఇంటిని ఖాళీ చేయించారు. కొద్ది రోజులు గ్యాప్ తీసుకున్నారు. ఇమ్మానియేల్ రాజు ఈ పరిణామానికి వెరవలేదు. తన ఇంటిలోనే ఉంటూ ఎస్ఐబీకి వెళుతూ ఉండేవారు. కొంత కాలం కొండపల్లి రిజర్వు ఫారెస్టులోనే అజ్ఞాతంలో ఉన్న దళం మళ్లీ బయటకు వచ్చి పుష్ప హోటల్ సెంటర్‌లో రెక్కీ వేసింది. ప్రతి రోజూ ఇమ్మానియల్ తెల్లవారుఝామునే బయటకు నడచుకుంటూ వచ్చి పుష్ప హోటల్‌కు వచ్చి కూర్చుని తీరిగ్గా పేపర్ చదువుకునేవారు. ఈ విషయాన్ని పసిగట్టిన దళ సభ్యులు కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు వెళ్లి ఇమ్మానియేల్ రాజు మర్డర్ ప్లాన్‌ను రూపొందించుకున్నారు. మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు సాయుధాలతో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి బయలుదేరాలని, ఐదు గంటలకల్లా విజయవాడకు చేరుకోవాలని నిర్ణయించారు. ఇమ్మానియేల్ రాజు ఎప్పటిలాగానే ఐదు గంటలకు బయటకు నడుచుకుంటూ వచ్చి సమీపంలో పేపర్ కొనుగోలు చేసి పుష్ప హోటల్‌కు వచ్చారు. పుష్ప హోటల్ ఇంకా అప్పటికి తెరచుకోకపోతే డోర్ కొట్టి అందులో పని చేస్తున్న సిబ్బందితో షట్టర్ తీయించారు. ఆ తర్వాత ఆయన చివరి వరుసలో ఉన్న టేబుల్ దగ్గర కూర్చుని పేపర్ చదువుకుంటున్నారు. ఇదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఇద్దరు నక్సల్స్ బయట కాపలా కాసే విధంగా, ఇద్దరు హోటల్‌లోకి వెళ్లేలా ప్లాన్ చేశారు. బ్యాగుతో వెళ్లిన ఇద్దరిలో ఒకరు ఇమ్మానియేల్ రాజు ఎదురుగా ఉన్న టేబుల్ మీద ఆయనకు ఎదురుగా కూర్చున్నారు. రెండో వ్యక్తి ఆ పక్క టేబుల్‌లో కూర్చున్నాడు. టీ కోసం వచ్చారేమోనని పెద్దగా వారిని ఇమ్మానియేల్ రాజు అనుమానించలేదు. పేపర్ చదువుతుండగా, పక్క టేబుల్ మీద ఉన్న బ్యాగులో కాగితంలో చుట్టిన పిస్టల్‌ను తీసి తన ఎదురుగా ఉన్న ఇమ్మానియేల్ రాజుకు గురి పెట్టి పాయింట్ బ్లాక్ రేంజ్‌లోనే కాల్చాడు. అక్కడికక్కడే కుర్చీపై ఇమ్మానియేల్ రాజు కూలిపోయాడు. పిస్టల్ సౌండ్ రావటంతో స్థానికులు ఒక్కసారిగా హోటల్‌కు దగ్గరకు వచ్చారు. లోపలి నుంచి ఇద్దరు వచ్చే లోపు బయట ఉన్న వారు ప్రజలకు పిస్టల్స్ చూపించి దూరంగా జరిగేలా చేశారు. లోపలి వాళ్లు బయటకు రాగానే, అక్కడ ముందుగానే అందుబాటులో ఉంచిన సైకిళ్లపై పరారయ్యారు. ఈ ఘటనకు ముందు కానీ, వెనుక కానీ బెజవాడలో నక్సల్స్ నుంచి దుశ్చర్యలు జరగలేదు. 2006లో రాకెట్ లాంచర్లను దిగుమతి చేసుకోవటం తప్పితే అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

విన్నపాలు వినాలా

(5వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లోకి వెళ్లి నాలాను చెల్లించాలంటున్నారు. అక్కడ ఇచ్చే రశీదును తీసుకుని రమ్మంటున్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే.. నాలా ఎంత కట్టాలన్నది టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పష్టంగా చెప్పారు. ఏ రోజున నాలా అగ్రిమెంట్ జరిగిందో అప్పటి రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం చెల్లించాలని పేర్కొన్నారు. కానీ, రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతాన్ని సరిగ్గా అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇంత కట్టాలని చెబితే కట్టేవారు. ఇప్పుడు సెల్ఫ్‌గా అంచనా వేయలేక దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. పొరపాటున తక్కువ కడితే సమస్యలు వస్తున్నాయంటున్నారు. ఫలితంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ముందుకు కదలట్లేదు.

డీటీసీపీకి తెలియజేశాం : మోహన్‌బాబు, అసిస్టెంట్ సిటీప్లానర్-3

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్‌పై వీఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్-3 మోహన్‌బాబును వివరణ కోరగా, ఈ సమస్యను తాము డైరెక్టర్ ఆఫ్ కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్ (డీటీసీపీ) దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీటీసీపీ స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. కాగా, ఈ ప్రతిపాదనలు వెళ్లి నెల దాటినా ఇంకా దీనిపై నిర్ణయం తీసుకోలేదు.

నిడమానూరు డబుల్ డెక్కర్‌పై నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

జాప్యం జరగకుండా ఉంటే..

నిడమానూరు ఫ్లై ఓవర్ విషయంలో కొంత జాప్యం జరిగింది. ఈ జాప్యం జరగకపోయి ఉంటే ఫ్లై ఓవర్ విషయంలో కేంద్రం పునరాలోచించే అవకాశం ఉండేది కాదు. డీపీఆర్ తయారైన తర్వాత చాలాకాలం వేచి ఉండటం వల్ల టెండర్లు పిలవలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కేంద్రం ఇది అవసరం లేని ప్రాజెక్టుగా భావించింది. కానీ, నగరానికి ఇది చాలా అవసరం. మహానాడు జంక్షన్ నుంచి దాదాపు చిన్నాపెద్దా కలిపి 12కు పైగా జంక్షన్లు ఉన్నాయి. ఆటోనగర్‌కు వెళ్లే వాహనాల కారణంగా జంక్షన్ల వద్ద రద్దీ ఏర్పడుతోంది. దీని కారణంగా ఈ మార్గంలో విజయవాడకు చేరుకోవాలంటే అరగంట సమయం పడుతోంది. అంతర్గత ట్రాఫిక్, ఆటోనగర్‌కు వెళ్లే వాహనాల కారణంగా ఈ మార్గంలో ఫ్లై ఓవర్ అవసరం చాలా ఉంది.

మెట్రో వెళ్లాలంటే డబుల్ డెక్కరే కావాలా?

మెట్రో లైన్ కారణంగా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌పై అనవసరంగా కాలాతీతం చేశారేమోనన్న భావన కలుగుతోంది. ఎనికేపాడు నుంచి రామవరప్పాడు వరకు భవనాలు ఉండటం వల్ల ఎక్కువగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. మార్జిన్ల వెంబడి మెట్రో కారిడార్ వేసే పరిస్థితి కూడా లేదు. కానీ, నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఫ్లై ఓవర్‌ను ఆనుకుని మెట్రో లైన్‌ను తీసుకెళ్లడమే పరిష్కారంగా ఉంది. రెండూ పక్కపక్కన ఉంటాయి. దీనికి అనుగుణంగా ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను అటు, ఇటుగా జరిపితే సరిపోతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

కమర్షియల్ కాటన్ కార్పొరేషన్

(5వ పేజీ తరువాయి)

రైతన్న ఆక్రందన

మొంథా తుఫాను పత్తి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. క్వింటా పత్తి తీసేందుకు రూ.3 వేలు ఖర్చు కాగా, సదరు పత్తిని కొనేవారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పూత, కాయదశలో పంట ఆయువుపై మొంథా దాడి చేసింది. ఎరువులు అందించినా తట్టుకోలేని స్థితికి పంట చేరింది. ఎన్నడూ లేని విధంగా ఎకరాకు రూ.50 వేల వరకు కౌలు, పెట్టుబడులు పెట్టిన రైతు దెబ్బతిన్న పంటను చూసి రోదిస్తూ ఉండిపోయాడు. ప్రభుత్వ సాయం తప్ప ప్రత్యామ్నాయం లేక పంటను వదిలేశాడు. తుఫాను సమయంలో అన్నదాతలకు పూర్తి పరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనలు అన్నదాతలకు ఊపిరినిచ్చాయి. ప్రభుత్వం ఆదుకుంటుందో లేక ఆవిరి చేస్తుందో అనే మీమాంసలో ఉన్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ పరిహారంపై పలు అనుమానాలతో ఉండిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుఫానుకు పత్తి పంట దెబ్బతిన్నప్పటికీ మన జిల్లాలోనే భారీగా నష్టం వాటిల్లింది. కేవలం ఒక్క జిల్లాలోని పత్తిని కొనడానికి సీసీఐ ఇన్ని నిబంధనలు పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సీసీఐపై ఒత్తిడి తేడవం ద్వారా పత్తిని కొనుగోలు చేయించాలి.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ



చిత్రలేఖన పోటీలో ప్రోత్సాహక బహుమతి అందుకున్న మొహ్మద్ రహిల్ జయాన్

గుణదల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలతో నేటి యువత రాణించాలని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య అన్నారు. ఎన్డీపీసీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రోత్సాహక బహుమతి సాధించిన మొహ్మద్ రహిల్ జయాన్‌ను పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తెలిపారు. రహిల్ తన ప్రతిభతో పాఠశాల కీర్తిని మరింత పెంచాడని కొనియాడారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అధికారులతో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారుల కు కలెక్టర్ బాలాజీ సూచించారు. బం దరు మండలం భోగిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు రోడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పం చాయతీ రాజ్ అధికారులతో చర్చించా రు. వైద్యసేవా కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, ఎండీవో వెంకటేష్ పాల్గొన్నారు.

స్త్రీనిధి స్వాహా

(5వ పేజీ తరువాయి)

సెక్టార్ ఏరియాలో 43 డ్వాక్రా గ్రూపులకు బుక్ కీపర్‌గా గతంలో మోత్రపు సునీత పనిచేసేది. తాను కొన్నేళ్లుగా తన పరిధిలోని సంఘ సభ్యులకు స్త్రీనిధి రుణాలు ఇప్పించేది. ఈ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసి, డబ్బును సదరు డ్వాక్రా గ్రూపు ఖాతా వేసిన వెంటనే.. చేతివాటం చూపించి రూ.లక్షలు కాజేసేది. గ్రూపు సభ్యులు ప్రశ్నిస్తే బుకాయించి నోళ్లు మూయించేది. అయితే, గ్రూపు సభ్యుల ద్వారా బుక్‌కీపర్ చేతివాటం విషయం అధికారులకు తెలియడంతో ఆమెను విధుల నుంచి తప్పించారు. అధికారులు విచారణ జరపగా, ఆమె సుమారు రూ.25 లక్షల నిధులు స్వాహా చేసిందని తేల్చి పైఅధికారులకు నివేదించారు. తాను నిధులను స్వాహా చేశానని ఒప్పుకొన్న సునీత గ్రూపు సభ్యుల డబ్బును విడతలవారీగా ఇస్తానని చెప్పి నమ్మించింది. తాను, తన కుటుంబసభ్యుల పేర్లతో ప్రామిసరీ నోట్లు ఇచ్చింది. ఎంతకీ అధికారులు తమకు న్యాయం చేయకపోవడం, సునీత డబ్బు ఇవ్వకపోవడంతో సభ్యులు.. గ్రామ టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్ ద్వారా ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను శుక్రవారం కలిసి విన్నవించుకున్నారు. దీనిపై పోలీసులు, పై అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. పెనమలూరు మండలం మొత్తం మీద ఇలాంటి కుంభకోణాలు అనేకం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోతుగా విచారణ చేస్తే అన్నిచోట్లా స్త్రీశక్తి నిధుల స్వాహా వ్యవహారాలు బయటపడే అవకాశం ఉంది.

భయోమెట్రిక్

(5వ పేజీ తరువాయి)

ఈ పరిస్థితి నరకయాతనగా మారింది.

నేలపైనే కూర్చుంటున్న బాలింతలు

ఆరోగ్యమిత్రలో రిజిస్ట్రేషన్‌కు ఒక్కొక్కరికి కనీసం 10 నిమిషాల సమయం పడుతోంది. పదుల సంఖ్యలో వచ్చిన బాలింతలు గది ముందు వేసిన బెంచీలు చాలక, అక్కడికి వచ్చి నిలబడలేక, నేలపై కూర్చోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందరినీ ఒకేసారి రమ్మని చెప్పడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా రెండో అంతస్థులో ఉన్న బాలింతలు కిందకు దిగి, అంతసేపు నిలబడి ఉండి మళ్లీ పైకి వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. లిఫ్టు ఈ గది పక్కన కూడా లేదు. 10, 15 మందిని ఒకేసారి పిలిచి, వారు అయ్యేలోగా మరికొంత మందిని పిలిపిస్తే బాగుంటుందని బాలింతలు చెబుతున్నారు. శిశువులను ఎత్తుకోవడం కష్టమవుతున్న సమయంలో వారి సహాయకులు కూడా అక్కడ ఉంటున్నారు. వారందిరితో ఆ ప్రాంతమంతా ఇరుగ్గా మారుతోంది. ముఖ్యంగా ఆరోగ్యమిత్ర గది వద్ద గుమిగూడటంతో శిశువులకు గాయాలవుతున్నాయి. ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం కూడా ఉంది. ఆ గది వద్ద నియంత్రించడానికి కూడా ఎవరూ లేకపోవడం ఆసుపత్రి సిబ్బంది బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.

పై నుంచి కిందకు రావడానికి ఇబ్బంది పడ్డాను

నాకు ఆపరేషన్ అయింది. ఇప్పటికే చాలానొప్పిగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కిందకు దిగాలంటే ఇబ్బంది పడ్డా. కింద ఉన్నవారితో పాటే పై అంతస్థులో ఉన్న మమ్మల్ని పిలిచారు. నాతో మరో ఐదారుగురు ఇలాగే ఇబ్బంది పడ్డారు. కిందవారి ప్రాసెస్ పూర్తయ్యాక మమ్మల్ని పిలిస్తే బాగుండేది. పై అంతస్థు నుంచి వచ్చి ఇక్కడ ఇంత సమయం ఉండాలంటే ఇబ్బందిగా ఉంది. బల్లలు సరిగ్గా లేవు. గాలి రావట్లేదు. అందరి పరిస్థితి అంతే, ఎవరినీ ఏం అనలేం.

- దుర్గ, బాలింత, కృష్ణలంక

ఏలూరు ఆర్టీసీ డీజిల్ బంక్‌లో

అవినీతి నిగ్గు తేల్చండి

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నేతల డిమాండ్

బస్‌స్టేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్టీసీ డీజిల్ బంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులను శిక్షించాలని ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదర్‌రావు, జి.వి.నరసయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరులో ఆర్టీసీ మేనేజ్‌మెంట్ 2021లో ఏర్పాటు చేసిన డీజిల్ బంకు నిర్వహణలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్టు తెలిపారు. బంకులో విధులు నిర్వహించే వారంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులని, వారిపై కనీస పర్యవేక్షణ లేదన్నారు. ఆడిట్‌లో సుమారు రూ.82 లక్షల అవకతవకలు జరిగాయని నిర్ధారణ చేశారని తెలిపారు. దీనిపై వాస్తవాలను తెలిపి బాధ్యుల పై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రూ.82లక్షలను సంబంధిత సిబ్బంది తొమ్మిది మంది నుంచి రూ.50లక్షలు ఇప్పటికే వసూలు చేసి, వారిని కేసుల నుంచి తప్పించారన్నారు. డీజిల్ స్కామ్‌పై పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కామ్‌కు పాల్పడిన వారిని వదిలేసి కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయటం, వారిని సస్పెండ్ చేయటం సరైనది కాదన్నారు.

ఉద్యోగులపై సస్పెన్షన్ రద్దు చేయాలి

- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ఏలూరు ఆర్టీసీ డిపోలో ముగ్గురు ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్ రద్దుచేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జిలానీ బాషా, కట్టా సుబ్రహ్మణ్యంలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో ఎటువంటి సంబంధం లేని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్.సుందరయ్య సహా మరో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ సస్పెండ్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.

నిబంధనలు ఉల్లంఘించలేదు

- కనుమూరు తవ్వకాలపై లారెన్ మినరల్స్ యాజమాన్యం

గంపలగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతుల మేరకు నిబంధనలకు అనుగుణంగా కనుమూరులో క్వారీయింగ్ జరుపుతున్నామని లార్వెన్ మినరల్స్ యాజమాన్యం పేర్కొంది. 'పలుకురాయిపై పలకరేం'.. కనుమూరులో ప్రమాదకరంగా తవ్వకాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై శుక్రవారం వివరణ ఇచ్చింది. తాము జరుపుతున్న పేలుళ్లకు దగ్గర్లో ఉన్న ఇళ్లకు నష్టం వాటిల్లలేదని తెలిపింది. ఇలాంటివి జరిగాయని స్థానికులు ఎలాంటి ఫిర్యాదులు చేయలేదన్నారు. డీజీఎంఎస్ నిబంధనల మేరకు బ్లాస్టింగ్ జరుపుతున్నామని పేర్కొంది. గనులు, భూగర్భశాఖ అనుమతించిన మేరకు మాత్రమే తవ్వకాలు జరుపుతున్నామని తెలిపింది. క్వారీ అటవీ ప్రాంతానికి 10కిలోమీటర్ల దూరంలో ఉన్నందున వన్య ప్రాణులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపటం లేదని పేర్కొంది.

24న మహిళల సాఫ్ట్ టెన్నిస్

లబ్బీపేట, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.దిలీప్ తెలిపారు. ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాలలో లీగ్ జరుగుతుంని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్, జన్మదిన ధృవీకరణ పత్రంతో 24వ తేది ఉదయం 8గంటలకు హాజరుకాగలరని తెలిపారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 125,134, 145
చికెన్ విత్ స్కిన్ 240
చికెన్ స్కిన్‌లెస్ 250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

అండర్-12 బాలుర క్రికెట్‌కు ఎంపికలు రేపు

విజయవాడస్పోర్ట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న అండర్-12 బాలుర ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి తెలిపారు. ఈ ఎంపికలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతాయని, ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని తెలిపారు.





అధ్వానస్థితిలో కృష్ణలంకలోని పుష్కరఘాట్లు

విరిగిన టైల్స్..పెచ్చులూడిన మెట్లు

● గోతులతో ఇబ్బంది పడుతున్న వాకర్స్ ● అసాంఘిక శక్తులకు అడ్డాగా కృష్ణలంక పుష్కర ఘాట్లు

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి : కృష్ణలంకలోని మెట్లబజారు నుంచి సీతమ్మవారి పాదాల వరకు పుష్కర ఘాట్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. గత పుష్కరాల సమయంలో అధికారులు ఆగమేఘాల మీద చేపట్టిన పనుల కారణంగా పుష్కరాలు అయిన తర్వాత నుంచి టైల్స్ ఊడిపోవడం, వరదలు వచ్చినప్పుడు ఘాట్ అంతా గుంతలమయంగా మారి పెచ్చులూడిపోవడంతో ప్రభుత్వం ఖర్చుపెట్టిన లక్షలాది రూపాయలు నీళ్లపాలైనట్లైంది. పుష్కరఘాట్‌లో మెట్లబజారు నుంచి సీతమ్మవారి పాదాల వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ వాకింగ్



చేస్తుంటారు. వారు వాకింగ్ చేయడానికి కూడా వీలులేకుండా అక్కడక్కడ గోతులమయంగా మారడంతో వాకర్స్‌కు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రాత్రయితే అసాంఘిక శక్తులు మెట్ల మీద కూర్చుని మద్యం సేవిస్తూ, ఆ బాటిళ్లను అక్కడే పగులకొట్టి మెట్లపై పడేస్తున్నారు. దీనికి తోడు పెద్దస్థాయిలో వరద వచ్చినప్పుడు మెట్ల కింద వున్న చప్టా కూడా గుంతలు పడటం, టైల్స్ అన్నీ కొట్టుకుపోవడం, మరికొన్ని టైల్స్‌ను ఆకతాయిలు పగులకొట్టడం చేస్తూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు.

2028లో పుష్కరాలు ఉన్న నేపథ్యంలో అప్పటికి గాని మళ్లీ కార్పొరేషన్ అధికారులు కళ్లు తెరవరని, ఆ సమయంలోనే పుష్కర ఘాట్ల పనులకు నిధులు కేటాయించి మళ్లీ టైల్స్ వేయిస్తారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కూడా పుష్కర ఘాట్లపై కూర్చుని మద్యం సేవించకుండా చూడాలని కోరుతున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌లైన్ల పునరుద్ధీకరణ, మరమ్మతుల కారణంగా ఆర్టీసీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ భ్రమరాంబపురం, 33/11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సిటీ బస్టాండ్, కృష్ణలంక పోలీసు స్టేషన్, రైతుబజారు, అయితా రాములు కొట్టు ప్రాంతం, నిమ్మకాయల లక్ష్మణరావు వీధి, మసీదు రోడ్డు, సతీష్‌కుమార్ రోడ్డు, కోతమిషన్ రోడ్డు, ఆనంద్‌భవన్ రోడ్డు, గంగానమ్మ గుడి వీధి, పాత పోస్టాఫీసు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నెక్స్‌జెన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో రాజశేఖర్, ప్రిన్సిపాల్ సమ్రానా

భారతీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గురునానక్ రోడ్డులోని నెక్స్‌జెన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాజెక్ట్ విద్యార్థుల్లోని ప్రతిభను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు విద్యార్థుల కృషి, సృజనాత్మకత, నైపుణ్యాలకు ప్రతిబింబాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వంశీ, డైరెక్టర్ శాంతి, సీఈవో గౌతమీ, ప్రిన్సిపాల్ సమ్రానా, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

మాచవరం ఎస్ఐ శంకరరావు



బీఎస్ఆర్‌కే పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ శంకరరావు, విద్యార్థినులు

గుణదల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను చీకటిమయం చేసుకోకుండా జాగ్రత్త పడాలని మాచవరం ఎస్ఐ జి.శంకరరావు అన్నారు. మొగల్రాజపురంలోని బీఎస్ఆర్‌కే నగరపాలకసంస్థ పాఠశాలలో మాదకద్రవ్యాలు- ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ జి.శంకరరావు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని తద్వారా జీవితం అంధకారం అయిపోతుందని వివరించారు.

డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈతకెళ్లిన ఇద్దరు విద్యార్థులు తల్లిదండ్రులకు అప్పగింత



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కృష్ణలంక పోలీసులు

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు వెళ్లకుండా కృష్ణానదిలో ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులను కృష్ణలంక పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసు కమిషనరేట్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని ముఖ్య ప్రదేశాలలో, బ్లాక్ స్పాట్ ఏరియాలలో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయో పర్యవేక్షించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కృష్ణలంక పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుళ్లు జమేషు, ఎస్.కె.జానీ కృష్ణానది ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు పిల్లలు స్కూల్‌కి వెళ్లకుండా ఇసుక తిన్నెలలోని నదిలో ఈత కొట్టడానికి వెళ్లినట్లు తెలుసుకున్నారు. వెంటనే వారిని స్టేషన్‌కి తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్లపైన యథేచ్ఛగా వాహనాల పార్కింగ్

● జవహర్ ఆటోనగర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు



ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్‌లోని వంద అడుగుల రోడ్డుతో పాటు అంతర్గరోడ్లలో సైతం వాహనాలు ఇష్టారాజ్యంగా నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు మరమ్మతుల నిమిత్తం షెడ్‌లకు వచ్చే వాహనాలను రోడ్లపై నిలపడంతో తరుచూ ట్రాఫిక్ జామ్‌అవుతోంది. దీనికి తోడు పలు దుకాణదారులు, వాహనాల మరమ్మతులు చేసే సంస్థలు రోడ్లపైనే వాహనాలను యథేచ్ఛగా నిలపడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఐలా అధికారులు దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. ట్రాఫిక్ పోలీసులు సైతం ఆటోనగర్‌లో ట్రాఫిక్ సమస్యపై చర్యలు చేపట్టడం లేదు. నిత్యం వంద అడుగల రోడ్డు సాయి హోటల్ ప్రాంతం, సన్‌లైట్ సెంటర్, పంట కాలువరోడ్డు ప్రాంతం, ఫైర్‌స్టేషన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయి. తగుచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

2029లోగా అర్హులకు ఇంటి స్థలం

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి 2029లోగా ఇంటిస్థలం, లేదా ఇల్లు నిర్మాణం చేసి అందజేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. వివిధ అంశాలపై ప్రజల నుంచి వచ్చిన 300 అర్జీలను తీసుకొని వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ మొగల్రాజపురానికి చెందిన వాసంశెట్టి లిఖితకు డయాలసిస్ నిమిత్తం రూ.15,000, 13వ డివిజన్ పటమటకు చెందిన మొహమ్మద్ సికిందర్‌కు వైద్యఖర్చుల నిమిత్తం రూ.15,000 ఆర్థిక సహాయాన్ని గద్దె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో శుక్రవారం ఈ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని, ఎక్కువమంది ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అనంతరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గద్దె సమావేశం నిర్వహించి, ప్రజాదర్బార్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్-3 జోనల్ కమిషనర్ షమ్మి, స్వర్ణాంధ్ర విజన్ విజయవాడ యూనిట్ యంగ్ ప్రొఫెషనల్ ఎం.దుర్గా శాంతి, కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలి

ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో స్పా డైరెక్టర్ ప్రొఫెసర్ కొండ రమేష్



వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ కొండ రమేష్ తదితరులు

గుణదల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం వికసించాలంటే యువతలో నైపుణ్యత పెంపొందాల్సిందేనని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (స్పా) విజయవాడ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండ రమేష్ అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 88వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొండ రమేష్ మాట్లాడుతూ యువత కేవలం పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో ఆగిపోకూడదని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, సమస్యల పట్ల స్పందన, సాంకేతిక పరిజ్ఞానం తదితర రంగాల్లో తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. చెస్ గ్రాండ్ మాస్టర్ లిఖిత్‌బాబు మాట్లాడుతూ విద్య, క్రీడలు రెండింటినీ సమతుల్యంగా కొనసాగించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ సాంకేతిక విద్యతో యువతకు ఉపాధి అవకాశాలు అందనున్నాయని చెప్పారు. అనంతరం యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి 'గొరిపర్తి' జన్మదిన వేడుకలు

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 21వ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొరిపర్తి నామేశ్వరరావు 51వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొరిపర్తిని దుశ్శాలువాతో సత్కరించిన టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి ఆయనకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కొర్రా అప్పన్న, వేములపల్లి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

కంకరగుట్ట తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భారతీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాల రోడ్లో అడ్డుగా ఉన్న కంకరగుట్టను వీఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. ఐటీఐ రోడ్లో ప్రమాదకరంగా కంకరరాళ్లు అనే శీర్షికన ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు, 5వ నెంబర్ రోడ్డులో ఐటీఐ కళాశాల సమీపంలో సైడ్ డ్రెయిన్లు, రోడ్డు మరమ్మతుల నిమిత్తం వేసిన కంకర గుట్టను తొలగించారు.

ఎస్ఎంసీలో న్యూరోసర్జరీలపై సైంటిఫిక్ సదస్సు

● ఏపీఎన్ఎస్ఏ ఆధ్వర్యంలో నేడు, రేపు సదస్సు

విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్ఎస్ఏ (ఆంధ్రప్రదేశ్ న్యూరోసైంటిస్ట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో న్యూరాలజీ, న్యూరోసర్జరీ సైంటిఫిక్ సదస్సు జరగనున్నట్టు జీజీహెచ్ న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ బాబ్జీ శ్యాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే న్యూరో క్లినిక్స్‌లో భాగంగా ఈ సంవత్సరం సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రసంగాలు, కేసు ప్రజంటేషన్లు జరుగుతాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. మూర్ఛ, మతిమరుపు, స్ట్రోక్స్, అటాక్సియా తదితర మెదడుకు సంబంధించిన వ్యాధులకు చికిత్సా విధానాలు, న్యూరోసర్జరీలో నూతన పద్ధతులపై చర్చలుంటాయన్నారు.

మాక్ అసెంబ్లీకి కొమ్మా సీతారామయ్య పాఠశాల విద్యార్థిని దేవిప్రియ ఎంపిక

విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం నుంచి పటమటలంకలోని శ్రీ కొమ్మా సీతారామయ్య బాలికోన్నత పాఠశాలకు చెందిన పిడికిటి దేవిప్రియ భావన(పదో తరగతి) ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు బి.పద్మలత తెలిపారు. మాక్ అసెంబ్లీకి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేశారు. దీనికోసం నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పిడికిటి దేవిప్రియభావన ప్రథమస్థానం సాధించి ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో దేవిప్రియ పాల్గొననున్నట్లు హెచ్ఎం తెలిపారు. దేవిప్రియను పాఠశాల ప్రధానోపాయ్యులు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

సిద్ధార్థ వర్సిటీలో కొనసాగుతున్న వర్క్‌షాప్

కానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ థీమ్‌తో కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం రెండురోజు కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ సాగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లా నుంచి డీఈవోలు, డైట్ ప్రిన్సిపాల్స్, ఎస్ఈఆర్‌టీ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. నిపుణులు డాక్టర్ రాజేష్ సామ్, వి. శ్రీవాత్సవ్, డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు చర్చలో పాల్గొని ప్రసంగిస్తూ పాఠశాలల్లో ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాలలు, పరిశ్రమలు, ప్రపంచ ఆవిష్కరణల నెట్‌వర్క్ మధ్య బలమైన సంబంధాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.



గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ యునైటెడ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

లబ్బీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో త్వరలోనే లక్ష అడుగుల కన్వెన్షన్ సెంటర్ అధునిక టెక్నాలజీతో ప్రారంభించనున్నామని మంత్రి టి.జి.భరత్ తెలిపారు. ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మూడురోజుల పాటు జరిగే ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ యునైటెడ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంత్రి భరత్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జ్యూయలరీ వర్తకులకు అభినందనలు తెలియజేశారు. మంత్రి లోకేశ్ చొరవతో త్వరలోనే అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ మూడు రోజులు జరిగే ప్రదర్శనలో అత్యాధునిక నగల డిజైన్లను అందరూ తెలుసుకోగలుగుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అతి పెద్ద బీ2బీ జ్యూయలరీ ప్రదర్శన అన్నారు. ప్రాంతీయ జ్యూయలర్స్ ఎక్కడికో వెళ్లకుండా ఈ ప్రదర్శనలోనే నగలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుదన్నారు. నగల వ్యాపారలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ చీఫ్ స్టేట్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్, జనరల్ సెక్రటరీ శంకరరావు బొమ్మిశెట్టి, ట్రజరర్ సేఠ్ అనిల్ కుమార్, యునైటెడ్ ఎగ్జిబిషన్స్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి.కె.మనోజ్, సిఇఒ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీసు టీచర్ల పరీక్ష ఫీజు గడువు 24

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీసులో ఉన్న టీచర్లు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో నిర్వహించనున్న హెడ్‌మాస్టర్స్ అకౌంట్ టెస్ట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు రెండు పేపర్లకు ఈనెల 24లోగా రూ.150 చెల్లించాలన్నారు. ఒక్క పేపరుకు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. దరఖాస్తులను 25వ తేదీన డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎస్‌జీటీ కేడర్‌లోని ఇన్‌సర్వీసు టీచర్లకు ప్రొఫెషనల్ అడ్వాన్సుమెంట్ టెస్ట్‌కు ఈనెల 26 వతేదీలోగా రూ.200లు పరీక్ష ఫీజు చెల్లించాలని, 27లోగా డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు పంపుకోవాలన్నారు. ఆటోమెటిక్ అడ్వాన్సుమెంట్ టెస్టుకు హాజరయ్యే గ్రేడు-2 పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్ , టైలరింగ్ పరీక్షలకు హాజరయ్యే టీచర్లు, సింపుల్ ఓరియెంటేషన్ టెస్ట్‌కు హాజరయ్యే గ్రేడు-2 భాషా పండితులు 26 లోగా రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

రప్పా.. రప్పా అంటే ఒక్క సీటే : జగన్‌పై ఉమా వ్యాఖ్యలు



గొల్లపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్ధం.. సిద్ధం అని జబ్బలు చరుచుకున్న జగన్‌కు ప్రజలు 11 సీట్లే ఇచ్చారని, రప్పా.. రప్పా అంటే ఒక్క సీటుకే పరిమితం చేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. గొల్లపూడిలోని కార్యాలయంలో శుక్రవార ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.వేల కోట్లు దోచేసి.. సాక్షి, భారతి సిమెంట్స్‌లో జగన్‌రెడ్డి పెట్టుబడులు పెట్టారని దుయ్యబట్టారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములు దోచుకొని ఆర్థిక ఉగ్రవాదానికి జగన్ రెడ్డి పాల్పడ్డాడన్నారు. జగన్ ఆర్థిక నేరాలపై 11 సీబీఐ, 9 ఈడీ ఛార్జి షీట్లు దాఖలయ్యాయన్నారు. అక్రమ ఆస్తుల కేసులో జగన్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యాడని చెప్పే దమ్ము, ధైర్యం బ్లూ మీడియాకు లేదన్నారు. తనకు ఫోనే లేదని చెప్పిన జగన్ రెడ్డి యూరప్ పర్యటన సందర్భంగా న్యాయస్థానానికి ఇచ్చిన నెంబర్ ట్రాక్ కాలేదన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసినందుకు తనపై తండ్రీకొడుకులు 90 కేసులు పెడితే 19 ఏళ్లుగా వాయిదాలకు తిరుగుతున్నానని ఉమా తెలిపారు.

దుబాయ్, దోహాలకు విమానాలు నడపాలి

● సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడులకు ఎమ్మెల్యే బొండా ఉమా లేఖ



అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గన్నవరం విమానాశ్రయం నుంచి దుబాయ్, దోహాలకు విమాన సర్వీస్‌లు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడులకు శుక్రవారం లేఖ రాశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విమాన సర్వీస్‌ల పెంపుదల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణం సాగించడం వలన ఆరు గంటల సమయం వృధా అవుతోందన్నారు. ఎమిరేట్స్, ఖతార్, ఇండిగో, ఎయిర్ ఇండి యా వంటి ఎయిర్‌లైన్స్ సంస్థలతో మాట్లాడి దుబాయ్, దోహాలకు విమాన సర్వీస్‌లు ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. న్యూ ఇయర్ గిఫ్ట్‌గా గన్నవరం నుంచి దుబాయ్, దోహాలకు విమాన సర్వీసులు నడపాలని కోరారు.

'అయేషా' కేసు వచ్చే నెల 19కి వాయిదా

విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య కేసు విచారణను విజయవాడ సీబీఐ కోర్టు వచ్చే నెల 19వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ దర్యాప్తు పూర్తి చేసిన నివేదిక ప్రతిని తమకు అందజేయాలని అయేషా తల్లిదండ్రులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నిందితుడిగా పేర్కొంటున్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోర్టు వారికి నోటీసులు ఇచ్చింది. తమకు నివేదిక ప్రతి ఇవ్వకుండా ఎలా అభ్యంతరాలు చెప్పగలమని వారు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులో శుక్రవారం విచారణ సాగింది. సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపీనాథ్ వాదనలు వినిపిస్తూ దీనికి సంబంధించిన అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. నివేదికను సమర్పించడంతో తదుపరి చర్యలకు సంబంధించి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. దీనితో న్యాయాధికారి అన్నపూర్ణ తదుపరి విచారణను డిసెంబరు 19వ తేదీకి వాయిదా వేశారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమిలేయర్ విధానం రాజ్యాంగ విరుద్ధం

● సీజే గవాయ్ వ్యాఖ్యలకు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్ ఖండన

గాంధీనగర్, నవంబరు 21 ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమిలేయర్ విధానం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు న్యాయవాది, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రీమిలేయర్ అంశంపై సుప్రీ కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్ ఆలోచన రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. క్రీమిలేయర్ అంశం మనువాద దోపిడి పాలకులు లేవనెత్తిన సామాజిక కుట్ర అని ఆరోపించారు. 75 ఏళ్లుగా భారత రాజ్యాంగాన్ని మనువాద పాలకులు సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని పౌర సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ రక్షణకు పౌర సమాజం ఆందోళన చేయకపోతే దళిత, బహుజన సమాజానికి బానిసత్వం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు.



సిటీ బస్‌పోర్టు వద్ద ఆటోలు నిలిపి ఉంచడంతో ఆగిపోయిన బస్సులు



సిటీ బస్‌పోర్టులోకి వచ్చేసిన ఆటోలు

సిటీబస్ పోర్టులో ఆటోల తిష్ట

● ఆటోల అడ్డగోలు పార్కింగ్ ● స్తంభిస్తున్న ట్రాఫిక్ ● బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ● కళ్లు మూసుకున్న ఆర్టీసీ అధికారులు

బెజవాడ సిటీ బస్‌స్టేషన్‌లోకి రోజూ వందల సంఖ్యలో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. సిటీబస్సు పోర్టు లోపలికి వచ్చే మార్గంలో ఆటోలు అడ్డంగా నిలిపివేయడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్ స్తంభించి పోతుంది. కంట్రోల్ రూమ్ మొదలు సిటీబస్సు స్టేషన్లలో బస్సులు వెళ్లాల్సిన కాల్వ వంతెన మీద, బస్సుపోర్టు ముఖ ద్వారంలోను ఆటోలు అడ్డగోలుగా పెట్టడమే కాకుండా బస్సుపోర్టులోకి సైతం వచ్చేస్తుండడంతో సిటీ బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోల అడ్డగోలు పార్కింగ్ తలనొప్పిగా తయారైంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

పీఎన్‌బీఎస్ సిటీ బస్‌పోర్ట్‌లోకి ప్రైవేటు వాహనాలకు అనుమతి లేదు. సిటీ బస్‌పోర్ట్ పక్కగా ప్రైవేటు వాహనాలు వెళ్లడానికి, కొంత సమయం వేచి ఉండడానికి మార్గం ఏర్పాటు చేశారు. ఆటోడ్రైవర్లు మాత్రం ఆ దారిని వాడుకోకుండా బస్‌స్టేషన్ ప్రధాన మార్గంలో అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులను దింపడానికి, పికప్ చేసుకోవడానికి సిటీ బస్‌పోర్ట్ లోపలికే వచ్చి ప్రయాణికుల కోసం వేచి చూస్తూ అడ్డుగోలుగా పార్కింగ్ చేసున్నారు. దీంతో బస్సులకు అడ్డుపడడంతో పాటు ఆర్టీసీ ఆదాయం కూడా కోల్పోతోంది.



ప్రయాణికులకు అడ్డు తగులుతున్న ఆటో డ్రైవర్లు

నేరుగా బస్‌పోర్ట్‌లోకే ఆటోలు!

అధికశాతం ఆటోలు ఏకంగా సిటీ బస్‌పోర్ట్‌లోకి ప్రవేశిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, రైతుబజారుకు వెళ్లే పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు గుంపుగా లోపలికి వస్తుండడంతో వంతెనపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఒక్కోసారి ఆటోలను బస్సుల ముందే ఆపేస్తున్నారు. పార్కింగ్‌కు అనుమతి లేకపోయినా నచ్చిన చోట అడ్డంగా ఆపుతూ ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు ఆటో డ్రైవర్లు ఇబ్బంది కలిగిస్తున్నారు. బస్‌పోర్ట్‌లో దిగి ప్రయాణికులు బయట వచ్చేలోపు ఆటో డ్రైవర్లు వారి చుట్టూ చేరి ఇబ్బంది పెడుతున్నారు.

వంతెనపైనా అక్రమ పార్కింగ్

కూడలి నుంచి బస్‌పోర్ట్‌లోకి వెళ్లి వచ్చే కాలువ వంతెనపై ఆటోలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ పార్కింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవు. వంతెనపై పుట్‌పాత్‌ను ఆనుకుని పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పక్కనే పోలీసు కంట్రోల్ రూం ఉన్నప్పటికీ చర్యలు శూన్యం. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మూడు గేట్ల వద్ద ఇదే పరిస్థితి. హైవేపైనా అడ్డుగోలుగా నిలిపేస్తూ బయటకు వచ్చే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకే విద్యార్థి, ఒకే టీచర్!

● అవిరిపూడి ప్రాథమిక పాఠశాల(ఏఏ) దుస్థితి
● మొవ్వ మండలంలోని స్కూళ్లలో విద్యార్థుల కొరత
● పెక్కు సంఖ్యలో మూతపడనున్న పాఠశాలలు

పల్లెల్లో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా సర్కారు బడుల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. పిల్లల హాజరు తక్కువగా ఉండడానికి ఇదొక కారణమైతే, పాఠశాలల విలీనం మరొక కారణం. ఈ పరిస్థితుల్లో ఒకరిద్దరు విద్యార్థులు ఉన్న పాఠశాలలు పెరిగిపోయాయి. చాలా పాఠశాలలు మూసివేతకు దగ్గరగా ఉన్నాయి. తల్లిదండ్రులు తమ వైఖరిని మార్చుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పల్లెల్లో ప్రభుత్వం పాఠశాలలు మూతపడితే ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని గమనించాలి.

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)



ఒక విద్యార్థి మాత్రమే ఉన్న అవిరిపూడి ఎంపీ ఎలిమెంటరీ స్కూల్



మంత్రిపాలెంలో ఇద్దరు విద్యార్థులతో ఉపాధ్యాయుడు

విద్యార్థుల హాజరు లేకపోవటం వల్ల మొవ్వ మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అవిరిపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఏఏ)లో ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. మంత్రిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు ఒకటో తరగతిలో ఒక విద్యార్థి, రెండో తరగతిలో ఒక విద్యార్థి మాత్రమే ఉండటంతో వీరిద్దరికి ఒక ఉపాధ్యాయుడు పని చేస్తున్నాడు. మండలంలో మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలు 55 ఉండగా, అందులో 35 పాఠశాలల్లో సింగిల్ టీచర్లే ఉన్నారు. 25 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో సింగిల్ టీచర్లనే ప్రభుత్వం నియమించింది. విద్యార్థులు ఒకరిద్దరు ఉన్న పాఠశాల్లో ఉపాధ్యాయులకు పని లేకపోవటం, 20 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒక్కరే ఉపాధ్యాయుడు పని చేస్తుండటం, ఒకరికి పని లేకపోవటం, మరొకరికి పని భారం అధికంగా కనిపిస్తుంది. అవిరిపూడి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు 10 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నా రు. నిడుమోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు 12 మంది విద్యార్థులుండగా, ఒక్క ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో లోపం కనిపిస్తోంది.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

● సీఎంకు సీపీఐ నేత ఈశ్వరయ్య లేఖ

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దాదాపు 16 వేల మంది హోం గార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం హోంగార్డులకు రోజుకు రూ.1,124 వేతనం, యూనిఫామ్, వాషింగ్, కవాతు అలవెన్స్ టీఏ, డీఏలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని కోరారు. హోంగార్డుల కుటుంబాలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ చేసిన హోంగార్డులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ ఏర్పాటు చేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

ప్రత్యేకాధికారుల పదవీకాలం గడువు పెంపు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రాజాం, రాజమహేంద్రవరం, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు పట్టణ స్థానిక సంస్థల ప్రత్యేక అధికారుల పాలనా గడువు నవంబరు 5తో ముగియడంతో మరో ఆర్నెల్లు గడువు పెంచుతూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మే 5, 2026 వరకు కానీ, ఈ లోపు ఎన్నికలు జరిగితే అప్పటి వరకు గానీ ప్రత్యేకాధికారులు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఎస్సీ, బీటెక్ కోర్సులకు మాన్యువల్ కౌన్సెలింగ్ 24 నుంచి

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏపీఈఏపీసెట్-2025 ర్యాంకుల ఆధారంగా బీఎస్సీ (హాన్స్) అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ ప్రవేశాలకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 24, 25, 27, 28, 29, 30 తేదీల్లో జరుగుతుందని రిజిస్ట్రార్ ఎంపీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

న్యాయవ్యవస్థను బెదిరించేలా జగన్ రెడ్డి ప్రవర్తన

● కె.నాగుల్ మీరా

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత న్యాయవ్యవస్థను బెదిరించే విధంగా పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ప్రవర్తన ఉందని, అతనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఏపీ నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో నాగుల్‌మీరా శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్‌లో ఏసీబీ కోర్టు వెలుపల వ్యవహరించిన తీరును సభ్యసమాజం అసహ్యించుకుంటుందన్నారు. జగన్ కోర్టు వాయిదాకు హాజరయ్యే సమయంలో కావాలనే లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టించాడని ఆరోపించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ లు, న్యాయవాదులు జగన్ కోర్టు వెలుపల వ్యవహరించిన తీరును ఖండించాలన్నారు.

మావోయిస్టుల కదలికల నేపథ్యంతో సచివాలయం, అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, పలువురు నేతలు ఎదురు కాల్పుల్లో మరణించడం, రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో అమరావతి, సచివాలయం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సచివాలయంలోపలికి వచ్చి వెళ్లే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సరయిన ఐడీకార్డులు చూపిన తర్వాతే అనుమతిస్తున్నారు. అదేవిధంగా వాహనాల తనిఖీని కఠినతరం చేశారు. సచివాలయానికి వచ్చే వాహనాలను సచివాలయ భద్రతా సిబ్బంది నిశితంగా పరిశీలిస్తున్నారు. సచివాలయం, అసెంబ్లీ భద్రత కోసం 225 మంది ఎస్‌పీఎఫ్ సిబ్బందిని వినియోగిస్తుండగా జనరల్ షిఫ్ట్‌లో 90 మంది, మిగిలిన షిఫ్ట్‌లలో 40 మంది చొప్పున 24 గంటలు పహారా కాస్తున్నారు. సచివాలయం, అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం చేశామని, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే సచివాలయం లోపలికి అనుమతిస్తున్నామని సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మల్లికార్జునరావు తెలిపారు.



బైక్ యాత్రికుడు విజయానంద్‌కు సత్కారం

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ నుంచి కన్యాకుమారి, ధనుష్కోడి వరకు బైక్‌పై వెళ్లి వచ్చిన కాకర్ల విజయానంద్ (63)ను శుక్రవారం 21వ డివిజన్ టీడీపీ నాయకుల ఘనంగా సత్కరించారు. కాకర్ల మాట్లాడుతూ వైజాగ్ నుంచి ధనుష్కోడి వరకు 12 రోజులు బైక్‌పై వెళ్లి రావడానికి సమయం పట్టిందన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా బైక్‌పై దూరప్రయాణాలు కొనసాగిస్తున్నటు చెప్పారు. వైజాగ్ నుంచి లడక్‌కు మూడు సార్లు వెళ్లివచ్చినట్లు తెలిపారు. కాకర్లను టీడీపీ నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు కొర్రా అప్పన్న, వేములపల్లి రంగారావు, జీవన్, పోడూరి పవన్, గోరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, అన్నే రమణ, సూర్యదేవర నాగేశ్వర రావు, మిఠాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి ప్రసంగం 25న

మొగల్రాజపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాలలో భాగంగా ప్రముఖ ఆర్థికవేత్త, భారత రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఈ నెల 25న పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రత్యేక ప్రసంగానికి విచ్చేస్తున్నారని డిగ్రీ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకత్వ పాఠాలు అనే అంశం మీద దువ్వూరి ప్రసంగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ యూనివర్శిటీ) వైస్ చాన్సలర్, విజిలెన్స్ విశ్రాంత కమిషనర్ కెవి చౌదరి అధ్యక్షత వహిస్తారని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడునిమ్మగడ్డ వెంకటేశ్వరావు, కార్యదర్శి ఆట్లూరి ప్రశాంత్, కన్వీనర్ బోడేపూడి అమరేందర్, కోశాధికారి దాసరి మురళీమోహన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 21, 22 తేదీలలో కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం, క్రీడాపోటీలు, సాం స్కృతిక కార్యక్రమాలు, విశ్రాంత అధ్యాపకులకు ఆత్మీయ సత్కారాలు నిర్వహిస్తామని చెప్పారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరూ పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. వివరాల కోసం 9494133447, 9848244552 ఫోన్ నెంబర్లలో సం ప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే..

డాక్టర్లలో నిర్లిప్తత!

● అర్థం లేని నిబంధనలతో ప్రజలకు ఇబ్బందులు : హైకోర్టు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ మనవరాలు శ్యామలకు మానసిక వైకల్యం ఉందని నిర్ధారించిన ప్రభుత్వ డాక్టర్లు.. ఆమె శారీరక వైకల్యాన్ని పట్టించుకోకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రభుత్వ డాక్టర్ల వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది.

మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలకు సదరమ్ సర్టిఫికెట్ కోసం ఆమె కుటుంబ సభ్యులు దరఖాస్తు చేశారని.. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించి 95 శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లు నిర్ధారించారని గుర్తు చేసింది. మనిషిని చూసి శారీరక స్థితిని అంచనా వేయవచ్చని.. శ్యామల కనీసం నడవలేని స్థితిలో ఉన్నా డాక్టర్లు ఆ విషయాన్ని విస్మరించడం ఏమిటని ప్రశ్నించింది. ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే డాక్టర్లను నిర్లిప్తత ఆవహిస్తోందని, అర్థంలేని నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రజలకు సేవ చేయడానికి వారు ఉన్నారనే విషయం మరచిపోతున్నారని వ్యాఖ్యానించింది. శ్యామల బహుళ వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లకు తాము చెప్పాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొంది. ఆమెకు ఏమేర శారీరక వైకల్యం ఉందో అంచనా వేసి.. వారం రోజుల్లో నివేదికను కోర్టు ముందు ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఇందుకు నిపుణులైన డాక్టర్ల బృందాన్ని శ్యామల నివాసానికే పంపించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.



యోగాసనాల పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం హాజరైన సమావేశంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నిరు. అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, ఫిర్యాదులు వస్తే త్వరితగతిన విచారించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల కొత్త రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన 12 దరఖాస్తులను, 13 రెన్యువల్ దరఖాస్తులను, 19 మార్పు చేర్పుల దరఖాస్తులను కమిటీ పరిశీలించి చర్చించి ఆమోదం తెలిపింది. సరోగసీకి సంబంధించిన నాలుగు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సుఖ ప్రసవానికి యోగాసనాలు దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గర్భిణులకు ఉపయోగపడే యోగాసనాల పోస్టరును కమిటీ సభ్యులతో కలి సి ఆయన ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య ప్రతినిధి జి.రేష్మీ, డాక్టర్ పద్మజ, ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ హబ్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు సంబంధించి ఎనికేపాడులోని స్పోక్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని, హబ్ స్ఫూర్తికి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్-స్పోక్ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సందర్శించారు. ఫిఫ్త్ ఏఐ టెక్నాలజీస్ స్టార్టప్‌నకు సంబంధించి కో-వర్కింగ్ స్పేస్‌ను ప్రారంభించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఆర్‌టీఐహెచ్, ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల మధ్య ఎంవోయూ కుదిరింది. అనంతరం ఆర్‌టీఐహెచ్ బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటి వరకు సాధించిన ప్రగతితో పాటు భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే ఎనిమిది ప్రముఖ విద్యాసంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. తొమ్మిది అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్టార్టప్‌లు, ఎంట్రపెన్యూర్స్ నుంచి 264 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 100కు పైగా స్టార్టప్‌లను వివిధ అనుసంధానించామన్నారు. తొలిదశ పెట్టుబడులకు ఇబ్బందిలేకుండా వివిధ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్యాంకులతోనూ అనుసంధానమవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. హ్యాక్‌థాన్ నిర్వహణకు కూడా స్పోక్ ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఈవో జి.కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్ డి.రవితేజ, ఫైనాన్స్ హెడ్ హిమబిందు, స్పోక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ శంకరయ్య డిస్మిస్

పోలీసు సర్వీసు నుంచి తొలగింపు

- వివేకా హత్య సాక్ష్యాలు చెరిపేసినా సీఐ వారించలేదని అప్పట్లో చంద్రబాబు ఆరోపణ
- క్షమాపణ చెప్పాలని సీఎంకే సీఐ నోటీసు



కర్నూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందారెడ్డి హత్య జరిగిన రోజు సాక్ష్యాలు చెరిపేసినా వారించలేదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, కేసు దర్యాప్తు కూడా సక్రమంగా చేయలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పులివెందుల సీఐ శంకరయ్యపై పోలీసు శాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శంకరయ్య ఈ ఏడాది సెప్టెంబరులో సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపించి కలకలం రేపిన సంగతి తెలిసిందే. 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలో వివేకానందారెడ్డి తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో శంకరయ్య పులివెందుల సీఐగా ఉన్నారు. హత్యాస్థలిలో రక్తపు మరకలు శుభ్రం చేస్తున్నా.. సాక్ష్యాధారాలు చెరిపివేస్తున్నా అక్కడే ఉన్న శంకరయ్య అడ్డుకోలేదనే ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని చంద్రబాబు పలుమార్లు బహిరంగ వేదికలపై ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీ సమావేశాల్లోనూ, కలెక్టర్లు, ఎస్పీల సదస్సుల్లోనూ శాంతి భద్రతలపై సమీక్షించే సమయంలో ఈ కేసును ప్రస్తావిస్తూ వచ్చారు. ఈ వ్యాఖ్యలు తన ప్రతిష్ఠకు భంగం కలిగించాయంటూ శంకరయ్య సెప్టెంబరు 18న సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపడం.. 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పకపోయినా.. లేదంటే వివరణ ఇవ్వకపోయినా.. రూ.1.45 కోట్లకు కోర్టులో పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించడం తెలిసిందే. ఓ సీఐ స్థాయి అధికారి ఏకంగా సీఎంకు లీగల్ నోటీసులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

కమిటీ విచారణకు రాకుండా..

వివేకా హత్య జరిగిన రోజు సీఐ శంకరయ్య విధులు సక్రమంగా నిర్వర్తించలేదని, కేసు దర్యాప్తు కూడా సక్రమంగా చేయలేదని అప్పట్లో ఆయనపై ఆరోపణలు వచ్చాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ శంకరయ్యను అప్పట్లో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2020 జూలైలో ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. వివేకా హత్యపై కేసు నమోదు చేయకుండదంటూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన అనుచరుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనను బెదిరించారని శంకరయ్య నాడు సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపకుండా, మృతదేహంపై గాయాలున్నాయని కూడా ఎవరికీ చెప్పకూడదంటూ తనను భయపెట్టారనీ ఆయన అందులో తెలిపారు. తీరా మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం నమోదు చేయడానికి రాకుండా తనకు వేరే పనులున్నాయంటూ ఆయన తప్పించుకున్నారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే (2021 అక్టోబరు 6న) ఆయనపై సస్పెన్షన్‌ను నాటి జగన్ ప్రభుత్వం ఎత్తివేసింది. నిందితులు ప్రభావితం చేయడం వల్లే శంకరయ్య మాట మార్చారని సీబీఐ అప్పట్లోనే న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఆయనపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు కూటమి ప్రభుత్వం తాజాగా విచారణ కమిటీని నియమించింది. అయితే ప్రస్తుతం వేకెంట్ రిజర్వ్ (వీఆర్)లో ఉన్న శంకరయ్య.. దాని ముందు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన్ను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులిచ్చారు.

ప్రత్యేక అర్హత పరీక్ష జాబితా విడుదల

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖలో బోధనేతర సిబ్బంది నుంచి బోధన సిబ్బందిగా పదోన్నతి పొందిన లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక అర్హత పరీక్షలో అర్హత సాధించిన వారి జాబితా విడుదల చేసినట్టు ఏపీపీఎస్సీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో చూడొచ్చని పేర్కొంది.

శ్రీవారి సేవలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మహాద్వారం వద్ద ఇస్తికఫాల్ స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న రాష్ట్రపతి

తిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుని గురువారం సాయంత్రం తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ముర్ము రాత్రి తిరుమలలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరకున్న రాష్ట్రపతికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ముర్ము, ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో రాష్ట్రపతికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ చైర్మన్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పోటు సిబ్బంది ఇచ్చిన అన్నప్రసాదాలు స్వీకరించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఈవో రాష్ట్రపతికి శ్రీవారి చిత్రపటం, 2026 డైరీ, క్యాలెండర్లు అందజేశారు.

భక్తులను పలకరించిన రాష్ట్రపతి

శ్రీవారి దర్శనం అనంతరం రాష్ట్రపతి ముర్ము.. రాంభగీచ సర్కిల్ వద్ద భక్తులను చూసి వాహనాన్ని ఆపారు. భక్తుల వద్దకు నేరుగా వెళ్లి అభివాదం చేస్తూ పలకరించారు. అతిథిగృహానికి చేరుకుని కొంత సమయం విశ్రాంతి తీసుకుని తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

ఐఏఎస్ అధికారుల ఆదర్శ వివాహం

- గుడిలో దండలు మార్చుకుని ఒక్కటయ్యారు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్



శ్రీపూజ, ఆదిత్యవర్మ

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దిగువ మధ్య తరగతి ప్రజలు కూడా అట్టహాసంగా వివాహం చేసుకుంటున్న ఈ కాలంలో ఇద్దరు యువ ఐఏఎస్ అధికారులు నిరాడంబరంగా గుడిలో దండలు మార్చుకొని పెళ్లి చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంతకాలు చేసి చట్టబద్ధంగా దంపతులయ్యారు. ఈ వివాహానికి ఇరువురు కుటుంబ సభ్యులు హాజరై ఆశీర్వదించారు. ఇంతకీ ఆ ఐఏఎస్ అధికారులు ఎవరంటే....అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ టి.శ్రీ పూజ వధువు. వరుడు మేఘాలయలోని దాదెంగ్రి జాయింట్ కలెక్టర్ ఆదిత్యవర్మ. వేర్వేరు రాష్ట్రాలకు, వేర్వేరు బ్యాచ్‌లకు చెందిన వీరిది పెద్దలు కుదిర్చిన వివాహమేనని శ్రీ పూజ తండ్రి వెంకటేశ్వర్లు తెలిపారు. విశాఖపట్నంలోని కైలాసగిరి వద్దనున్న శివాలయంలో శుక్రవారం ఉదయం దండలు మార్చుకొని పెళ్లి చేసుకున్న శ్రీ పూజ, ఆదిత్య వర్మ.. వన్‌టౌన్‌లోని సూపర్ బజారు కార్యాలయం ఆవరణలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాగా విశాఖపట్నం డీఐజీ బాలకృష్ణ దగ్గరుండి వీరి వివాహాన్ని నమోదు చేయించారు.

అంగన్వాడీల బలోపేతానికి కృషి చేయాలి

- తక్కువ బరువున్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి: రాయపాటి శైలజ

తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని 3, 7 అంగన్వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న తక్కువ బరువున్న పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని సీడీపీవోను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది, తల్లులతో ఆమె మాట్లాడారు.

మూడేళ్లు.. మూడు వేల 'పార్టీలు'

'డ్రగ్స్' సరఫరా కేసులో మరో కోణం.. విశాఖ పార్టీల్లో ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ వినియోగం

- బెంగళూరు నుంచే సరఫరా
- కీలక సూత్రధారి వైసీపీ విద్యార్థి విభాగ నేత కొండారెడ్డి
- లోహిత్ యాదవ్ విచారణలో వెలుగులోకి విషయాలు
- లోహిత్, కొండారెడ్డి మధ్య 1,500కు పైగా ఫోన్‌కాల్స్

విజయవాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూడేళ్లు.. ఏకంగా మూడు వేల పార్టీలు. పుట్టినరోజు, ఎంగేజ్‌మెంట్, ప్రీవెడ్డింగ్.. ఇలా ప్రతి ఈవెంట్‌లోను డ్రగ్స్ మత్తు కిక్కెక్కించింది. బెంగళూరు నుంచి వచ్చిన ఆ 'డ్రగ్స్' యువతను తప్పుదారి పట్టించింది. విశాఖపట్నం కేంద్రంగా సాగిన ఈ మత్తు వ్యవహారాలు విజయవాడలో బయటపడుతున్నాయి. మూడేళ్ల కాలంలో దాదాపు 3 వేల పార్టీల్లో మత్తు పదార్థాలను వినియోగించారు. విశాఖపట్నానికి చెందిన మత్తు ప్రేమికులు అర్జాల శ్రీవాత్సవ్, హవీల డిలైట్ గత ఆగస్టులో ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ మాదకద్రవ్యాలను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తీసుకెళ్తూ విజయవాడలోని మహానాడు కూడలి వద్ద ఈగల్, టాస్క్‌ఫోర్స్ బృందాలకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో తీగ లాగితే బెంగళూరులో డొంక కదిలింది. ఈ లింకులన్నీ వైజాగ్ వరకు వ్యాపించి ఉన్నాయి. సుదీర్ఘంగా సాగుతున్న దర్యాప్తులో వైజాగ్ పోలీసులకు చిక్కి రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ విద్యార్థి విభాగ నేత కొండారెడ్డి లీలలు బయటకు వచ్చాయి. వైజాగ్ మత్తు ప్రేమికుల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న జోగా లోహిత్ యాదవ్ పోలీసులకు కీలక విషయాలు వెల్లడించినట్టు తెలిసింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న అతన్ని విచారించడానికి కోర్టు కొద్దిరోజుల క్రితం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసు లు లోహిత్ యాదవ్‌ను విచారించిస్తున్నారు.

కొందరితో మొదలై..

ఒక పార్టీలో కొందరు, ఇంకో పార్టీలో ఇంకొందరు, మరో పార్టీలో మరికొందరు ఇలా మత్తు గ్యాంగ్ పెరుగుతూ పోయింది. కొండారెడ్డికి విజయవాడ జిల్లా జైల్లో ఉన్న జోగా లోహిత్ యాదవ్‌కు మధ్య ఈ విధంగానే పరిచయం ఏర్పడింది. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థి అర్జాల శ్రీవాత్సవ్, వైజాగ్‌కు చెందిన హర్షవర్ధన్ నాయుడు స్నేహితులు. ఇంజనీరింగ్‌లో శ్రీవాత్సవ్‌కు హర్షవర్ధన్ నాయుడు సీనియర్. ఇద్దరూ కలిసి పలు పుట్టినరోజు పార్టీలకు వెళ్లారు. హర్షవర్ధన్ ద్వారా శ్రీవాత్సవ్‌కు లోహిత్ యాదవ్ పరిచయమయ్యాడు. విశాఖపట్నంలో కొండలపైన, అపార్టుమెంట్లలో జరిగిన పార్టీలకు కొండారెడ్డి డ్రగ్స సరఫరా చేసేవాడు. అలా లోహిత్‌కు, కొండారెడ్డికి మధ్య మత్తు బంధం ఏర్పడి మరింత బలపడింది. కొండారెడ్డి తెర వెనుక ఉండి లోహిత్ యాదవ్‌కు టాస్క్ అప్పగించేవాడు. ఏ పార్టీ జరిగినా 'కిక్' కచ్చితంగా ఉండేది. మత్తు పదార్థాలను ఇంజనీరింగ్ విద్యార్థుల ద్వారా లోహిత్ యాదవ్ బెంగళూరు నుంచి తెప్పించేవాడు. బెంగళూరులో ఈ డ్రగ్స్‌ను మల్లెల మధుసూదన్‌రెడ్డి సమకూర్చేవాడు. కొద్దిరోజుల క్రితమే విజయవాడలోని మాచవరం పోలీసులు మధుసూదన్‌రెడ్డిని జైలుకు పంపారు. కాగా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు లోహిత్ యాదవ్ ఫోన్‌ను పరిశీలించినట్టు తెలిసింది. దీనిలో కొండారెడ్డికి, లోహిత్‌కు మధ్య 1,500కు పైగా కాల్స్ ఉన్నట్టు గుర్తించారు. మామూలు కాల్స్‌తో పాటు వాట్సాప్ కాల్స్ మాట్లాడుకున్నట్టు తెలుసుకున్నారు.

అవయవదానంతో పునర్జన్మ

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం
- గ్రీన్‌చానల్ ద్వారా అవయవాల తరలింపు



ఆదినారాయణ

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని తిరుమల మెడికవర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసేందుకు అతని కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. దీంతో వైద్యులు శుక్రవారం గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసి అంబులెన్స్‌ల ద్వారా అవయవాలను తరలించారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కేఎల్ పురం ఎస్సీ, ఎస్టీ కాలనీకి చెందిన సిగడం ఆదినారాయణ (56) ఈ నెల 20న తీవ్రమైన హెమరేజ్ స్ట్రోక్ గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అవయవదానంపై ఆదినారాయణ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వారు అంగీకారం తెలిపారు. దీంతో వైద్యులు శుక్రవారం ఉదయం గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఆదినారాయణ కిడ్నీలు, కార్నియాలను అంబులెన్స్‌ల ద్వారా విశాఖకు తరలించారు. ఆదినారాయణ కుటుంబ సభ్యులను అభినందిస్తూ ఆసుపత్రి ఎండీ డాక్టర్ తిరుమల ప్రసాద్, వైద్యులు ధ్రువపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికార లాంఛనాలతో శనివారం ఆదినారాయణ అంత్యక్రియలు జరగనున్నాయి.

సోషల్ మీడియాలో ఇళయరాజా ఫొటో వాడొద్దు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం



చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత స్వరకర్త 'ఇసైజ్ఞాని' ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి నెట్‌వర్కింగ్ సైట్లలో ఉపయోగించడంపై మద్రాస్ హైకోర్టు తాత్కాలిక నిషేధం విధించి ంది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తన అనుమతి లేకుండా తన ఫొటోను ఉపయోగించడాన్ని నిషేధిం చాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాల జీ సాయంతో తన ఫొటోను మార్ఫింగ్ చేసి వాణిజ్యపరంగా వినియోగిస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నా రని, ఇది తన వ్యక్తిగత హక్కులను హరించే చర్య అని పేర్కొన్న ఇళయయరాజా..ఇకపై తన అనుమతి లేకుండా ఎవ్వరూ ఉపయోగించకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిం చారు. ఆయన అభ్యర్థనను పరిగణన లోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఇళయరాజా ఫొటోలను ఆయన అను మతి లేకుండా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో తాత్కాలికంగా ఉపయోగిం చరాదని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థుల నోట.. 'అధ్యక్షా..!'

26న అసెంబ్లీ ఆవరణలో 'స్టూడెంట్ అసెంబ్లీ'

- రాజ్యాంగ దినోత్సవం నాడు కార్యక్రమం
- అచ్చం అసెంబ్లీ తరహాలోనే కార్యకలాపాలు
- వినూత్నంగా, వైవిధ్యంగా నిర్వహణకు ఏర్పాట్లు
- 175 నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా విద్యార్థులు
- వీక్షించనున్న సీఎం చంద్రబాబు, మంత్రులు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులు అసెంబ్లీకి వెళ్లి 'అధ్యక్షా..!' అనేందుకు సిద్ధమయ్యారు! బడుల్లో పాఠాలు చదువుకొనేవారు.. తమ నియోజకవర్గాల్లోని సమస్యలపై గళమెత్తనున్నారు!! రాష్ట్రాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలూ చేయనున్నారు. ఇందుకు భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో నిర్వహించనున్న 'స్టూడెంట్ అసెంబ్లీ' వేదిక కానుంది. కూటమి ప్రభుత్వం వినూత్నంగా, వైవిధ్యంగా ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ హాలులోనే స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే ఆ హాలులో ఇతరులు కూర్చొనేందుకు నిబంధనలు అంగీకరించకపోవడంతో.. అసెంబ్లీ ఆవరణలో ఈ మాక్ అసెంబ్లీ సెట్ వేస్తున్నారు. ఎమ్మెల్యేలతో జరిగే అసెంబ్లీకి ఏమాత్రం తీసిపోకుండా అచ్చం అలాగే ఈ కార్యక్రమం జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

అసెంబ్లీలో జరిగినట్లుగానే..

ఈనెల 26న ఉదయం 9 గంటల సమయంలో స్టూడెంట్ అసెంబ్లీ ప్రారంభమవుతుంది. తొలుత అందులో పాల్గొన్న విద్యార్థుల్లో ఒకరు ప్రొటెం స్పీకర్‌గా సభను ప్రారంభిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థి ఎమ్మెల్యేగా ఉంటారు. వారిలోనే అధికార, ప్రతిపక్ష సభ్యులు ఉంటారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతగా కూడా విద్యార్థుల నుంచే వ్యవహరిస్తారు. అలాగే సెక్రటరీ జనరల్, మార్షల్స్‌గా కూడా విద్యార్థులే ఉంటారు. సాధారణ అసెంబ్లీలో జరిగినట్లుగానే తొలుత ప్రశ్నోత్తరాలు జరుగుతాయి. అనంతరం జీరో అవర్, ఆ తర్వాత రెండు బిల్లులపై చర్చ జరుగుతుంది. ఇవి కాకుండా ఏవైనా అంశాలపై చర్చిస్తారు. సుమారు 3 గంటల పాటు జరిగే విద్యార్థుల అసెంబ్లీని సీఎం చంద్రబాబు, మంత్రులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ అసెంబ్లీ కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సమానంగా అమ్మాయిలు, అబ్బాయిలు

స్టూడెంట్ అసెంబ్లీ కోసం పాఠశాల విద్యాశాఖ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 8, 9, 10 తరగతులకు చెందిన 175 మంది విద్యార్థులను ఎంపిక చేసింది. ఇందుకోసం పాఠశాల స్థాయి నుంచి వివిధ దశల్లో పోటీలు నిర్వహించారు. అసెంబ్లీలో సగం మంది అమ్మాయిలు, సగం మంది అబ్బాయిలు ఉంటారు. కాగా ఇప్పటి వరకూ ఝార్ఖండ్, రాజస్థాన్, హరియాణా, తెలంగాణ రాష్ట్రాల్లో స్టూడెంట్ అసెంబ్లీ జరిగింది. అయితే మన రాష్ట్రంలో మాత్రం పక్కాగా అసెంబ్లీ కార్యకలాపాలను తలపించేలా ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. తద్వారా విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవడతాయనేది ప్రభుత్వం ఉద్దేశం. స్టూడెంట్ అసెంబ్లీ అనంతరం విద్యార్థులు అసలు అసెంబ్లీ హాలును సందర్శిస్తారు. సీఎంతో కలిసి గ్రూప్ ఫొటో దిగుతారు.

కాంక్రీట్ ట్రాలీపడి ఉపాధ్యాయురాలు మృతి

- పాఠశాలలో స్టేజీ నిర్మాణ సమయంలో ఘటన



జ్యోత్స్నభాయ్

పాయకరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో స్టేజీ నిర్మాణ పనులు జరు గుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాంక్రీట్ ట్రాలీ జారి మీదపడడంతో ఓ ఉపాధ్యాయురాలు మృతి చెందా రు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీ శివారు రాజానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టేజీ నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం స్లాబు వేస్తున్నారు. ఆ సమయంలో రిజిస్టర్‌లో సంతకం చేయడానికి స్టాఫ్ రూమ్‌కు వెళుతున్న నెల్లి జోత్స్న బాయ్ (47) అనే ఉపాధ్యాయురాలిపై స్లాబ్ పైనుంచి కాంక్రీట్ ట్రాలీ పడింది. తీవ్ర గాయాలైన ఆమెను సహ ఉపాధ్యాయులు హుటాహుటిన అంబులెన్సులో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. స్లాబు సెంట్రింగ్ కర్ర ఒక్కటి కిందకు దిగబడడంతో కాంక్రీట్ ట్రాలీ జారిపడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. జ్యోత్స్నభాయ్ ఇంగ్లీష ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. అంకితభావం కలిగిన టీచర్‌గా ఆమెకు పేరుంది. రెండు సంవత్సరాలు క్రితం ఆమె భర్త గుండెపోటుతో మరణించారు. ఒక కుమారుడు ఇంటర్, మరో కుమారుడు మూడో తరగతి చదువుతున్నారని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సంఘటన పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్టేజీ నిర్మాణ కాంట్రాక్టర్, సూపర్‌వైజర్, ట్రాలీ పట్టుకున్న కూలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు.

టీచర్ కుటుంబానికి అండగా ప్రభుత్వం: మంత్రి లోకేశ్

ఉపాధ్యాయురాలు జ్యోత్స్నబాయ్ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన చేస్తూ ఉపాధ్యాయురాలి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలి పారు. ప్రమాదంపై దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. పాఠశాలల ఆవరణలో ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించామని లోకేశ్ పేర్కొన్నారు.

తాకట్టు బంగారంలో చిలక్కొట్టుడు!

- చోడవరం కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఘరానా మోసం

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారపు వస్తువుల్లో బాంకు సిబ్బంది చిలక్కొట్టుడు కొట్టిన విషయం అనకాపల్లి జిల్లా చోడవరంలోని 'ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు'లో బయటపడింది. పట్టణానికి చెందిన వెలుగుల దొరబాబు తన భార్యకు చెందిన 60 గ్రాముల బరువు గల రెండు బంగారు నెక్లెస్‌లను కనకమహాలక్ష్మి బ్యాంకులో తాకట్టు పెట్టారు. రెండు రోజుల క్రితం బ్యాంకు నుంచి విడిపించుకున్నారు. ఆ వస్తువుల్లో చిన్నచిన్న ముక్కలు తొలగించి ఉండడాన్ని గమనించి.. స్థానిక నాయకుడు జయదేవ్ సహకారంతో బ్యాంకు అధికారులను గట్టిగా నిలదీశారు. తప్పిదాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు, రెండు వస్తువుల్లో తగ్గిన రెండు గ్రాముల బంగారాన్ని ఆయనకు గురువారం తిరిగి ఇచ్చారు. అలాగే, ఓ మాజీ ప్రజా ప్రతినిధి సోదరుడు తాకట్టు పెట్టిన వస్తువులో కూడా కొంతమేర తగ్గడంతో, అధికారులను నిలదీయగా తిరిగి ఇచ్చేందుకు బ్యాంకు సిబ్బంది అంగీకరించారు. ప్రస్తుతానికి ఇలా ఎనిమిది మంది ఖాతాదారులు మోసపోయినట్టు తేలింది. ఈ బ్యాంకులో బంగారం తనిఖీ చేసే అప్రైజర్ వెంకటేశ్, గతంలో పనిచేసిన బ్యాంకు అధికారి, కొందరు సిబ్బందితో కలిసి ఈ మోసానికి పాల్పడినట్టు చెబుతున్నారు. అయితే అప్రైజర్‌పై పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకుండా, అతడిని ఇక్కడి నుంచి బదిలీ చేసి చేతులు దులుపుకోవడం గమనార్హం. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

ట్రావెల్స్ బస్సులో 500 కిలోల గోమాంసం!

సింగరాయకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న గోమాంసాన్ని ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. 11 బాక్సుల్లో ఉన్న సుమారు 500 కేజీల మాంసాన్ని సీజ్ చేసి, బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువైద్యుడు హజరత్ పరిశీలించి ప్రాథమికంగా అది గోమాంసం అని నిర్ధారించారు. పూర్తి స్థాయి నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు సింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 22 నవంబరు 2025



వంటిల్లు

చాలామంది అవకాడోలను చాలా ఇష్టంగా ఆహారంలో చేర్చుకుంటూ ఉంటారు. అవకాడో పచ్చడి గురించి అందరికీ తెలిసిందే. బాగా పండిన అవకాడోలతో సలాడ్స్, స్మూతీలు, మిల్క్ షేక్‌లు, కేక్‌లు ఇలా ఎన్నో రకాలు తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు. పోషకాల గనిగా పరిగణించే అవకాడోతో తయారుచేసే విభిన్న వంటకాలు మీకోసం.

అవకాడోతో ఆరోగ్యంగా

అవకాడో పుడ్డింగ్

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- రెండు, పాలు- రెండు కప్పులు, మిల్క్ మెయిడ్(కండెన్స్‌డ్ మిల్క్)- అర కప్పు, పిస్తా పప్పులు- కొన్ని, జీడి పప్పు పలుకులు- పది, పంచదార- పావు కప్పు, చైనా గ్రాస్ లేదా అగార్ అగార్ పౌడర్- ఒకటిన్నర చెంచా, వెనీలా ఎసెన్స్- అర చెంచా

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. చిన్న గిన్నెలో జీడిపప్పు పలుకులు వేసి అవి మునిగేలా నీళ్లు పోసి



గంటసేపు నానబెట్టాలి. మందపాటి గిన్నెలో పాలు, పంచదార, మిల్క్ మెయిడ్, అగార్ అగార్ పౌడర్, వెనీలా ఎసెన్స్ వేసి బాగా కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద వేడిచేయాలి. పాలను చెంచాతో కలుపుతూ ఉండాలి. పాలు బాగా మరిగిన తరువాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- బ్లెండర్‌లో అవకాడో ముక్కలు, నానబెట్టిన జీడిపప్పు, అర కప్పు మరిగించిన పాల మిశ్రమం వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ పేస్టుని మిగిలిన పాలలో వేసి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ఒక మౌల్డ్‌లోకి మార్చి ఫ్రిజ్‌లో గంటసేపు ఉంచాలి. మిశ్రమం గట్టిపడి కేక్‌లా మారుతుంది. దాన్ని ఒక ప్లేట్‌లోకి తీసుకుని పైన పిస్తా పలుకులు చల్లితే అవకాడో పుడ్డింగ్ రెడీ..!



అవకాడో టిక్కీ

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- రెండు, పచ్చి మిర్చి పేస్టు- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఉప్పు- తగినంత, బియ్యప్పిండి- ఆరు చెంచాలు, పసుపు- చిటికెడు, నూనె- ఆరు చెంచాలు

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకొని చెంచాతో మెత్తగా మెదపాలి. తరువాత అందులో పచ్చి మిర్చి పేస్టు, జీలకర్ర పొడి, ఉప్పు, బియ్యప్పిండి, పసుపు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. చేతికి కొద్దిగా నూనె రాసుకుని అవకాడో-బియ్యప్పిండి మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ వేళ్ల మీద చిన్న టిక్కీల మాదిరి చేసి మెల్లగా పాన్‌లో వేయాలి. రెండువైపులా ఎర్రగా వేగనివ్వాలి. తరువాత పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారుచేసుకున్న అవకాడో టిక్కీలను వేడి వేడిగా టమాటా సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.

అవకాడో చాట్

కావాల్సిన పదార్థాలు

- అవకాడోలు- రెండు, నిమ్మకాయలు- రెండు, ఉప్పు- తగినంత, నానబెట్టి ఉడికించిన శనగలు- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- మూడు, ఉడికించి తొక్క తీసిన ఆలుగడ్డలు- రెండు, కారం- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, చాట్ మసాలా- ఒక చెంచా, స్వీట్ చట్నీ- ఒక చెంచా, గ్రీన్ చట్నీ- ఒక చెంచా, క్రాకర్స్- అయిదు, సన్నని కారప్పూస- కొద్దిగా, బూందీ- రెండు చెంచాలు, దానిమ్మ గింజలు- కొన్ని, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- కొన్ని, మరమరాలు- కొన్ని

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. అందులో చిటికెడు ఉప్పు, నిమ్మరసం వేసి చెంచాతో బాగా మెదపాలి. తరువాత అందులో మెత్తగా మెదిపిన ఆలుగడ్డల మిశ్రమం, శనగలు, పచ్చి మిర్చి ముక్కలు, కారం, చాట్ మసాలా,



ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. దానిపైన చిదిమిన క్రాకర్స్, గ్రీన్ చట్నీ, స్వీట్ చట్నీ వేయాలి. ఆపైన టమాటా ముక్కలు, కారప్పూస, బూందీ, మరమరాలు, దానిమ్మ గింజలు, ఉల్లిపాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి చివరగా నిమ్మరసం పిండితే రుచికరమైన అవకాడో చాట్ రెడీ..!

గ్వాకమూలే

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- మూడు, నిమ్మకాయలు- రెండు, ఉల్లిపాయలు- రెండు, టమాటాలు- రెండు, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, ఉప్పు- అర చెంచా, మిరియాల పొడి- ముప్పావు చెంచా



తయారీ విధానం

- ఉల్లిపాయలు, టమాటాలను చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కొత్తిమీరను నీళ్లతో శుభ్రంగా కడిగి ఆపైన సన్నగా తరగాలి. అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని చెంచాతో గిన్నెలోకి తీయాలి. గంటె సహాయంతో దాన్ని మెత్తగా మెదపాలి.
- వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో అవకాడో గుజ్జు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరియాల పొడి వేసి చెంచాతో మెల్లగా కలపాలి. ఈ గిన్నెమీద మూతపెట్టి అరగంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. తరువాత ఈ గ్వాకమూలేను చిప్స్, క్రాకర్స్‌తో సర్వ్ చేసుకోవాలి.

నవ విశ్వసుందరి

అందం... ఆత్మవిశ్వాసానికి అందలం



'మిస్ యూనివర్స్-2025' కిరీటాన్ని గెలుచుకోకముందే 25 ఏళ్ల ఫాతిమా బాష్ పేరు చాలామందికి పరిచయమైపోయింది. వాస్తవానికి... ఈ పోటీలో పాల్గొన్న దాదాపు 120 దేశాల సుందరీమణుల్లో ఒకరుగా మాత్రమే అప్పటివరకూ కొందరికైనా ఆమె పేరు తెలుసు. పోటీలకు కొద్దిరోజుల ముందు... మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మిస్ యూనివర్స్ థాయిలాండ్ నేషనల్ డైరెక్టర్ నవాత్ ఆమె మీద విరుచుకుపడ్డారు. 'తెలివితక్కువ మనిషి'గా ఆమెను అభివర్ణించారు. ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్న థాయిలాండ్‌ను సోషల్ మీడియాలో ఆమె ప్రమోట్ చేయకపోవడం దీనికి ప్రధాన కారణం కాగా... ఒక ఫొటోషూట్‌కు ఆమె హాజరు కాకపోవడం సాకుగా చూపి... ఫాతిమాను ఆయన నిందించారు. దీనికి ఫాతిమా దీటుగా సమాధానం ఇచ్చారు. నవాత్‌కు, ఆమెకు మధ్య తలెత్తిన ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నవాత్ తీరుకు నిరసనగా ఫాతిమా, ఈ పోటీల్లో పాల్గొంటున్న మరికొందరు యువతులు సంబంధిత ఈవెంట్‌ను బహిష్కరించారు. చివరకు నవాత్, మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఆమెకు క్షమాపణ చెప్పాయి. పోటీలో పాల్గొంటూ... దాని నిర్వాహక సంస్థను నిలదీసి, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్న ఫాతిమా సర్వత్రా ప్రశంసలు అందుకున్నారు. "ఆ పోటీలో పాల్గొనకుండా, కిరీటం సాధించకుండా నన్నెవరూ ఆపలేరు" అని ఆత్మవిశ్వాసంతో చెప్పిన ఆమె... అనుకున్నది సాధించారు. 74వ మిస్ యూనివర్స్ గా నిలిచారు. మన దేశం నుంచి రాజస్థాన్‌కు చెందిన మణికా విశ్వకర్మ టాప్-30లో స్థానం సంపాదించినా... టాప్-12కు చేరుకోలేక పోయారు.

అవహేళలను ఎదిరించి...

2000 మే 19న మెక్సికోలోని టాబాస్కో రాష్ట్రం టిపియాలో జన్మించిన ఫాతిమా బాల్యం మొత్తం పోరాటంగానే సాగింది. ఆరేళ్ల వయసులో ఆమెకు హైపర్ యాక్టివిటీ, డిస్లెక్సియా లాంటి సమస్యలు ఉండేవి. సరిగ్గా మాట్లాడలేకపోవడంతో... తోటి పిల్లలు ఆమెను అవహేళన చేసేవారు. కానీ ఫాతిమాకు పట్టుదల ఎక్కువ. ఏ సమస్యా తన పురోగతిని నిరోధించకూడదనుకున్నారు. మానసిక దారుఢ్యాన్ని పెంచుకున్నారు. చదువుల్లో, ఆటపాటల్లో ముందుండేవారు. విద్యార్థుల మార్పిడి కార్యక్రమం కింద... అమెరికాలోని లైన్డన్ ఇనిస్టిట్యూట్‌లో హైస్కూల్ విద్య అభ్యసించారు. అక్కడే ఆమె ఆంగ్లం బాగా నేర్చుకున్నారు. ఆ తరువాత ఫాతిమా దృష్టి సృజనాత్మకతవైపు మళ్లింది. మెక్సికోలోనే ఫ్యాషన్ అండ్ అపెరల్ డిజైన్‌లో డిగ్రీ చేశారు. ఆ తరువాత ఇటలీలోని మిలన్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఎన్ఏబీఏలో మాస్టర్స్ పూర్తి చేశారు. అందాల పోటీల్లో ఆమె విజయాలు... 2018లో 'ఫ్లోర్ టబాస్కో' టైటిల్ గెలుచుకోవడంతో మొదలయ్యాయి. దాన్ని సాధించడం తన చిన్ననాటి కల అని ఒక సందర్భంలో ఆమె చెప్పారు. ఆ తరువాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా... చదువుకే ప్రాధాన్యం ఇచ్చారు. మళ్లీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 'మిస్ యూనివర్స్-మెక్సికో'గా నిలిచారు. ఇప్పుడు 'మిస్ యూనివర్స్'గా గెలిచారు. టొబాస్కోకు చెందిన ఒక మహిళ ఈ ఘనతను సాధించడం అదే మొదటిసారి.



సామాజిక సేవలో...

ఇష్టంగా నేర్చుకున్న ఫ్యాషన్ డిజైనింగ్‌నే ఫాతిమా వృత్తిగా చేసుకున్నారు. తను రూపొందించినవన్నీ పర్యావరణానికి అనుకూలంగా ఉండాలని ఆమె ఆశిస్తారు. సామాజిక సేవ పట్ల కూడా మక్కువ ఎక్కువే. తమ ప్రాంతంలోని ఒక ఆసుపత్రిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న పిల్లలకు సాయపడడం కోసం పదేళ్లుగా ఆమె పాటుపడుతున్నారు. టోబాస్కోలోని అంకాలజీ ఆసుపత్రిలో ... వార్షిక సెలవుల్లో పిల్లలకోసం కార్యక్రమాలను కూడా ఆమె నిర్వహిస్తూ ఉంటారు. ఫాతిమాకు జంతువులంటే ఇష్టం. గుర్రపుస్వారీ, పుస్తక పఠనం, చిత్రలేఖనం, టెన్నిస్... ఇలా అనేక అభిరుచులు ఉన్నాయి. ఆమె ప్రేమగా పెంచుకున్న కుక్కపిల్ల ఈ పోటీలకు కొద్దిరోజుల ముందే మరణించింది. దానికి నివాళిగా... పోటీ సమయంలో తన దుస్తులకు ఒక చిన్న పిన్నును ఫాతిమా ధరించారు. "ఆడపిల్లలు తమ కలలను సాకారం చేసుకోవడమే ధ్యేయంగా పాటుపడాలి. తమ సామర్థ్యం, విలువ పట్ల ఎప్పుడూ నమ్మకంతో ఉండాలి" అంటారామె. పోటీల్లో న్యాయవిజేతలు అడిగిన ప్రశ్నకు సమాధానంగా... మహిళల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తానని చెప్పిన ఈ నవ విశ్వ సుందరి... ఇప్పటికే ఆ దారిలో పయనిస్తున్నారు.

భోజన కుతూహలం

మునగ మొక్క అంటే చాలా మందికి గుర్తుకు వచ్చేది మునగ కాయలు, ఆ తర్వాత ఆకులు. అయితే మునగ చెట్టు పూలలో కూడా అపారమైన ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిని మనం ఎక్కువగా పట్టించుకోలేదనే చెప్పాలి. వాస్తవానికి మునక్కాడలూ, ఆకుల కన్నా కన్నా మునగ పూలకే ఔషధ విలువలెక్కువ. 'భోజన కుతూహలం' గ్రంథంలో మునగ పూల గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. అవి ఏమిటో తెలుసుకుందాం.

కంటి చూపుని పెంచే మునగ పూలు

- మునగపూలు ఆలస్యంగా అరుగుతాయి. దీనివల్ల త్వరగా ఆకలి వేయదు. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి.
- మునగ పూలు జీర్ణశక్తిని పెంచుతాయి. మలబద్ధకం ఉన్నవారికి మునగపూలు మంచి మందు.
- మునగ పూలు కొద్దిగా వగరు రుచిని కలిగి ఉంటాయి. టమోటాలాంటి వాటితో కలిపి పప్పు వండుకుంటే చాలా రుచిగా ఉంటుంది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లతో చేసే వంటల్లో కూడా ఈ పువ్వును వేసుకోవచ్చు.
- మునగ పూలను నేతితో వేయించి పాలలో ఉడకబెట్టి.. పంచదార లేదా తేనె కలిపితే రుచికరమైన పాయసం అవుతుంది.
- కొన్ని ప్రాంతాల్లో మునగ పూలతో సూపును కూడా చేసుకుంటారు.
- కంటిచూపును మెరుగుపర్చటంలో మునగపూలు మేలు చేస్తాయి.
- జీవకణాలు తక్కువగా ఉన్న పురుషులకు మునగ పూలు వీర్యంలో వేడిని తగ్గించి కణాలు పెరిగేలా చేస్తాయి. పురుషుల్లో వంధ్యత్వాన్ని నివారించే ఉత్తమ ఔషధంగా ఈ పూలను భావించవచ్చు.
- కాలేయం, పేగులు మొదలైన అవయవాలను మునగపూలు దృఢపర్చగలవు. దీని వల్ల శరీరంలో అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. పేగుపూత, పేగుల్లో వాపు ఉన్న వారు తప్పనిసరిగా తినాల్సిన ఆహారమిది.
- సాధారణంగా మునగాకులు, మునక్కాడలు వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. కానీ మునగ పూలు మాత్రం చలవచేస్తాయి. దీనివల్ల పైత్యం తగ్గుతుంది. చర్మపు మంటలు తగ్గుతాయి.
- మునగ పూలు కఫ దోషాన్ని హరిస్తాయి. ఊపిరితిత్తుల్లో శ్లేష్మాన్ని తగ్గిస్తాయి.
- మునగ పూలతో చేసిన వంటలు తింటే తల్లిపాలు పెరుగుతాయి.

• గంగరాజు అరుణాదేవి



స్ఫూర్తి

ప్రియతమా శర్మ... వేధింపులు ఆమెకు కొత్త కాదు. బాల్యంలోనే మొదలయ్యాయి. కౌమారానికి వచ్చాకా అవి కొనసాగాయి. వాటిని తట్టుకోలేక చిన్న వయసులోనే ఇల్లు వదిలిన ఆమె... తన కాళ్లపై తాను నిలబడాలనుకున్నారు. అందుకు ఏకైక మార్గం చదువేనని గ్రహించి... మాస్టర్స్ చేశారు. ఆడపిల్ల ఇంటికి భారమని భావించే సమాజం నుంచి వచ్చిన ప్రియతమ... నేడు తనలాంటి ఎంతోమంది అమ్మాయిల్లో స్ఫూర్తి నింపుతున్నారు.



వేధింపులు దాటి శిఖరం వైపు

"పదేళ్ల వయసు... రైలులో ప్రయాణిస్తుంటే ఒక పెద్దాయన... తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. కాసేపటికి నా మీద చేతులు వేసి తడుముతున్నాడు. మంచి స్పర్శ ఏదో... చెడు స్పర్శ ఏదో తెలుసుకోలేని వయసు. అక్కడేకాదు... పక్కింట్లో, ఆఖరికి మా బంధువుల ఇంట్లో కూడా లైంగిక వేధింపులకు గురయ్యాను. పదిహేనేళ్ల వయసు వచ్చేవరకు ఇలాంటి ఘటనలు ఎదురవుతూనే ఉన్నాయి. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. చెప్పినా వినేవారు లేరు మా ఇంట్లో. ఎందుకంటే... అమ్మాయి అంటే మా ప్రాంతంలో కుటుంబానికి భారంగా, వేరొకరి ఇంటి సొత్తుగా భావిస్తారు. మగపిల్లలకు ఉన్న స్వేచ్ఛ, ఉన్నత చదువులు చదివే అవకాశం మాకు ఇవ్వరు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ మాది. మేం నలుగురు సంతానం. అక్కకు చిన్న వయసులోనే పెళ్లయింది. నన్ను ఆర్ట్స్‌తో సరిపెట్టిన అమ్మానాన్న... తమ్ముళ్లను మాత్రం ఇంజనీరింగ్‌లో చేర్పించారు. ప్రతిచోటా వివక్షే. వీటన్నిటికీ దూరంగా ఎక్కడికైనా వెళ్లిపోదామని ఎన్నోసార్లు అనుకున్నా. కానీ ఏదో తెలియని భయం నన్ను ఆపేసేది.

ఇల్లు వదిలి...

నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఇంట్లో వాళ్లు నాకు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. కానీ అక్కను చేసుకున్నవాడు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. వయసులో కూడా చాలా పెద్దవాడు. తన కాపురం చూశాక నాకు ఇంట్లోవాళ్లు తెచ్చే సంబంధాల మీద నమ్మకం పోయింది. నా జీవిత భాగస్వామిని నేనే వెతుక్కోవాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలోనే మా స్నేహితుడి స్నేహితుడితో పరిచయమైంది. తరువాత ఇద్దరి మనసులు కలిశాయి. గతంలో నాకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి చెప్పాను. అతను పెద్ద మనసుతో అర్థం చేసుకున్నాడు. ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి అతడిని పెళ్లి చేసుకున్నా. వేరే ఊళ్లో కాపురం పెట్టాం. ఇదంతా 2010లో. అప్పుడు నాకు ఇరవై ఏళ్లు.

మునుపెన్నడూ లేని గౌరవం...

పెద్ద షాక్ ఏంటంటే.. అతడు పెళ్లికి ముందు నాతో చెప్పినవన్నీ అబద్ధాలే... ఉద్యోగం, ఊరు, పేరు సహా. చేసేదిలేక సర్దుకుపోయాను. కొన్ని నెలల తరువాత మా అమ్మానాన్న మమ్మల్ని కనిపెట్టారు. 'మీరిద్దరూ కెరీర్‌లో స్థిరపడిన తరువాత మళ్లీ కలిసి జీవించవచ్చు' అని నాకు నచ్చ చెప్పి ఇంటికి తీసుకువెళ్లారు. ఆరు నెలల్లో ఒక్కసారి కూడా నా భర్తను చూసేందుకు అనుమతించలేదు. నాకు చచ్చిపోవాలని అనిపించేది. అన్నిటినీ భరించాను. మా ఇంటి దగ్గరే ఉన్న ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు కూడా ఉద్యోగానికి వెళ్లకుండా ఆపుదామని నాన్న ప్రయత్నించారు. నేను వినలేదు. నా బ్యాగ్ సర్దుకొని బయటకు వచ్చేశాను. నా జీవితంలో మొదటిసారి నాపై నాకు నమ్మకం కలిగింది ఆ ఉద్యోగంలో చేరాకనే. నాకు అంతకుముందు ఎక్కడా లేని గౌరవం, విలువ అక్కడ లభించాయి. నేనంటే అందరూ ఇష్టంగా ఉండేవారు. ఆడపిల్లననే వివక్ష ఎవరూ చూపలేదు.

చదువే మార్గమని...

కానీ నా ఎదుగుదల మావారికి నచ్చలేదు. నేను బయటకు వెళ్లినా, స్నేహితులు ఎవరితోనన్నా మాట్లాడినా ఇష్టపడేవాడు కాదు. కాదంటే కొట్టేవాడు. చివరకు ఉద్యోగం మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టాడు. తనకు తెలియకుండా వేరే ఉద్యోగాలు ప్రయత్నించాను. ఆ సమయంలో నాకు అర్థమైంది ఏంటంటే... ఉన్నత చదువులు చదివితే మంచి అవకాశాలు వస్తాయని. జీవితంలో బాగా స్థిరపడవచ్చని. ముఖ్యంగా ఆడపిల్లల పట్ల వివక్ష చూపే సమాజంలో మార్పు రావాలన్నా, స్వశక్తితో ఎదగాలన్నా అందుకు చదువే ప్రధానమని అర్థమైంది. అందుకే మేనేజ్‌మెంట్ డిప్లమో కోర్సులో చేరాను. స్నేహితుల సహకారంతో కోర్సు పూర్తి చేశాను. ఆ సర్టిఫికెట్‌తో లఖనవూలో నాకు మంచి ఉద్యోగం వచ్చింది. ఆ క్షణం నా ఆనందాన్ని అంతులేదు. పంజరం నుంచి బయటకు వచ్చిన పక్షిలా స్వేచ్ఛను పొందిన అనుభూతి.



వారి స్ఫూర్తితో...

ఉద్యోగంలో భాగంగా ఐఐటీ, ఐఐఎం, బిట్స్ నిట్ గ్రాడ్యుయేట్స్‌ను కలిశాను. వారిని చూశాక నాలో కొత్త ఉత్సాహం వచ్చింది. చదువు కొనసాగించాలన్న స్ఫూర్తి రగిలింది. లఖనవూ వర్సిటీ నుంచి లైబ్రరీ సైన్స్‌లో మాస్టర్స్ చేశాను. అది నాలో మునుపెన్నడూ లేని ధైర్యాన్ని ఇచ్చింది. మరోవైపు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో... అతడికి విడాకులు ఇచ్చాను. తరువాత నాకు చాలా సందర్భాల్లో అండగా నిలిచిన కోర్కీ సిన్హాను మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాను. తన దృష్టిలో నేనొక యోధురాలిని. సిన్హాను చూశాక అనిపించింది.. పెంపకాన్ని బట్టి మగవారి ఆలోచనాతీరు ఉంటుందని. అందుకే నాలాంటి అమ్మాయిలకు అండగా నిలవాలని అనుకున్నా. మగపిల్లలను చిన్నప్పటి నుంచే ఆడవారి పట్ల గౌరవ మర్యాదలతో మెలిగేలా పెంచాలని చెబుతున్నా. దీని కోసం అవగాహన తరగుతులు నిర్వహిస్తున్నా. అదే సమయంలో బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, యువతుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నా. దీనివల్ల ఏ ఒక్కరిలో మార్పు వచ్చినా నా ప్రయత్నం ఫలించినట్టే."

చలికి చెక్కు చెదరకుండా...

చలి కాలం ఎన్ని జాగ్రత్తలు పాటించినా మేకప్ వేసుకున్న ముఖం జీవం కోల్పోయినట్టు కనిపించవచ్చు. ఇలాంటప్పుడు చర్మానికి నప్పే మేకప్‌ను ఎంచుకోవాలి. అందుకోసం...

కాంబినేషన్ చర్మమైతే...

ఫౌండేషన్: ద్రవరూప/క్రీమ్/మూస్ ఫౌండేషన్ ఎంచుకోవాలి. పల్చని మేకప్ కోసం నీటి ఆధారిత సౌందర్య సాధనాలనూ, వేడుకల్లో మేకప్ కోసం ఆయిల్ బేస్‌డ్ ఫౌండేషన్లు బాగుంటాయి.
కన్‌సీలర్: లిక్విడ్, క్రీమ్ లేదా స్టిక్ కన్‌సీలర్లు బాగుంటాయి. ఇవి మ్యాట్, డ్యూయీ ఫినిష్ కలిగినవైతే మరింత ఆకర్షణీయంగా ఉంటాయి.
బ్లష్: షిమ్మర్ షేడ్స్‌లో ఉండే జెల్ లేదా క్రీమ్ బ్లష్‌లు ఎంచుకోవాలి.

పొడి చర్మమైతే...

ఫౌండేషన్: టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా ఆయిల్ బేస్‌డ్ లిక్విడ్ ఫౌండేషన్ ఎంచుకోవాలి.
కన్‌సీలర్: క్రీమీ లేదా డ్యూయీ ఫినిష్ కలిగి ఉండే స్టిక్ లేదా క్రీమ్ కన్‌సీలర్ ఎంచుకోవాలి.
బ్లష్: క్రీమ్ బ్లష్ లేదా శాటిన్/డ్యూయీ కలిగిన టింటెడ్ మాయిశ్చరైజర్ వాడుకోవాలి.

జిడ్డు చర్మమైతే...

ఫౌండేషన్: నీటి ఆధారిత, లేదా నూనెలు లేని ద్రవరూప లేదా పౌడర్ ఫౌండేషన్ బాగుంటుంది.
కన్‌సీలర్: మధ్యస్తంగా కవర్ చేసే మ్యాట్ ఫినిష్‌తో కూడిన ద్రవరూప కన్‌సీలర్ ఎంచుకోవాలి.
బ్లష్: మ్యాట్ ఫినిష్‌తో కూడిన పౌడర్ బ్లష్ బాగుంటుంది.

మేకప్



లిక్కర్ గ్యాంగ్ రిమాండ్ పొడిగింపు

విజయవాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు, బూనేటి చాణక్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణను సిట్ పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారికి వచ్చే నెల 5వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. బెయిల్‌పై బయట ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనుంజయరెడ్డి, పి. కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, పైలా దిలీప్ వాయిదాకు హాజరయ్యారు. కాగా, కోర్టు హాలులో చెవిరెడ్డి తన వాదనను న్యాయాధికారి ముందు విన్నవించుకున్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా తన ఆస్తులను జప్తు చేసేందుకు ఆదేశాలు ఇచ్చిందని, తాను మద్యం వ్యాపారం చేయలేదని తెలిపారు. దీనిపై పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి ఆయనకు సూచించారు. కాగా, చెవిరెడ్డి కోర్టుకు వచ్చి వెళ్లేటప్పుడు మీడియాను చూసి వాహనం ఎక్కకుండా మాట్లాడారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నప్పుడు మీడియాతో మాట్లాడటం నిబంధనలకు విరుద్ధం. దీన్ని ఆయన ఇప్పటికే పలుమార్లు ఉల్లంఘించారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఢిల్లీ వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు 24వ తేదీకి వాయిదా వేసింది. బెయిల్ షరతులు సడలించాలని బాలాజీ గోవిందప్ప వేసిన పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా పడింది.

మద్యం కేసులో ముందస్తు బెయిలివ్వండి

- వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ పిటిషన్లు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితులు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేకాధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3) వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు రాగా.. ఇద్దరు పిటిషనర్లూ దర్యాప్తునకు సహకరిస్తున్నారని.. అప్రూవర్లుగా మారాలని భావిస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది తెలిపారు. సీఐడీ నుంచి కౌంటర్లు అవసరం లేదని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివరాలు తెప్పించుకుంటే సరిపోతుందన్నారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశించారు. విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేశారు.

చిన్న అప్పన్నకు ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితుడైన (ఏ-24) కడూరు చిన్న అప్పన్న కస్టడీ ముగిసింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఆయన్ను సిట్ అధికారులు నెల్లూరు సెంట్రల్ జైల్లో అప్పగించారు. నెల్లూరు ఏసీబీ కోర్టు అనుమతితో ఈ నెల 17న నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి తమ కస్టడీకి తీసుకుని తిరుపతికి తరలించిన దర్యాప్తు అధికారులు 5 రోజులు విచారించారు.

విజయవాడకు 'పరకామణి' విచారణ బృందాలు

తిరుపతి(నేరవిభాగం)/తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ కేసుకు సంబంధించి విచారణ బృందాలు తిరుపతి నుంచి తాత్కాలికంగా విజయవాడకు వెళ్లాయి. నిందితుడు రవికుమార్ కాల్‌డేటాను సీఐడీ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు విచారించిన 20 మందికి సంబంధించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

సతీశ్‌కుమార్ మృతిపై దర్యాప్తు

పరకామణిలో చోరీ కేసు ఫిర్యాదుదారు, టీటీడీ మాజీ ఏవీఎస్‌వో సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తన సిబ్బందితో కలసి ఘటన జరిగిన రైల్వే ట్రాక్ సమీపంలో శనివారం పరిశీలించారు. మృతదేహాన్ని చూసిన రైల్వే సిబ్బందిని విచారించారు.

టీచర్లకు బోధనేతర పనులుండవు

- 423లో 200 సమస్యలు పరిష్కరించాం
- సర్వీస్ రూల్స్‌ను డీఈఓ, ఎంఈఓలకు అప్పగించం
- ఏపీటీఎఫ్ నేతలతో మంత్రి లోకేశ్



ఏపీటీఎఫ్ నేతలు చెన్నుపాటి మంజుల, పి.పాండురంగ వరప్రసాద్‌లతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు ఉండవని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీటీఎఫ్ నేతలు చెన్నుపాటి మంజుల, పి.పాండురంగ వరప్రసాద్‌లతో శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమావేశమయ్యారు. 'టీచర్ల సమస్యలపై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. అభ్యసన ఫలితాల కోసం వారు కృషి చేయాలి. గత 17 నెలల్లో ఫ్యాప్టో 423 సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే అందులో 200 పరిష్కరించా. 81 సమస్యలు పరిష్కార యోగ్యమైనవి కావు. 72 వినతులు విధానపరమైన అంశాలు. మరో 71 సమస్యలు కోర్టు పరిధిలో ఉన్నాయి. మెగా పీటీఎం మినహా టీచర్లకు ఇంకెలాంటి బోధనేతర పనులు ఉండవు. డీఈవోలు, ఎంఈవోలకు సర్వీస్ రూల్స్ అంశాలు అప్పగించం' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. కాగా ఇన్ సర్వీస్ టీచర్లకు సాధారణ టెట్ నుంచి మినహాయింపునివ్వాలని, వారికి ప్రత్యేకంగా టెట్ నిర్వహించి కటాఫ్ మార్కులను 45 శాతానికి తగ్గించాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు. 2003కు ముందు సర్వీసులో చేరిన టీచర్లకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలని, ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వేరు చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లను కాకుండా ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించాలన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి భద్రత కల్పిస్తాం

- అమలుకు సిద్ధంగా 100 రోజుల ప్రణాళిక
- 2 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాన్ని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మత్స్యకారులకు ప్రపంచ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ తుది దశకు చేరిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.2 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. వేటలో నైపుణ్యాల పెంపు, ప్రత్యేక రీఫ్‌ల ఏర్పాటు వంటి అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామన్నారు. వచ్చే నెలలో తమిళనాడు, కేరళకు తీసుకెళ్లి, రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజం యూనిట్ల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నామని పవన్ తెలిపారు. తొలిసారి సముద్రంలో చేపల సంఖ్యను పెంచే చర్యల్లో భాగంగా ఉప్పాడ, కాకినాడ తీరాల్లో 50 వేల పండుగప్ప పిల్లల్ని సముద్రంలో వదిలామని, భవిష్యత్‌లో ఉప్పు నీటిలో పెరిగే రొయ్య పిల్లల్ని కూడా తీర ప్రాంతాల్లో వదిలేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16న ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం షెడ్యూలు విడుదల చేశారు. గతేడాది తరహాలోనే రోజు మార్చి రోజు పరీక్షలు నిర్వహించనున్నారు. 16 నుంచి 30వ తేదీ వరకు రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. 30న కాంపోజిట్ కోర్సు విద్యార్థులకు, ఓఎస్ఎస్‌సీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ఆ రోజుతో టెన్త్ పబ్లిక్ పరీక్షలు ముగుస్తాయి. రెగ్యులర్ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు 11.30గంటల వరకే జరుగుతాయి. ఇప్పటివరకూ 6,38,893 మంది రెగ్యులర్ విద్యార్థులు టెన్త్ పరీక్షలకు నమోదు చేసుకున్నారు. వీరు కాకుండా గతంలో ఫెయిలైన విద్యార్థులు, ఇతర ప్రైవేటు విద్యార్థులు సుమారు 30వేల మంది పరీక్షలు రాస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మూల్యాంకనం అనంతరం మార్కుల లెక్కింపులో పొరపాట్లు వచ్చినందున, ఈసారి మార్కుల నమోదులో కొన్ని మార్పులు చేశారు.

పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	సబ్జెక్టు	మార్కులు
మార్చి 16	ప్రథమ భాష	100
	ప్రథమ భాష పేపర్-1(కాంపోజిట్ కోర్సు)	70
మార్చి 18	ద్వితీయ భాష	100
మార్చి 20	ఇంగ్లీష్	100
మార్చి 23	గణితం	100
మార్చి 25	ఫిజిక్స్	50
మార్చి 28	బయాలజీ	50
మార్చి 30	సోషల్ స్టడీస్	100
మార్చి 31	ప్రథమ భాష పేపర్-2(కాంపోజిట్ కోర్సు)	30
	ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్-1	100
ఏప్రిల్ 1	ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2	100
	ఒకేషనల్ కోర్సు థియరీ	40/30

జగన్ ఉన్మాదంలో ఉన్నారు: అశోక్‌బాబు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చావుకి, పెళ్లికి ఒకే భజంత్రి అనే సామెత జగన్‌కు సరిగ్గా వర్తిస్తుందని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '11 సీబీఐ, 9 ఈడీ చార్జిషీట్లు ఎదుర్కొంటున్న వ్యక్తి కోర్టుకు వెళ్లేటప్పుడు భారీ హడావిడి చేయడం దేశ న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఎప్పుడూ జరగలేదు. సమయం సందర్భం లేకుండా, ఏ ప్రదేశంలో ఉన్నామన్న స్పృహ లేకుండా రప్పా రప్పా అనడం ఏమిటి? జగన్ ఉన్మాదంలో ఉన్నారు. ఈ ఉన్మాదిని నమ్ముకుని అడ్డగోలుగా మాట్లాడేవారికి ప్రజలే బుద్ధి చెబుతారు' అని అన్నారు.

ఇది కోర్టుపై దాడి చేయడమే: యనమల

'జగన్‌పై అనేక అవినీతి కేసులు విచారణలో ఉన్న నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరవ్వడం తప్పనిసరి. ఆ సమయంలో మందీమార్బలంతో బలప్రదర్శన చేయడం అంటే ఓ రకంగా కోర్టుపై దాడి చేసినట్లే' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: అచ్చెన్న

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు, చేపలు, రొయ్యల రైతులకు శుక్రవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఏటా వేట నిషేధ కాలంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం గత ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వగా, సీఎం చంద్రబాబు ఒకేసారి రూ.20 వేలకు పెంచి ఇస్తున్నారని తెలిపారు. 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్లు సాయం చేశామని చెప్పారు.

డ్వాక్రా మహిళలకు సకాలంలో రుణాలు: కొండపల్లి

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు నెలకొల్పే మహిళలకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను మహిళా వ్యవస్థాపకులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, కొత్త సంస్థల ఏర్పాటుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన విజయవాడలోని 'సెర్ప్' కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 'ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.578.08 కోట్లతో 39,371 మంది మహిళలు వ్యాపార, సేవా, పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేయగా.. మిగిలిన లక్ష్యాలను వచ్చే మార్చిలోగా సాధించాలి. డ్వాక్రా మహిళలను వ్యవస్థాపకులుగా తయారు చేయడానికి విశాఖ ఐఐఎంను ఇంక్యుబేషన్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో 150 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు.

కల్తీ నెయ్యితో వైవీ పీఏ ఖాతాకు కోట్లు: స్వామి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగం వాస్తవమేనని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టరేట్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కల్తీ నెయ్యి ద్వారా వైవీ సుబ్బారెడ్డి పీఏ బ్యాంకు ఖాతాలోకి రూ.కోట్లు జమ అయ్యాయని.. ఈ వ్యవహారంపై సిట్ విచారణ చేస్తోంది. వైవీ తనపై ఉన్న అవినీతి ఆరోపణలు పక్కదారి పట్టించేవిధంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు.

నేడు అండమాన్‌లో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది రానున్న రెండు రోజుల్లో బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడొచ్చని వివరించింది. మరోవైపు, బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల శుక్రవారం తెలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.



చిత్రజ్యోతి
SINCE 1965



సనాతన ధర్మం పరాక్రమం చూస్తారు

నందమూరి బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న డివైన్ యాక్షన్ ఫిల్మ్ 'అఖండ 2. తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. తేజస్వినీ నందమూరి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం కర్నాటకలో విడుదల చేశారు. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేశారు.ఈ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ 'ఉదయం వర్ష సూచన లేదు. మేం హోటల్‌కు వచ్చేటప్పటికి కుంభవృష్టి కురిసింది. మళ్లీ వేదికపైకి వచ్చేసరికి వర్షం లేదు. ఇదంతా శివుని మహిమ. 'అఖండ 2' పాన్ ఇండియా సినిమా. ఈ చిత్రంలో సనాతన ధర్మం పరాక్రమం చూస్తారు. థియేటర్‌లో బాక్సులు పేలిపోయే మ్యూజిక్ ఇచ్చాడు తమన్' అన్నారు. 'బాలయ్యగారి నటన, డైలాగులు, యాక్షన్‌లో ఓ అద్భుతమైన ఎనర్జీ ఉంటుంది. డిసెంబర్ 5న విడుదలయ్యే ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు శివరాజ్‌కుమార్. శివతత్వం కలిగిన అద్భుతమైన చిత్రం ట్రైలర్‌ను శివన్న విడుదల చేయడం గర్వంగా ఫీలవుతున్నానని దర్శకుడు బోయపాటి శ్రీను చెప్పారు. డిసెంబర్ 5న అంతా అఖండ తాండవ శబ్దమే అని నిర్మాత గోపీ ఆచంట అన్నారు.



'వనజీవి రామయ్య' జీవితం వెండితెరపైకి

వనజీవి రామయ్యగా ప్రసిద్ధుడైన దరిపల్లి రామయ్య జీవితం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం షూటింగ్ శుక్రవారం ఖమ్మంలో మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వేముగంటి, నిర్మాత చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ "వనజీవి రామయ్య' టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్‌ను ఖమ్మంలో ప్రారంభించడానికి ముఖ్య కారణం ఇది ఆయన పుట్టిన గడ్డ కావడమే. ఆయన గొప్పదనాన్ని చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో నటీనటులంతా పారితోషికం తీసుకోకుండా నటిస్తున్నారు' అని అన్నారు. టైటిల్ రోల్ పోషిస్తున్న బహ్మజీ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వనజీవి రామయ్యలా జీవించాలనే కోరికతో ఈ చిత్రంలో నటిస్తున్నాను, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించడంతో పాటు ఓ మొక్కను నాటాలన్నారు. అలాగే వనజీవి రామయ్య మృతి చెందిన నాటి నుంచి ఆయన సతీమణి జానకమ్మకు పెన్షన్ ఇవ్వడం లేదని తెలిసిందని.. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఆమెకు పెన్షన్ అందేలా చూడాలని కోరారు.

ఖమ్మం ఖానాపురంహవేలి (ఆంధ్రజ్యోతి)







వినుకొండ మున్సిపాలిటీలోని గాయత్రీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, షకీలా దస్తగిరి

ఇది అక్షర విజయం

- ప్రజా సమస్యలు శరవేగంగా పరిష్కరించాం: జీవీ
- 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్'ను అభినందించిన చీఫ్ విప్
- వినుకొండలో 63.60 లక్షలతో నిర్మించిన డ్రెయిన్, సీసీ రోడ్లు ప్రారంభం

వినుకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. పల్నాడు జిల్లా వినుకొండలో రూ.63.60 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లను చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. కొట్నాల్ల వీధిలో రూ.18.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఈ సందర్భంగా గాయత్రినగర్‌లో నిర్వహించిన సభలో జీవీ మాట్లాడుతూ గాయత్రినగర్, కొట్నాల్ల వీధిలో రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారని చెప్పారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ పనులు పూర్తిచేయడం ఎంతో సంతోషంగా ఉందని.. సంతృప్తి ఇచ్చిందని తెలిపారు. ఇది అక్షర విజయమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి' గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల్ని ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం.. వాటిని పరిష్కరించేందుకు వారధిగా నిలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను శరవేగంగా పరిష్కరించామని, ప్రారంభించిన రెండు నెలల్లోనే పనులు పూర్తిచేశామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి' భవిష్యత్తులో కూడా నిర్వహించాలని జీవీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోష్, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, వాసిరెడ్డి లింగమూర్తి, ఏతం ఆదినారాయణ, మాజీ చైర్మన్ షమీం ఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మూడేళ్లలో 17 లక్షల ఇళ్లు

2029 జనవరికల్లా 'హౌసింగ్ ఫర్ ఆల్': ముఖ్యమంత్రి

> పీఎంఏవై 1.0 హౌసింగ్ స్కీంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీ సామాజిక వర్గాలకు అదనంగా చెల్లింపులు చేస్తున్నాం. ఇప్పుడు ముస్లిం మైనారిటీలకూ అదనంగా రూ.50 వేలు చెల్లిస్తాం. 18 వేల మంది లబ్ధిదారులకు రూ.90 కోట్లు ఖర్చవుతుంది. మనం ఆయా వర్గాలకు చేకూరుస్తున్న అదనపు సాయాన్ని వారికి వివరించాలి. - ముఖ్యమంత్రి చంద్రబాబు



టిడ్కో, గృహనిర్మాణశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి పార్థసారథి, అధికారులు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవలే 3లక్షలకు పైగా పేదల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించిన సీఎం చంద్రబాబు, రానున్న మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ లక్ష్య సాధన కోసం తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేస్తూ.. ఇకపై ప్రతి 3నెలలకొకసారి సామూహిక గృహప్రవేశాలు చేయించాలని స్పష్టంచేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణశాఖ, టిడ్కో అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. 'అందరికీ ఇళ్లు(హౌసింగ్ ఫర్ ఆల్) కట్టిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఈ హామీని నెరవేర్చే ప్రక్రియలో ఇప్పటికే 3లక్షలకు పైగా ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాం. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని 2029 జనవరి నాటికి పూర్తిచేయాలి. ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగుల వరకు అందరూ బాధ్యతగా తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు 20 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మిగిలిన 17లక్షల ఇళ్లను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలి. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. త్వరలో టిడ్కో, హౌసింగ్ ఉన్నతాధికారులు, ఉద్యోగులందరితో సమీక్ష చేస్తాను' అని తెలిపారు. 'ప్రభుత్వం నెరవేర్చాల్సిన హామీ హౌసింగ్ ఫర్ ఆల్. ఈ కార్యక్రమం అమలులో పొరపాట్లు జరగకూడదు.. జాప్యం చేయకూడదు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించే విధంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలి' అని సూచించారు.

అప్పుడు ఉపాధి బిల్లులూ ఆపేశారు..

గత ప్రభుత్వం కక్షసాధింపులో భాగంగా 2014-19 మధ్య చేపట్టిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీంకు సంబంధించిన కొందరు లబ్ధిదారులకు బిల్లులు నిలిపివేసిందని సీఎం చెప్పారు. రూ.920 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. వీటిని తిరిగి రప్పించేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. వాటిని గత ప్రభుత్వం ఏవిధంగా అడ్డుకుందో వివరించాలన్నారు. '2014-19 మధ్య జరిగిన ఉపాధి హామీ పథకం పనుల బిల్లులను గత ప్రభుత్వం ఇదే తరహాలో ఆపేసింది. ఆ బిల్లులను మళ్లీ స్ట్రీమ్‌లైన్‌లో పెట్టి బిల్లులు వచ్చేలా చేశాం. అదే తరహాలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీంకు సంబంధించిన పెండింగు బిల్లులను కూడా రప్పించేలా కృషి చేయాలి' అని సీఎం స్పష్టంచేశారు.

పీపీపీ కాలేజీల నియంత్రణ సర్కారుదే!

(మొదటి పేజీ తరువాయి)

మెడికల్ కాలేజీలతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఒక్కో మెడికల్ కాలేజీ కోసం 50 ఎకరాలు కేటాయించామని, ఇందులో 25 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఆస్పత్రి నిర్మాణం జరిగితే, మిగతా 25 ఎకరాల్లో నర్సింగ్, పారా మెడికల్, డెంటల్ ఆయుర్వేదం, వెల్‌నెస్ సెంటర్, యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నింటినీ అనుసంధానించాలని సీఎం సూచించారు. మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో 70 శాతం పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తామని, వైద్య సేవలు కూడా ఉచితంగానే అందుతాయని వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ నమూనాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రమాణాలు, నీతీ ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం వైద్య కళాశాలలు పనిచేసేలా చూడాలని, ఉత్తమ కార్యాచరణ కలిగిన వాటికి రేటింగ్ ఇవ్వాలని అధికారులకు నిర్దేశించారు.

సంజీవని గేమ్ చేంజర్..: కుప్పంలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్న సంజీవని ప్రాజెక్టు గేమ్ చేంజర్‌గా మారనుందని, ఆరోగ్య రంగంలో దేశం మొత్తానికి ఓ దిక్సూచిలా ఈ ప్రాజెక్టు నిలవనున్నదని సీఎం అన్నారు. ఈ విధానంలో డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహించడం ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తామని వివరించారు. కుప్పంలో 3.38 లక్షల మందికి సంబంధించిన ఆరోగ్య వివరాలను సేకరించాలని చంద్రబాబు సూచించగా, కుప్పంలో రిజిస్టర్ అయిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి వ్యాధుల ప్రొఫైల్స్ సిద్ధం చేస్తున్నామని, 49 వేల మంది డేటాను సేకరించామని అధికారులు తెలిపారు. జనవరి 1నుంచి చిత్తూరు జిల్లా మొత్తానికి ప్రాజెక్టును వర్తిస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని బాబు ఆదేశించారు.

ఏప్రిల్ నుంచి యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్..

యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ విధానాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రస్తుతం 12 లక్షల క్లయిమ్‌లు ఆస్పత్రుల నుంచి ట్రస్టుకు వస్తున్నాయని, వీటికోసం నెలకు రూ.330 కోట్లు వ్యయం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఏ ప్రాంతంలో, ఏ వ్యాధికి ఎంత వ్యయం చేస్తున్నామో విశ్లేషించాలని, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాల ద్వారా ఆరోగ్యరంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంతోపాటు ప్రజల వ్యక్తిగత వ్యయం కూడా తగ్గేలా చూడాలని సీఎం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సత్యకుమార్ పాల్గొనగా, ఆ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, ఎండీ గిరీశ నేరుగా పాల్గొన్నారు.

15 ఆస్పత్రుల్లో ఎన్‌ఆర్సీల ఏర్పాటు

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15 ప్రధాన ప్రభుత్వాసుపత్రుల్లో త్వరలో న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లు(ఎన్‌ఆర్సీ) ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన జారీచేశారు. ఈ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య, పోషకాహార సేవలందుతాయన్నారు. 15 ఎన్‌ఆర్సీల్లో 11 గిరిజన ప్రాంతాల్లో వస్తాయని పేర్కొన్నారు. వీటన్నింటిలో చిన్నారుల కోసం 115 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 21 ఎన్‌ఆర్సీలు ఉన్నాయని, వాటిల్లో 340 పడకలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామాల్లోని ఆశా, ఏఎన్ఎంలు అందించే సమాచారంతో పీహెచ్‌సీ వైద్యులు చిన్నారులకు పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసిన తర్వాత ఎన్‌ఆర్సీ కేంద్రాలకు పంపిస్తారని పేర్కొన్నారు.

మయన్మార్ నుంచి రాష్ట్రానికి 55 మంది!

- మూడు ప్రత్యేక విమానాల్లో 370 మందిని తీసుకొచ్చిన కేంద్రం
- రాష్ట్రవాసులను స్వస్థలాలకు పంపేందుకు ఏపీ భవన్ అధికారుల ఏర్పాట్లు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లోని సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ నుంచి కాపాడిన మరో 370 మందిని కేంద్ర ప్రభుత్వం స్వదేశానికి రప్పించింది. మూడు ప్రత్యేక విమానాల ద్వారా వారిని ఢిల్లీ చేర్చింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 55 మంది ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ 55 మంది విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వారని తెలిపింది. ఢిల్లీ చేరుకొన్న అనంతరం ఏపీ భవన్ అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపి.. వారిని ఢిల్లీలోని ఏపీ భవన్‌కు తరలించారు. వారందరికి వెంటనే తాత్కాలిక వసతి, ఆహార ఏర్పాట్లు చేశారు. మయన్మార్‌లో వారి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా.. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో, తదుపరి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.1,000 సహాయం అందించారు. బాధితులను స్వస్థలాలకు చేర్చేందుకు వీలుగా రైల్వే అధికారులతో మాట్లాడి ప్రయాణ ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటి వరకు మయన్మార్ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ నుంచి రక్షింపబడిన 79 మంది ఏపీ వాసులను సొంత ప్రాంతాలకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించింది. తమను సురక్షితంగా స్వదేశానికి తరలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

మరో 3 నెలలు విజయానందే!

- సీఎస్‌గా కొనసాగించాలని సీఎం నిర్ణయం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సర్వీసును మరో 3 నెలలు పొడిగించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈమేరకు కేంద్రం అనుమతి తీసుకోనున్నారు.. విజయానంద్ ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మరో 3నెలలు ఆయన్నే సీఎస్‌గా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ పొడిగింపుతో విజయానంద్ వచ్చే ఫిబ్రవరి నెలాఖరు వరకూ కొనసాగుతారు. ఆ తర్వాత జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌ను సీఎస్‌గా నియమించాలని సీఎం భావిస్తున్నారు.

భూముల రీసర్వేపై అభ్యంతరాల పరిష్కారానికి మరింత గడువు

- రెండేళ్లకు పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు
- 2027 డిసెంబరు కల్లా రీసర్వే పూర్తి
- శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు

విశాఖపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై రైతుల నుంచి వచ్చే అభ్యంతరాల పరిష్కారానికి తహశీల్దారు స్థాయిలో ఇప్పటివరకూ ఉన్న ఏడాది కాలపరిమితిని రెండేళ్లకు పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు వెల్లడించారు. శుక్రవారం ఆయన విశాఖ కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. 'రీసర్వేపై తహశీల్దార్ స్థాయిలో పరిష్కారానికి గడువు రెండేళ్లకు పెంచాలని సిఫారసు చేస్తాం. గందరగోళానికి తావులేకుండా రీసర్వే పారదర్శకంగా జరగాలని భావిస్తున్నాం. ప్రైవేటు భూములకు సంబంధించి తప్పుడు సర్వే నంబర్లతో ఒకరి భూమి మరొకరి పేరిట రిజిస్టర్ అయిన సందర్భాలలో వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ పరిష్కరించేలా గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తాం' అని రఘురామ తెలిపారు. రాష్ట్రంలో రీసర్వే వివరాలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. 'మొత్తం 16 వేల గ్రామాలు ఉండగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తియింది. అక్కడ 7లక్షల అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో 2లక్షల అభ్యంతరాలు పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ 2027 డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేస్తాం. రీసర్వేలో తొలుత ప్రభుత్వ భూములను గుర్తించిన తరువాతే జిరాయితీ భూములు సర్వే చేస్తున్నాం. రీసర్వేలో 44 వేల ఎల్పీఎం(సర్వే నంబర్లు) ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించినవిగా గుర్తించాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తుది చర్యలు ఉంటాయి. రీసర్వేకు అదనంగా గ్రామాల్లో నివాసాలు, గ్రామ కంఠాల గుర్తింపునకు స్వామిత్ర, నగరాలు/పట్టణాల్లో నక్షత్ర ప్రాజెక్టు ద్వారా సర్వే ప్రక్రియ జరుగుతుంది' అని కూర్మనాథ్ వివరించారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

'రైతన్నా.. మీకోసం'లో నేనూ పాల్గొంటా

- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత కోసం ఈ నెల 24న చేపట్టనున్న 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో తానూ పాల్గొంటానని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. "ఈ నెల 24 నుంచి 29 వరకు జరిగే 'రైతన్నా.. మీకోసం'లో నేనూ పాల్గొంటా. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలి. రైతు సేవా కేంద్రాల పరిధిలోని ప్రతి రైతు ఇంటికీ సీఎం లేఖను అందించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి నిర్దేశించిన పంచసూత్రాలను వివరించాలి. వ్యవసాయ శాఖ తయారు చేసిన ఫార్మర్ యాప్‌ను ప్రతి రైతుకూ చేరువచేయాలి" అని సీఎం నిర్దేశించారు. కాగా, రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల అంశంలో సీసీఐ అధికారుల తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసినా రైతులు ఇబ్బందులు పడటంపై ఆరాతీశారు. ఎట్టి పరిస్థితుల్లో పత్తి రైతులు నష్టపోవడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలన్నారు. అరటి ధర పడిపోకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

జోన్ పరిధిలో పత్తి ఎక్కడైనా అమ్ముకోవచ్చు: సీసీఐ

గుంటూరు సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఇండియా(సీసీఐ) శుభవార్త చెప్పింది. రైతు పండించిన పత్తిని ఎక్కడైనా అమ్ముకునేలా నిబంధనలు సడలించినట్టు తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని పేర్కొంది. ఇప్పటి వరకు రైతు తాను పండించిన పత్తిని ఆ మండల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలోనే అమ్ముకునే అవకాశం ఉండేది. దానివల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు చాలా నష్టపోతూ వచ్చారు. ఈ నేపథ్యంలో రైతుకు మేలు చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 843ను తీసుకొచ్చింది. అందులోని 23వ నిబంధన ప్రకారం.. రైతులు తమకు ఇష్టం వచ్చిన చోట పత్తిని అమ్ముకోవచ్చు. ఈ జీవోను సీసీఐ తుంగలో తొక్కిన సంగతిని మార్కెటింగ్ అధికారులు, ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం ప్రతినిధులు ఆ సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సీఎండీ ఆదేశాలతో రైతులు తమకు ఇష్టం వచ్చిన చోట పత్తిని అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ సీసీఐ సైట్‌లో మార్పులు చేశారు.

ఏపీఎంఎస్ఐడీసీ జీఎం అరెస్టు

- అక్రమాస్తుల కేసులో ఏసీబీ అదుపులో సూర్యకళ

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) జనరల్ మేనేజర్ మల్లాది వెంకట సూర్యకళను అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆమె అక్రమాస్తులు కూడబెట్టినట్లు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంతో పాటు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఉదయం 9గంటలకే ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయానికి చేరుకున్న అధికారులు ఆమె చాంబర్‌ను ఆధీనంలోకి తీసుకున్నారు. ఆమె ఆఫీసుకు రాగానే సమాచారం అందించారు. ఆ తర్వాత ఆమెకు సంబంధించిన నివాసాల్లో నాలుగు చోట్ల సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన సోదాల్లో దాదాపు 27 చోట్ల.. ఇళ్లు, ఇళ్లస్థలాలు, వ్యవసాయ భూములు ఆమె పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. రూ.2 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. మూడు ఇళ్లల్లో బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.9 లక్షల విలువైన నగదును వద్ద గుర్తించారు. ఇవి కాకుండా రెండు కార్లు ఆమె పేరు మీద ఉన్నాయి. మొత్తంగా ఆమె ఆస్తుల విలువ రూ.6 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులు సోదాలు కొనసాగుతాయని తెలిపారు.

బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ విచారణకు
హాజరైన సెలబ్రిటీలు

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు విచారణలో భాగంగా సీఐడీ సిట్ ఎదుట శుక్రవారం పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, అమృతా చౌదరి, యాంకర్ శ్రీముఖి సిట్ అధికారుల వద్ద తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కోసం వారు ఎంత మొత్తం పారితోషికం తీసుకున్నారు? ఒప్పందాల వివరాలు, డబ్బు చెల్లింపులు ఏ విధంగా జరిగాయన్న విషయాలపై సిట్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. ఈ క్రమంలో వారి బ్యాంకు స్టేట్ మెంట్లను కూడా పరిశీలించారు. నిధి అగర్వాల్ 'జీత్ విన్'కు, శ్రీముఖి 'ఎం 88'కు, అమృతా చౌదరి 'యోలో 247', 'ఫెయిర్ ప్లే' యాప్‌లకు ప్రమోషన్ చేశారు. ఈ వ్యవహారంలో యాప్‌ల యజమాన్యాలతో నేరుగా ఒప్పందాలు జరిగాయా లేక మధ్యవర్తులెవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ అధికారులు విచారణ చేసినట్లు తెలుస్తోంది.

ఎర్రచందనం చెట్ల రక్షణకు 40 కోట్లు

న్యూఢిల్లీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం చెట్ల రక్షణ కోసం కేంద్రం రూ.39.84 కోట్లు విడుదల చేసింది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ(ఎన్‌బీఏ).. రాష్ట్ర అటవీ శాఖకు రూ.38.36 కోట్లు, రాష్ట్ర జీవ వైవిధ్య మండలికి రూ.1.48 కోట్లు మంజూరు చేసింది. కాగా, ఎన్‌బీఏ ఇటీవల ఏపీలోని 198 మంది ఎర్రచందనం రైతులకు రూ.3 కోట్లు పంపిణీ చేసింది.

రూ.5.13 కోట్ల లేబర్‌సెస్ ఎగవేత?

- 24న విచారణకు రండి: ఎస్ఆర్ఎం వర్సిటీకి కార్మిక శాఖ లేఖ

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఎస్ఆర్ఎం విద్యాసంస్థ రూ. 513 కోట్ల విలువైన లేబర్ సెస్‌ను ఎగవేసినట్టు వచ్చిన ఆరోపణలపై కార్మికశాఖ స్పందించింది. సోమవారం విచారణకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆ యూనివర్సిటీ యాజమాన్యానికి లేఖ రాసింది. ఎస్ఆర్ఎం విద్యాసంస్థ లేబర్ సెస్ చెల్లించడంలేదంటూ ఈ నెల 17న గుంటూరు జిల్లా కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ లేఖను రాసింది. ఎస్ఆర్ఎం నిర్మాణం 2016 నుంచి జరుగుతోందని, రూ. 580 కోట్లతో యూనివర్సిటీని నిర్మించగా, లేబర్ సెస్ కింద అందులో ఒక శాతం, అంటే 5.80 కోట్ల రూపాయలను యూనివర్సిటీ యాజమాన్యం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 71.72 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించిందని కలెక్టరుకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'గూగుల్' కోసం వడివడిగా భూసేకరణ

- అనంతరం డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- నేటి నుంచి రైతుల ఖాతాల్లో పరిహారం జమ

విశాఖపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్‌కు భూ సేకరణ ప్రక్రియ వడివడిగా సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే డేటా కేంద్రానికి శంకుస్థాపన జరగనుంది. మరోవైపు కేంద్రం ఏర్పాటు కోసం చట్టాల్లో కొన్ని మార్పులు కూడా చేయనున్నారు. ఇవన్నీ ఒక కొలిక్కి రాగానే శంకుస్థాపన ముహూర్తం ఖరారు కానుంది. వాస్తవానికి ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఇదిలావుంటే, దేశంలోని కాపీ రైట్ చట్టానికి సవరణలు చేయాలని గూగుల్ సంస్థ కోరింది. కృత్రిమ మేథ(ఏఐ)తో కూడిన హైపర్ స్కేల్ డేటా సెంటర్ నిర్మాణానికి గూగుల్ సన్నాహాలు చేస్తోంది. ఏఐ కోసం డేటాను వినియోగించుకుంటుంది. దీనికి దేశంలోని 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్-2023'లో కొన్ని అంశాలు మార్చాల్సి ఉందని గూగుల్ సూచించింది. కాపీ రైట్ యాక్ట్‌లో సెక్షన్ 52ని కూడా సవరించాల్సి ఉందని పేర్కొంది. ఏపీ ప్రభుత్వం ఈ సెక్షన్ సవరణకు ప్రతిపాదించాలని కేంద్రం సూచించగా ఇక్కడి అధికారులు ఆ మేరకు స్పందించారు.

తర్లువాడలో 308 ఎకరాలు

గూగుల్‌కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 588 ఎకరాలు ఇవ్వడానికి ప్రభుత్వం వడివడిగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా ఆనందపురం మండలం తర్లువాడలో 308 ఎకరాలు ఇస్తున్నారు. ఈ భూమిలోని 110 ఎకరాల్లో 51 మంది అసైన్డ్ పట్టాదారులు ఉన్నారు. మరో 88 ఎకరాల్లో ఆక్రమణదారులు ఉన్నారు. వారికి రిజిస్ట్రేషన్ విలువలో 50 శాతం సొమ్మును ఇస్తామని హామీ ఇచ్చారు. మిగిలింది ప్రభుత్వ భూమి. ఈ భూములు ఇవ్వడానికి 60 శాతం మంది రైతులు ముందుకు వచ్చారు. వారికి శనివారం పరిహారం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ భూములు కాకుండా అడవివరంలో 120, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 160 ఎకరాలు కేటాయించారు.

ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే విజయం తథ్యం

- మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి
- కుప్పం నియోజకవర్గంలో మూడో రోజు పర్యటన

కుప్పం/రామకుప్పం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతో ముందడుగేస్తే విజయం మహిళలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించారు. శాంతిపురం మండలం నడింపల్లె, రామకుప్పం మండలం ఆనిగానూరు గ్రామాల్లో మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. శాంతిపురం మండలంలో తుమ్మిశి పెద్ద చెరువు, రామకుప్పం మండలంలో విజలాపురం చెరువు వద్ద కృష్ణా జలాలకు భువనేశ్వరి హారతి ఇచ్చారు. అంతకు ముందు శాంతిపురం మండలం కడపల్లె నుంచి తుమ్మిశి పెద్ద చెరువు వరకు మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం ద్వారా పొందుతున్న లబ్ధి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం నుంచి కనమనపల్లె దాకా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కూడా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే ఎన్నో రకాల వృత్తులు, పనుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌలభ్యాన్ని దుర్వినియోగం చేసుకోకుండా... ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎదగడానికి వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని దుర్మార్గపు పాలన నుంచి విముక్తి చేసి ప్రజలకు సుపరిపాలన అందించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎన్నో త్యాగాలు చేశారని భువనేశ్వరి పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరికాయని, యువత భవిష్యత్తు ఈ మత్తులో ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.



విజలాపురం నుంచి రోడ్డు మార్గంలో వస్తుండగా స్కూలు విద్యార్థులను చూసి కారు దిగి ప్రేమగా వారిని పలకరిస్తున్న భువనేశ్వరి

మాటిచ్చారు... వచ్చారు!

- మహిళా కార్యకర్త ఇంటికి భువనేశ్వరి

నాలుగురోజుల కుప్పం పర్యటనలో భాగంగా సీఎం సతీమణి భువనేశ్వరి నియోజకవర్గం ప్రజలతో మమేకమవుతున్నారు. ఆమె మొదటిరోజు పర్యటనలో రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె వద్ద ఓ బీసీ మహిళ చేసిన అభ్యర్థనను మన్నించి, వాళ్ల ఇంటికి వస్తానని వాగ్దానం చేశారు. శుక్రవారం రాత్రి తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు. చెల్దిగానిపల్లెలోని పార్టీ కార్యకర్త లక్ష్మమ్మ ఇంటికెళ్లి వారిని సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తారు. భువనేశ్వరిని సాదరంగా స్వాగతించి, చీర సారెలను బహూకరించారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ కుటుంబసభ్యుల యోగక్షేమాలను భువనేశ్వరి విచారించారు. అల్పాహారం తీసుకుని తిరిగి వచ్చారు.



భువనేశ్వరికి సారె అందజేస్తున్న లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు

ఉత్తరాంధ్రలో..

మరమ్మతులు మధ్యలోనే వదిలేశారు

పార్వతీపురం మన్యం జిల్లాలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని రహదారుల మరమ్మతులు చేపట్టింది. అయితే ఆర్‌అండ్‌బీ శాఖ ఈ మరమ్మతులు పూర్తిగా చేయ లేదు. జిల్లాలో ముఖ్యమైన పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గుంతలమయమైంది. కొంత భాగం మరమ్మతులు చేపట్టి వదిలేశారు. మరమ్మతులు చేసిన చోట కూడా ఇటీవలి భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. ఇది అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వందలాది భారీ వాహ నాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయాల్లో రాకపోక లకు ఇబ్బందులు తప్పడం లేదు.



పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే రోడ్డు దుస్థితి



శ్రీకాకుళం సింహద్వారం ఫ్లైఓవర్ జంక్షన్ నుంచి కింతలికి వెళ్లే రోడ్డు దుస్థితి

శ్రీకాకుళం జిల్లాలో...

శ్రీకాకుళం జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గతంలో వైసీపీ అధికా రంలో ఉన్నప్పుడు తట్టెడు మట్టి కూడా వేయలేదు. శ్రీకాకుళం నుంచి ఆమ దాలవలస రోడ్డును పూర్తి చేయకపోవడంతో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ఎంతోమంది మరణించారు. కూటమి అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంది. రూ.58 కోట్లతో రోడ్డు పనులు ఎనభైశాతం పూర్తయ్యాయి. అయితే శ్రీకాకుళం నగరంలో బలగ, ఆదివారంపేట, కొత్తరోడ్డు జంక్షన్ వద్ద రోడ్డు రాళ్లుతేలి గోతులమయంగా మారింది. కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వీటిని సరిచేసి రోడ్డును పూర్తిచేయాలని రెండు పట్టణాల ప్రజలు కోరుతున్నారు.

విశాఖ నగరంలో..

విశాఖపట్నం నగరంలో రహదారులన్నీ మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఉన్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రహదారుల మధ్యలో తవ్వేసి నెలల తరబడి పూర్తి చేయకుండా వదిలేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పదునైన రాళ్లు పరిచేసి మిన్నకుంటున్నారు. పైపులైన్లు, కేబుళ్ల కోసం రహదారుల పక్కన గోతులు తవ్వి వాటిపై మట్టి పోసి వదిలేస్తున్నారు. ఆ తరువాత వాటిపైనే తారురోడ్డు వేస్తున్నారు. వారం రోజులకే అవి కిందికి దిగిపోతున్నాయి. సీతమ్మధార, హెచ్‌బీ కాలనీల్లో రహదారులే వీటికి నిదర్శనం. కాంట్రాక్టర్లు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు. నగర శివార్లలో ఆర్‌అండ్‌బీ రహదారులకు నిధుల సమస్య ఉంది. భీమిలి నుంచి కుమ్మరిపాలెం మీదుగా జాతీయ రహదారి(తాళ్లవలస)కి వెళ్లే మార్గంలో పదేళ్ల నుంచి ఎటువంటి పనులు చేపట్టలేదు. ఈ మార్గంలోనే అనేక విద్యా సంస్థలు ఉన్నాయి. మొత్తం 4.5 కి.మీ. ఉన్న ఈ మార్గంలో జీవీఎంసీ తన పరిధిలో కొంత రహదారి వేసి మిగిలినది విడిచిపెట్టింది. ఆనందపురం మండ లంలో జాతీయ రహదారి నుంచి రామవరం వెళ్లే రహ దారి నరకాన్ని తలపిస్తోంది.



ఇటీవల వర్షాలు కురిసినప్పుడు అనకాపల్లి జిల్లా చోడవరం సమీపంలోని వెంకన్నపాలెం వద్ద చెరువును తలపించిన రహదారి (ఫైల్ ఫొటో)

అధ్వానంగా బీఎన్ రోడ్డు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇటు మైదాన ప్రాంతాలకు, అటు ఏజెన్సీకి ప్రధానమైన భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. బీఎన్ రోడ్డు అభివృద్ధికి న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎడీబీ) నిధులు రూ.110 కోట్లతో చేపట్టిన పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో ఐదేళ్ల క్రితం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావ చ్చినా రోడ్డు అభివృద్ధి పనులకు అతీగతీ లేకుండా పోయింది. చివరకు కోర్టు నోటీసులు ఇచ్చినా పనులు చేయించలేకపోతున్నారు. వర్షం పడితే వాననీటితో చెరువులను తలపించే ఈ రహదారిలో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

దారి పొడవునా విధ్వంసం

భారీ వర్షాలు, తుఫాన్‌తో దెబ్బతిన్న రోడ్లు

గుంతలు పడటం, కొట్టుకుపోవడంతో ఇక్కట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో చాలా రహదారులు మళ్లీ అధ్వా నంగా తయారయ్యాయి. గుంతలు పడటం, కంకర కొట్టుకుపోవడంతో రోడ్లు ధ్వంసమ య్యాయి. కొన్ని చోట్ల అయితే మరీ దారు ణంగా ఉన్నాయి. పగటి పూటే వాహనదారు లకు చుక్కలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్రాంతికి ముందు రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. కొన్ని చోట్ల రోడ్ల నిర్మాణాలూ చేపట్టింది. దీంతో చాలా వరకు వాహనదారుల కష్టాలు తీరాయి. అయితే భారీ వర్షాలు, ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాలలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గ్రామీణ రహదా రులతో పాటు ప్రధాన నగరాలు-పట్టణాలను కలిపే రహదారులు కూడా ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల జాతీయ రహదారులపై గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతు న్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పరిస్థితిని 'ఆంధ్ర జ్యోతి' పరిశీలించింది. జిల్లాల వారీగా ప్రస్తుతం రోడ్ల దుస్థితి ఇదీ...

సీమలో..

అనంతలో ప్రయాణం నరకం



అనంతపురం జిల్లా పామిడి పెన్నానది సమీపంలో బ్రిడ్జిపై గుంతలు.. కర్రకు రంగుల పట్ట కప్పి.. ప్రమాద హెచ్చరిక బోర్డు

అనంతపురం జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రహ దారులు అధ్వానంగా మారాయి. అనంతపురం-హైదరాబాద్ జాతీయ రహదారి-44.. గార్లదిన్నె మండలం కల్లూరు, రామదాసు పేట, గుడ్డాలపల్లి, తలగాసిపల్లి గ్రామాల వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పామిడి వద్ద పెన్నానది బ్రిడ్జిపై గుంతలు పడ్డాయి.

- గుత్తి నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో దెబ్బతింది. కంకరతేలి గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై గోతులను పూడ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. రూ.2 కోట్లతో గుంతల్లో డస్ట్ నింపి వదిలేశారు. దీంతో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

నంద్యాల జిల్లాలో...

నంద్యాల జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ, పంచా యతీ రాజ్‌శాఖ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా మరింత దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్‌అం డ్‌బీ రోడ్లు 120 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. బనగానపల్లె, ఆళ్ల గడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లో రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నాయి. కొలిమిగుండ్ల సమీపంలోని అంకిరెడ్డిపల్లి వద్ద రెండు వంతెనలు దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 32.85 కిలోమీటర్ల మేర రోడ్లు, 12 వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. చాగలమర్రి, ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లో రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి శాశ్వత, తాత్కాలిక మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు నుంచి మిడుతూరుకు వెళ్లే ప్రధాన రహదారి దెబ్బతిన్న దృశ్యం

అన్నమయ్య జిల్లాలో...



అన్నమయ్య జిల్లా మదనపల్లె-బెంగళూరు ప్రధాన రహదారిలో పెద్దగుంతలు

అన్నమయ్య జిల్లాలో మదనపల్లె-బెంగళూరు ప్రధాన మార్గంలో చాలా చోట్ల గుంతలు పడ్డాయి. నక్కలదిన్నె, చిప్పిలి, కూకట్మానుగడ్డ, బార్లపల్లె, చీకలబైలు వరకు.. పది కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు వరకు అంతరాష్ట్ర రోడ్డు గుంతలమయమైంది. వీటిని ఎప్పటికప్పుడు పూడ్చక పోవడంతో.. వర్షాలతో అవి మరింత పెద్దగా తయార య్యాయి. బెంగళూరు నుంచి నిత్యం వచ్చే వాహనాలు పగటి పూటే తరచూ ప్రమాదాల బారినపడుతున్నాయి. రాత్రి వేళ చెప్పాల్సిన పని లేదు. ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

రహదారులపై విపత్తుల పగ!

(మొదటి పేజీ తరువాయి)

మారాయి. ప్రభుత్వం తక్షణమే రూ.1700 కోట్లు ఖర్చుపెడితేనే దారులు గాడిన పడతాయి. శాశ్వత ప్రాతిపదికన మరో రూ.6150 కోట్లు వ్యయం చేస్తే తప్ప ధ్వంసమైన రోడ్లు పూర్తిస్థాయిలో ప్రజలకు అందు బాటులోకి వచ్చే అవకాశం లేదు.

రోడ్లకు పాతరేసిన జగన్...

రాష్ట్ర ప్రభుత్వం ఏటా 8 వేల కిలో మీటర్ల రహదారుల నిర్వహణ చేపట్టాలి. ఇందుకోసం ఏటా రూ.2వేల కోట్లపైనే ఖర్చవుతుంది. కానీ, జగన్ సర్కారు రహదారుల నిర్వహణను పూర్తిగా వదిలేసింది. దీంతో రహదారుల పరిస్థితి ఘోరంగా మారింది. వర్షాలు, తుఫానులకు రోడ్లు దెబ్బతినడం ఒక ఎత్తయితే, నిర్వహణ లేక గోతులు పడి ఘోరంగా ధ్వంసం కావడం మరో ఎత్తు. రహదారుల నిర్వహణకు కేంద్రం నాలుగు పథకాల కింద ఇచ్చిన రూ.3200 కోట్లను కూడా జగన్ సర్కారు దారిమ ళ్లించింది. దీంతో పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 2023లో బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ.2 వేల కోట్ల అప్పు తెచ్చి 2800 కిలోమీటర్ల పరిధిలో గుంతలు పూడ్చే పనులు చేప ట్టారు. అది కూడా వాహనదారులు పెట్రోల్, డీజిల్‌పై ప్రభుత్వానికి చెల్లించే 2 రూపాయల రహదారి భద్రత సెస్‌ను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకొచ్చారు. ఆ రుణంతో వేసిన రహదారులు ఎనిమిది నెలలు కూడా ఉండలేదు. ఆర్‌ఐడీఎఫ్, ఎన్డీబీ, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఇతర స్కీమ్‌ల కింద ఐదేళ్లలో రూ.12వేల కోట్లపైనే వచ్చాయి. వాటిని జగన్ సర్కారు రోడ్లపై కన్నా ఇతర బటన్ నొక్కుడు పథకాలపై ఖర్చుపెట్టింది.

నేడు విపత్తుల పగ...

కూటమి సర్కారు వచ్చే నాటికి ఆర్‌అండ్‌బీలో కాంట్రాక్టర్లకు చెల్లించే బకాయిలు రూ.2300 కోట్లు ఉన్నాయి. ఇక కొత్త పనులు చేయడానికి, రహదారుల నిర్వహణకు ఆర్‌అండ్‌బీ వద్ద దమ్మిడి కూడా లేదు. రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్డీసీ) నిధులు కూడా ఖాళీ అయ్యాయి. అయినప్పటికీ కూటమి సర్కారు రహదారుల నిర్వహణకు తొలి ప్రాధా న్యత ఇచ్చింది. ఇతర స్కీమ్‌లు, పద్దుల కింద ఉన్న నిధుల్లో నుంచి 2000 కోట్లు ఆర్‌అండ్‌బీకి ఇచ్చింది. ఏడాది కాల వ్యవధిలో 7800 కిలోమీ టర్ల పరిధిలో గుంతలను పూడ్చేసింది. బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం భరోసా ఇచ్చిన తర్వాతే... కాంట్రాక్టర్లు ఈ పనులు చేసేం దుకు ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు 1600 కోట్లపైనే పాత బకాయి లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్లు ఆర్‌అండ్‌బీ వర్క్‌లు చేసేందుకు మళ్లీ ఆసక్తిచూపుతున్నారు. ప్రభుత్వం ఏడాదంతా కష్టపడి రహదారులపై గుంతలు పూడుస్తున్న క్రమంలోనే... రాష్ట్రంలో జూలై నుంచి కురిసిన భారీ వర్షాలకు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. వర్షాల కారణంగా సెప్టెంబరు వరకు 1800 కిలోమీటర్ల మేర జిల్లా ప్రధాన, రాష్ట్ర ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. వాటిపై గుంతలు పూడ్చి ప్రయాణాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం 670 కోట్లు ఖర్చుచేసేందుకు టెండర్‌లు పిలిచింది. వర్క్‌లు కూడా జరుగుతున్న దశలో మళ్లీ మొంథా తుఫాను విరుచుకుపడింది. దీని దెబ్బకు రాష్ట్రంలో మరో 31వేల కిలోమీటర్ల గ్రామీణ, జిల్లా, రాష్ట్ర ప్రధాన రహదారులు... 3388 వంతెనలు ధ్వంసం అయ్యాయి. 838 వంతెనలు మరమ్మతులకు సాధ్యంకానంతగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు తాత్కాలికంగానే రూ.1700 కోట్లు ఖర్చవుతుందని ఆర్‌అండ్‌బీ ప్రభుత్వా నికి నివేదించింది. 4229 కిలోమీటర్ల రోడ్లు మరమ్మతులకు కూడా వీలు కానంతగా ధ్వంసమయ్యాయి. వాటి పునర్ నిర్మాణానికి కనీసం రూ.2300 కోట్లు కావాలని ఆర్‌అండ్‌బీ సర్కారుకు ఇచ్చిన నివేదికలో వెల్ల డించింది. మరమ్మతులకు వీలుకానంతగా దెబ్బతిన్న వంతెనల నిర్మాణా నికి మరో 3,850 కోట్ల నిధులు అవసరమని పేర్కొంది. దీనికి 16వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకోవాలని ఆర్‌అండ్‌బీ ప్రతిపాదించింది

రోడ్లపై ఖర్చుకు వెనుకాడం

'రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఉండాలన్నది మా ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు గుంతలు, ప్యాచ్‌లు పూడ్చే పనులకు 2వేల కోట్లు ఖర్చు చేశాం. మరో 2500 కోట్లతో జిల్లాల్లో కొత్త రహదారుల నిర్మాణంకోసం టెండర్లు పిలుస్తాం. జగన్ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఎన్డీబీ వర్క్‌లను పునరుద్ధరిస్తాం. ఇటీవలే కాంట్రాక్టర్లతో సమావేశమై... పనులు ప్రారంభించాలని కోరాం. వర్షాలు, తుఫానులతో ధ్వంసమైన రహదారుల మరమ్మతులు, నిర్వహణకోసం నిధులు సమీకరిస్తాం. కేంద్రానికి నివేదికలు పంపించాం. విపత్తు సహాయ నిధి నుంచి వచ్చే డబ్బుతో రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపడతాం.'

- బీసీ జనార్దన్ రెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి

కోస్తాంధ్రలో..

ప్రకాశం జిల్లాలో ధ్వంసమైన రోడ్లు

ప్రకాశం జిల్లాలో రహదారులు దారుణంగా తయార య్యాయి. ఎటుచూసినా గుంతలతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పంచాయతీరాజ్, ఆర్‌అం డ్‌బీ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇటీవల జిల్లాను ముంచెత్తిన మొంథా తుఫాన్ రోడ్లను ధ్వంసం చేసింది. అధి కారుల అంచనా ప్రకారం జిల్లాలో సుమారు రూ.180.66 కోట్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు, రూ.70.41 కోట్ల మేర పీఆర్ రోడ్లు దెబ్బ తిన్నాయి. వెరసి.. దాదాపు రూ.251.76 కోట్ల మేర నష్టం వాటి ల్లింది. వైపాలెం నుంచి త్రిపురాంతకం వెళ్లే రోడ్డు, దోర్నాల నుంచి ఆత్మకూరు నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి వెళ్లే రోడ్డు, మార్కాపురం నుంచి తర్లుపాడు వెళ్లే రోడ్డు, బేస్తవారపేట నుంచి కోనపల్లి వెళ్లే రోడ్డు, కడప- విజయవాడ రహదారిలో పలు చోట్ల, దర్శి నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో చిలకలేరు ప్రాంతంలో, ఒంగోలు-చీ రాల జాతీయ రహదారిపై త్రోవగుంట నుంచి ఉప్పుగుండూరు వరకు, ఒంగోలు- పొదిలి రోడ్డులో గ్రానైట్ క్వారీల ప్రాంతంలో దెబ్బతిన్నాయి. జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.



ప్రకాశం జిల్లాలో ముండ్లమూరు-వేంపాడు మధ్య దెబ్బతిన్న దర్శి-అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారి

ఆంధ్రజ్యోతి విజిట్



బాపట్ల జిల్లాలో బాపట్ల మండల పరిధిలోని మూలపాలెం-జిల్లెళ్లమూడి రోడ్డు దుస్థితి

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో రహదారుల మరమ్మతు పనులను ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. కేటాయించిన వాటిల్లో 70 శాతం పనులు పూర్తి చేసినా బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో పనులు సాగడం లేదు. జిల్లా వ్యాప్తంగా 108 పనులకు గాను రూ.31 కోట్లను ప్రభుత్వం గతే డాది చివరిలోనే కేటాయించింది. వీటికి సంబంధించిన పనులకు గాను రూ.27 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా విరుచు కుపడిన మొంథా తుఫాన్‌తో రహదారులు మరింతగా ఛిద్రమ య్యాయి. గ్రామీణ రహదారులు 147 కిలోమీటర్ల మేర దెబ్బతినగా, రూ.139 కోట్ల వరకు నష్టం వాటిల్లింది. ఆర్‌అండ్‌బీ రహదారులు 152 కిలోమీటర్ల మేర దెబ్బతినగా, రూ.139 కోట్ల నష్టం వాటిల్లింది.

పల్నాడు జిల్లాలో...

పల్నాడు జిల్లాలో కూటమి ప్రభుత్వం ఒకసారి రహదారులపై గోతు లను పూడ్చివేసింది. రెండు విడతల్లో రూ.29.55 కోట్ల వ్యయంతో పనులు చేశారు. అయితే బిల్లులు రూపాయి కూడా విడుదల చేయలేదు. మొంథా తుఫాను ప్రభావంతో రోడ్లు మళ్లీ దెబ్బతిన్నాయి. నరసరావుపేట బైపాస్, సత్తెనపల్లి, గురజాల, పెదకూరపాడు, చిలకలూరిపేట, వినుకొండ నియో జకవర్గాల పరిధిలో రహదారులు పాడయ్యాయి. జిల్లాలో రూ.18.40 కోట్ల వ్యయంతో ఐదు రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. కొండ్రముట్ల-బండమోదు-దుర్గి, నకరికల్లు-గురజాల రహదారి, మాచర్ల-వీపీ సౌత్, గుంటూరు-అమరావతి రహదారి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. కాగా టెండర్లు దాఖలు చేసేం దుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. బకాయిలు విడుదల చేస్తేనే టెండర్లు దాఖలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



167ఏ జాతీయ రహదారిపై పల్నాడు జిల్లా రావిపాడు వద్ద ఏర్పడిన గుంతలు



గుంతలు తప్ప రోడ్డు లేని గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు

గుంటూరు జిల్లా రోడ్లు అధ్వానం

గుంటూరు జిల్లాలో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రభుత్వం గతేడాది తాత్కాలిక మరమ్మతులు చేసింది. పూర్తి స్థాయిలో రోడ్లు వేయలేదు. జిల్లాలోని పలు ప్రధాన రహదారులు మళ్లీ దెబ్బతిన్నాయి. గుంటూరు-చీరాల రాష్ట్ర రహదారి, గుంటూరు-ప ర్చూరు, గుంటూరు-నందివెలుగు-తెనాలి, మంగళగిరి-తెనాలి, తాడి కొండ-కంతేరు-ఎస్‌హెచ్-16 రహదారులు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణమంటే ప్రాణాలతో చెలగాటమే అన్న ట్లుగా మారింది పరిస్థితి. విభజిత గుంటూరు జిల్లాలో 227 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయి. మొంథా తుఫాను కారణంగా జిల్లాలో 20 రోడ్లు దెబ్బతిన్నాయి. గుంటూరు నగరంలో అన్ని రహదా రులు గుంతలమయమై అస్తవ్యస్తంగా ఉన్నాయి.

కోనసీమ జిల్లాలో...

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల కురిసిన భారీవ ర్షాలు, తుఫాన్ ప్రభావం వల్ల రహదారులన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. భారీ గుంతలు పడటం, రోడ్లు ఛిద్రం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తుఫాను సమయంలో 31.7 కిలోమీటర్ల పంచాయతీ రాజ్ రహదారులు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా 90 కిలోమీటర్ల తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల్లో రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. అమలాపురం-ముక్కామల కెనాల్ రోడ్డు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మలికిపురం గుడిమెళ్లంక వంతెన నుంచి చింతల పల్లి కళింగల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి చాలా అధ్వానంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో చాలా రహదారుల పరిస్థితి ఇలాగే ఉంది. ముమ్మిడివరం-ముక్తేశ్వరం ఆర్‌అండ్‌బీ రోడ్డు బాగా దెబ్బతింది. 9.8 కిలో మీటర్లు గల ఈ రోడ్డును 8.7 కిలో మీటర్ల మేర ఆధునికీకరణకు రూ.2.15 కోట్లు మంజూరైంది.



కోనసీమ జిల్లా విశ్వేశ్వరాయపురం-లక్కవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



తాడేపల్లిగూడెం నుంచి బాదంపూడి రోడ్డులో పడాల ముత్యాలంబాపురం మధ్య గోతులు

తాడేపల్లిగూడేనికి హైటెక్ బస్సులు బంద్

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోకి ప్రైవేటు, ఆర్టీసీ హైటెక్ బస్సులు రావడం లేదు. రోడ్డు దెబ్బతినడంతో పట్టణానికి రాకుండా జాతీయ రహదారిపై వెళ్లిపోతున్నాయి. బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం రోడ్డు అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించినా ఇటీవల కురిసిన వర్షాలకు తిరిగి గోతులు పడ్డాయి. ఇటీవలే బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మించేందుకు రూ.4.9 కోట్లు మంజూరు చేశారు. తాడేపల్లిగూడెం అనుసంధాన రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు.

'అందరినీ ప్రేమించు-అందరినీ సేవించు' నినాదం.. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ విశేష కార్యక్రమాలు

తల్లి సూచనలతో సేవా మార్గం పట్టిన సత్యసాయి.. ఉచిత విద్య, వైద్యం, తాగునీటి పథకాలు ప్రారంభం


ప్రభుత్వంతో సమానంగా అనేక ప్రాజెక్టులు.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక చికిత్సలు

140 దేశాల్లో 'సేవాదళ్' కార్యక్రమాలు.. ప్రకృతి విపత్తుల సమయంలో ఆసరా

వినూత్న బోధనకు 'విద్యా వాహిని' ప్రాజెక్టు.. సాయి శివైక్యం తర్వాతా నిరాటంకంగా సేవలు

బాబా శతజయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

సత్యసాయి బాబా... అనేక మందికి సాక్షాత్ దైవ స్వరూపుడు! భక్తుల దృష్టిలో... మహా మహిమాన్వితుడు! నమ్మిన వారికి... నర నారాయణుడు! ఎవరేమన్నా... ఏమనుకున్నా... అందరూ అంగీకరించే విషయం ఒకటుంది! అదే... పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా సేవా తత్పరుడు! అది ఎల్లలు దాటిన సేవా సముద్రం! రేపు సాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయన సంస్థల ద్వారా జరుగుతున్న సేవా కార్యకలాపాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...



సాయి సేవా సముద్రం!

(పుట్టపర్తి - ఆంధ్రజ్యోతి)

'అందరినీ ప్రేమించు! అందరినీ సేవించు'... ఇదే పుట్టపర్తి శ్రీసత్యసాయి సూత్రం! కులం, మతం, ప్రాంతం, విశ్వాసాలతో సంబంధంలేకుండా... అవసరార్థులందరినీ ఆదరించే తత్వం! విద్య, వైద్యం, తాగునీరు, ప్రజా సంక్షేమం, జంతు సంక్షేమం... ఇలా అనేక రంగాల్లో ఒక ప్రభుత్వంతో సమానంగా సేవలు అందించిన అనితర సాధ్యం! దీనంతటికీ మూలం... 'సత్యసాయి సెంట్రల్ ట్రస్టు'! సేవే పరమావధిగా 1972లో సత్యసాయి దీనిని స్థాపించారు.

అమ్మ మాట.. సేవలకు బాట

సత్యసాయి సేవల వెనుక ఆయన తల్లి ఈశ్వరమ్మ కోరిక, సూచనలు ఉన్నాయి. 1950 దశకంలో పుట్టపర్తి కుగ్రామం. ఆరోగ్యం, విద్య, తాగునీరు వంటి మౌలిక వసతులేవీ లేవు. ప్రజల కష్టాన్ని చూసి సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ చలించిపోయారు. గ్రామప్రజలకు వైద్యం, విద్య, నీటి సదుపాయాలు కల్పించాలని కుమారుడు సత్యసాయి బాబాకు సూచించారు. అమ్మ అడిగిన వెంటనే 1956లో సత్యసాయి పుట్టపర్తిలో చిన్న ఆస్పత్రిని ప్రారంభించారు. అది అంచెలంచెలుగా జనరల్ ఆస్పత్రి స్థాయికి చేరింది. 1991 నవంబరు 22న పుట్టపర్తి సమీపంలో శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో 2001లో 333 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఇవి కాకుండా పల్లె జనం ముంగిటే వైద్య సేవలు అందించేందుకు 2006 మార్చి 30న మొబైల్ ఆస్పత్రులను ప్రారంభించారు. వీటి ద్వారా పుట్టపర్తి సహా చుట్టుపక్కల ఏడు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి.



సత్యసాయితో సేవాదళ్ కార్యకర్తలు

'సూపర్' స్పెషాలిటీ...

సత్యసాయి ఆధ్వర్యంలో దక్షిణాసియాలోనే అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పుట్టపర్తిలో నిర్మితమైంది. ఇక్కడ అన్ని రకాల వైద్య చికిత్సలూ ఉచితం! ఇందులో నవజాత శిశువుల (నియో నాటల్)తో మొదలుకుని... దంతాలు, నేత్రాలు, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గుండె, యూరాలజీ, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ తదితర అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు ఇందులో ఉన్నాయి. వివిధ విభాగాల్లో రోబోటిక్ సర్జరీలు కూడా జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 110 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వైద్యసేవలకు వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా... వారి మాతృభాషల్లోనే వివరాలు అందించే అనువాదకులూ ఇక్కడ ఉంటారు. జాతీయస్థాయి వైద్య సదస్సులకు కూడా ప్రశాంతి నిలయం ఎన్నో సార్లు వేదికగా మారింది.

సరస్వతీ సేవలో...

1950లో పుట్టపర్తిలో సత్యసాయి చిన్న పాఠశాలను ప్రారంభించారు. ఇది అంచెలంచెలుగా ఎదుగుతూ... 1981 నాటికి శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల, హయ్యర్ లెర్నింగ్ కాలేజీ, బెంగళూరులో బృందావనం కాలేజీ, అనంతపురంలో మహిళా క్యాంపస్, కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ వద్ద ముద్దనహళ్లిలో మరో కళాశాల... ఇలా సత్యసాయి సెంట్రల్ ట్రస్టుద్వారా అనేక విద్యా సంస్థలు నడుస్తున్నాయి. గత 45 ఏళ్లుగా సత్యసాయి యూనివర్సిటీ ద్వారా వేలాది మంది డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు.



140: ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల్లో 7.5 లక్షల మంది సత్యసాయి సేవాదళ్ కార్యకర్తలు వివిధ రకాల సేవలు అందిస్తున్నారు.

102: దేశవిదేశాల్లో 102 విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటీ, జనరల్, మొబైల్ ఆసుపత్రుల్లో ఉచిత విద్య, వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

30 లక్షలు: ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని 1600 గ్రామాల పరిధిలో 30 లక్షల మందికి సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.

కోటి: సాధారణ వైద్యం నుంచి శస్త్రచికిత్సల దాకా ఇప్పటిదాకా కోటి మంది సత్యసాయి ఆస్పత్రుల్లో సేవలు అందుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా సేవాదళ్..

'మానవ సేవే మాధవ సేవ'... అంటూ సత్యసాయి తన భక్తులను సైతం సేవా మార్గంలో నడిపించారు! దీనికోసం 1960 మార్చి 29న ప్రత్యేకంగా 'సేవాదళ్' ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. విద్య, వైద్యం, పారిశుధ్య సేవలతోపాటు... వరదలు, సునామీ, భూకంపాల వంటి విపత్తులు వచ్చినప్పుడు సేవాదళ్ కార్యకర్తలు రంగంలోకి దిగి బాధితులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. 'నారాయణసేవ' పేరిట అన్నదానం, నిరాశ్రయులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నారు.



'సత్యసాయి విద్యా వాహిని' ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా బాబాతో రతన్ టాటా

దాహార్తి తీర్చిన సత్యసాయి

అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాలు ఎడారి ఛాయలకు దగ్గరైన రోజులవి. తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీన్ని గుర్తించిన సత్యసాయి... నాటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 1995 నవంబరు 23న రూ.380 కోట్లతో వాటర్ ప్రాజెక్టును ప్రారంభించారు. దీని ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 750 గ్రామాలకు దాదాపు 2వేల కిలోమీటర్ల పైపులైన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ ఈ పథకం అమలవుతోంది. 'సత్యసాయి గంగ' పేరుతో చెన్నై ప్రజలకు తాగునీరు అందుతోంది. సత్యసాయి తాగునీటి పథకంలో 558 మంది పని చేస్తున్నారు.

విలువలతో కూడిన సృజనాత్మక విద్య

దేశంలోని ప్రతి విద్యార్థికి విలువలు, సాంకేతికతో కూడిన విద్య అందాలనేది సత్యసాయి ఆకాంక్ష. దీనికోసమే తన 85వ పుట్టిన రోజున 'సత్యసాయి విద్యా వాహిని' ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. దీనికి తమ టీసీఎస్ సంస్థ నిరంతరం సహకరిస్తుందని రతన్ టాటా అదే రోజున సత్యసాయి సమక్షంలో ప్రకటించారు. ఈ ప్రాజెక్టును పూర్తిగా వలంటీర్లతో నిర్వహిస్తారు. క్లాస్‌రూం, కారిడార్, క్యాంపస్, కమ్యూనిటీకి అత్యంత ప్రాధాన్యమిస్తారు. ఇందులో సమానత్వాన్ని పెంపొందించే ప్రేరణాత్మక కంటెంట్ తయారు చేసి... డిజిటల్, మల్టీ మీడియా ద్వారా విద్యార్థులకు ఆసక్తికరమైన విధానంలో అందిస్తారు. విద్యా వాహిని ద్వారా 10 లక్షల మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు లబ్ధి పొందుతున్నారు. మూడు వేల మాస్టర్ లెసన్ ప్లాన్‌లు, 33 వేల డిజిటల్ అసెట్లు, 5 లక్షలకు పైగా దీక్షా లెర్నింగ్ లెసన్స్ ఇందులో అందుబాటులో ఉన్నాయి.

నిరంతర సేవా ప్రవాహం...

పుట్టపర్తి సత్యసాయి బాబా 2011 ఏప్రిల్ 24న శివైక్యం అయ్యారు. ఇప్పటికి 15 ఏళ్లు గడిచినా ఆయన ప్రారంభించిన సేవలకు ఎక్కడా అంతరాయం ఏర్పడలేదు. పైగా మరింత విస్తరిస్తున్నాయి. విద్య, వైద్య సేవలను ఆధునికీకరించారు. అధునాతన సాంకేతికతను ప్రవేశపెట్టారు. వైద్య సేవల్లో ఆధునిక పరికరాలు, రోబోటిక్ యంత్రాలను వినియోగంలోకి తెచ్చారు. వైద్య సిబ్బందిని పెంచుకుంటూ పోతున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవలను పారదర్శకంగా అమలు చేస్తున్నారు. సాయి పిలుపు మేరకు ఆయన భక్తులు అందించిన, ఇప్పటికీ అందిస్తున్న విరాళాలు... నిపుణుల స్వచ్ఛంద సేవలే దీనికి ఆధారం!



కొత్తచెరువు మండలంలో వైద్య సేవలు అందిస్తున్న సత్యసాయి మొబైల్ హాస్పిటల్

సత్యసాయి ప్రేమతత్వం విశ్వవ్యాప్తం

- కొనియాడిన మహారాష్ట్ర సీఎం, ఒడిశా గవర్నర్
- ముగిసిన సేవాదళ్ అంతర్జాతీయ సదస్సు



సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వం విశ్వవ్యాపమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొనియాడారు. సత్యసాయి దివ్య సన్నిధానం ప్రతిచోటా వెలిగిపోతోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శతజయంతి వేడుకల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీసత్యసాయి అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి బోధించిన 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే నినాదాన్ని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఆచరిస్తున్నారని అన్నారు. ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి ప్రేమతత్వాన్ని తాను వెంట తీసుకువెళుతున్నానని అన్నారు. సత్యసాయి మానవతా దీప్తి అని, నిస్వార్థ సేవలకు ప్రతిరూపమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. సత్యసాయి మానవ రూపంలో ఉన్న ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక దైవమని రాజ్యసభ సభ్యుడు అశోక్‌చవాన్ కొనియాడారు. కాగా, సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు వచ్చి భక్తులతో ప్రశాంతి నిలయం కోలాహలంగా మారింది. సాయికుల్వంతు మందిరం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారు. వేడుకలకు హాజరైన భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణసేవను అందించారు.

నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శనివారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి రానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్య మంత్రి చంద్రబాబు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుని వారికి స్వాగతం పలుకుతారు. రాష్ట్రపతి ఉదయం 11గంటలకు ప్రశాంతి నిలయంలో జరిగే సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొని, 12.20 గంటలకు తిరుగు పయనమవుతారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మధ్యాహ్నం 3.40 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి రాత్రికి ఇక్కడే బసచేసి, ఆదివారం జరిగే సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొంటారు.

శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి, సీఎం

శ్రీసత్యసాయి యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవం శనివారం జరగనుంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు మందిరంలో చాన్సలర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో 546 మంది విద్యార్థులకు పట్టాలు, 18 మందికి పీహెచ్‌డీలు, 20 మందికి బంగారు పతకాలను అందిస్తారు.

మహనీయుడు సత్యసాయి: మంత్రి దుర్గేశ్

సామాజిక సేవకు, మానవ సంక్షేమానికి ఆధ్యాత్మికతను సాధనంగా మలిచిన మహనీయుడు సత్యసాయి అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి వంద కిలోల సత్యసాయి బాబా పుట్టిన రోజు కేకును మంత్రి శుక్రవారం కట్ చేశారు. సత్యసాయి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు నాగానందం, చక్రవర్తి పాల్గొన్నారు.

చేయాల్సిన అన్యాయమంతా చేసి..!



- రాజకీయ లబ్ధి కోసమే బాబుపై జగన్ నిందలు
- ఆల్మట్టి ఎత్తును నాడు చంద్రబాబు అడ్డుకున్నా మాజీ సీఎం దాచిపెట్టారు
- తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు కడుతున్నా కిమ్మనలేదు
- సాగునీటి నిపుణుల ధ్వజం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల చరిత్రపై ఎలాంటి అవగాహనా లేకుండా, తన హయాంలో రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి చేయాల్సిన అన్యాయమంతా చేసిన జగన్.. ఇప్పుడు కృష్ణా ట్రైబ్యునల్‌లో సరైన వాదనలు వినిపించడం లేదని సీఎం చంద్రబాబుపై నిందలేయడంపై సాగునీటి రంగ నిపుణులు మండిపడ్డారు. రాజకీయ లబ్ధికోసమే లేఖ రాశారని ధ్వజమెత్తారు. 1996లో ఆల్మట్టి ఎత్తును పెంచేందుకు కర్ణాటక ప్రయత్నాలు చేయడంపై నాడు యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రం ఈ అంశంపై జోక్యం చేసుకుని పెంపును అడ్డుకోవాలని కోరుతూ ఉమ్మడి ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. దరిమిలా దీనిపై అధ్యయనానికి 1996 ఆగస్టు 11న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బిహార్, అసోం సీఎంలతో దేవెగౌడ కమిటీని వేశారు. ఆ మర్నాడే కమిటీ సమావేశమై ఈ నాలుగు రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్లతో సాంకేతిక కమిటీని నియమించింది. ఈ కమిటీ 1997 జనవరిలో ఆల్మట్టి ఎత్తు 519.6 మీటర్లు చాలని, పెంచాల్సిన అవసరం లేదంటూ సీఎంల కమిటీకి నివేదిక అందజేసింది. ఈ కమిటీ సిఫారసు మేరకే ఆల్మట్టి ఎత్తు పెంచే ప్రతిపాదన నిలిచిపోయింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు తీసుకున్న చొరవను దాచిపెట్టి.. ఎత్తు పెంచుతున్నా పట్టించుకోలేదంటూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టించేలా జగన్ అబద్ధమాడారు' అని విమర్శించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడే 2021లో కృష్ణా జలాల పంపకం బాధ్యతను ట్రైబ్యునల్-2కి అప్పగిస్తూ కేంద్రం విధివిధానాలను ప్రకటించిందని.. ఆ ఏడాది అక్టోబరు 6న ఆయన ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు.. విధివిధానాల ప్రకటనపై ఎందుకు అభ్యంతరం చెప్పలేదని నిలదీశారు. అలాగే అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌తో కలిసి ఆయన నాటి జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో సమావేశమైనప్పుడు కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాకుండా అన్యాయం చేశారని విరుచుకుపడ్డారు. తెలంగాణలో అక్రమంగా ప్రాజెక్టులు చేపట్టినా కిమ్మనలేదని గుర్తుచేశారు. అన్నిటికీ మించి.. 2023లో తెలంగాణ ఎన్నికల పోలింగ్‌కు ముందు రోజు తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టి కేసీఆర్‌కు లబ్ధి చేకూర్చేందుకు.. నాగార్జునసాగర్ డ్యాంపైకి ఏపీ పోలీసు బలగాలను పంపారని తెలిపారు. ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి.. ట్రైబ్యునల్‌లో వాదనలెలా ఉండాలో సలహాలివ్వకుండా.. రెచ్చగొట్టే ధోరణిలో సీఎంకు లేఖ రాయడం ఏమిటని నిపుణులు విమర్శించారు.

మన వాటా ఒక్క టీఎంసీ తగ్గినా.. చంద్రబాబుదే బాధ్యత

- ముఖ్యమంత్రికి జగన్ లేఖ

కృష్ణా జలాల్లో రాష్ట్రవాటా 512 టీఎంసీల్లో ఒక్క టీఎంసీ తగ్గినా అందుకు టీడీపీ, సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ స్పష్టం చేశారు. నీటి పంపకంపై కృష్ణా జల వివాద ట్రైబ్యునల్-2 విచారణ నేపథ్యంలో శుక్రవారం ఆయన చంద్రబాబుకు ఓ లేఖ రాశారు. ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరఫున సమర్థ వాదనలు వినిపించడం లేదని ఆరోపించారు. దీనివల్ల కృష్ణాజలాల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. మరోవైపు కర్ణాటక ఆల్మట్టి డ్యాంను 524.25 మీటర్లకు పెంచుతోందని.. దీనివల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా నిలబడినందునే.. కృష్ణా బోర్డు, దాని పరిధి విధివిధానాలపై 2023 జూలై 15న కేంద్రం గెజిట్ జారీ చేసిందన్నారు.

దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాల్లేవు

- వారు తమ వద్ద ఉన్నారని ఉన్నతాధికారులు చెప్పలేదు
- అందుచేత జోక్యం చేసుకోలేం: హైకోర్టు
- ఆధారాలు లభిస్తే కోర్టుకు రావచ్చంటూ పిటిషనర్లకు వెసులుబాటు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మూసివేసింది. వీరిద్దరూ పోలీసుల నిర్బంధంలో ఉన్నారని నిరూపించేందుకు ప్రాథమిక ఆధారాలు లేనందున ప్రస్తుత వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఆధారాలు లభిస్తే కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ సి.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ జి.తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దేవ్‌జీ, రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపరచాల్సిందిగా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దేవ్‌జీ తమ్ముడు తిప్పిరి గంగాధర్,రాజిరెడ్డి కుమార్తె స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్‌వేశారు. దీనిపై గురువారం విచారణకు జరిపిన ధర్మాసనం.. వారిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నారని నిరూపించే ఆధారాలుంటే.. కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. శుక్రవారం వ్యాజ్యం మరోసారి విచారణకురాగా పిటిషనర్ల తరఫు న్యాయవాది యు.జైభీమారావు వాదనలు వినిపించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలు, చానళ్లలో ప్రసారమైన వీడియోలను పెన్‌డ్రైవ్‌లో కోర్టు ముందు ఉంచామని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ప్రెస్‌మీట్ వీడియోను కోర్టు పరిశీలనకు ఉంచామని .పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి.విష్ణుతేజ అన్నారు. ముఖ్య నేతల భద్రతాసిబ్బంది 9మంది అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పారు తప్ప దేవ్‌జీ, రాజిరెడ్డి గురించి ప్రస్తావించనేలేదన్నారు. వీడియోలను పరిశీలించిన ధర్మాసనం కూడా ఇదే నిర్ధారించింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం..

- 15న విజయవాడలో అదుపులోకి.. మరికొందరితో కలిపి హత్యచేసిన ఎస్ఐబీ పోలీసులు
- టెక్ శంకర్ సహా మరికొందరినీ హత్య చేశారు
- రేపు నిరసన దినం పాటించాలని మావోయిస్టుల పిలుపు

హైదరాబాద్/మంథని/చర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజే పలువురిని పట్టుకొని తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'కొందరు ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఈనెల 15న విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరాయుధులైన హిడ్మా, రాజేతోపాటు మరికొందరిని కేంద్ర హోంశాఖ డైరెక్షన్‌లో ఏపీ ఎస్ఐబీ పోలీసులు పట్టుకున్నారు. హత్య చేసి మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు. ఆయుధాలు దొరికాయని, ఆరుగురు చనిపోయారని ప్రకటించడం అబద్ధం. ఏవోబీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టెక్ శంకర్‌తోపాటు మరికొందరిని సైతం పట్టుకొని చంపి రంపచోడవరం ఏరియాలో ఎన్‌కౌంటర్ జరిగిందని కట్టు కథ అల్లారు. ఈ క్రూర హత్యలకు వ్యతిరేకంగా ఈనెల 23న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించాలని పిలుపునిస్తున్నాం' అని పేర్కొన్నారు.

హిడ్మా 'ఎన్‌కౌంటర్'పై న్యాయవిచారణ

- ఎన్‌హెచ్‌ఆర్సీలో పిటిషన్లు దాఖలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ఏపీలో హిడ్మా సహా మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్లు బూటకమని, వాటిపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో (ఎన్‌హెచ్‌ఆర్సీ) పిటిషన్లు దాఖలయ్యాయి. తెలంగాణకు చెందిన హక్కుల కార్యకర్త, న్యాయవాది నారాయణన్‌తోపాటు మరికొందరు వేర్వేరుగా ఈ పిటిషన్లు దాఖలుచేశారు.

టెక్ శంకర్ అంత్యక్రియలు పూర్తి

- శవయాత్రకు అనుమతి నిరాకరణపై నిరసన

మావోయిస్టు పార్టీ ఏవోబీ నేత మెట్టూరి జోగారావు (టెక్ శంకర్) అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులోని బాతుపురంలో పూర్తయ్యాయి. అయితే, ఆయన శవయాత్రకు వజ్రపుకొత్తూరు పోలీసులు అనుమతించకపోవడంతో ఏబీఎమ్ఎస్ నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, రంపచోడవరం ఆస్పత్రిలో ఉంచిన మావోయిస్టు మృతదేహాల్లో జ్యోతి, మల్ల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేశారు.

రాజమండ్రి జైలుకు మరో ఇద్దరు నక్సల్స్

- బాల మావోయిస్టులకు 5 వరకు రిమాండ్

విజయవాడలో అదుపులోకి తీసుకున్నవారిలో మరో ఇద్దరు మావోయిస్టులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. బుధవారం తీసుకువచ్చిన 15 మంది మావోయిస్టులతో కలిపి..ప్రస్తుతం ఈ జైలులో 17 మంది ఉన్నారు. ఇక.. మైనర్లుగా తేలిన ఇద్దరు బాల నక్సల్స్‌ను విజయవాడ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు (జువెనైల్) న్యాయాధికారి రాధిక ఆదేశాలతో విజయవాడ, విశాఖలోని సంరక్షణ కేంద్రాలకు తరలించారు.

ఎన్‌కౌంటర్లపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు

అల్లూరి జిల్లా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లపై పోలీసులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. ఈ రెండు ఘటనల్లోనూ కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారని ఆ ఎఫ్ఐఆర్‌ల్లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత తాము జరిపిన ఎదురుకాల్పుల్లో మొత్తం 13 మంది మావోయిస్టులు మరణించారని తెలిపారు. కాల్పుల సందర్భంగా తాము మొత్తం 255 ఏకే 47 తూటాలను వినియోగించామని మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ ఎఫ్ఐఆర్‌ల్లో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.